# లోకల్ గైడ్
LGTV
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,143 | పేజీలు -12 | ఆదివారం - 22 - మార్చి - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, Yadadri Bhuvanagiri



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094


## ఎగుమతి చేయడానికి చమురు నిల్వలు ఉంటేకదా..: ఇరాన్

ఎగుమతి చేయడానికి తమ వద్ద చమురు నిల్వలు లేవని ఇరాన్ సంచలన ప్రకటన




దేశీయ అవసరాలు, వ్యూహాత్మక నిల్వలకు మాత్రమే ప్రస్తుతం చమురు అందుబాటులో ఉంది

అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేసే స్థితిలో తమ దేశం లేదు

## ఇరాన్‌లోని నతాంజ్ అణుకేంద్రంపై మరోసారి దాడి

రేడియా ధార్మిక పదార్థాల లీకేజ్ జరగలేదు




పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు

నతాంజ్ అణుశుద్ధి కర్మాగారంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ ఖండించింది

## ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా భారత్ సాయం కోరినట్లు వార్తలు.. స్పందించిన కేంద్రం




ఇలాంటి అసత్య ప్రచారాలను విశ్వసించవద్దు

పశ్చిమాసియాలో 22 రోజుల క్రితం ప్రారంభమైన యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది

నిరాధారమైన, కల్పిత విషయాలపై జాగ్రత్తగా ఉండాలి

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారత్‌పై కొన్ని అసత్య ప్రచారాలు జరుగుతున్నాయి

## తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



- తిరుమల శ్రీవారి భక్తులకు అందించే ప్రసాదాలు, అన్నప్రసాదాల నాణ్యతను మరింత పెంచే దిశగా కీలక అడుగు
- సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు
- ప్రతి ఏటా మనవడు దేవాన్ష్ పుట్టినరోజున అన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చే సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం కొనసాగిస్తోంది మిగతా..2లో

# తెలంగాణకు ప్రధాని మోదీ!

## రానున్న పది, పదిహేను రోజుల్లో మోదీ పర్యటన ఉండే అవకాశం

- ★ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ..
- ★ గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల కోసం పరేడ్ గ్రౌండ్లో ప్రధాని మోదీ బహిరంగ సభకు బీజేపీ ప్లాన్
- ★ జీహెచ్‌ఎంసీ ఎన్నికలు, మోదీ టూర్ ప్రధాన అజెండాగా ఈ సమావేశం




హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే తెలంగాణలో పర్యటించనున్నట్లు సమాచారం. రానున్న పది, పదిహేను రోజుల్లో మోదీ పర్యటన ఉండే అవకాశం ఉంది. మోదీ పర్యటన, జీహెచ్‌ఎంసీ ఎన్నికలే ప్రధాన ఎజెండాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేడు పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. వివరాల మేరకు.. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ.. తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో మోదీ తెలంగాణలో కూడా పర్యటించేలా స్థానిక నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభోత్సవం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. అలాగే, గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల కోసం పరేడ్ గ్రౌండ్లో ప్రధాని మోదీ బహిరంగ సభకు బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఇక, ఇప్పటికే స్థానిక నేతలకు మోదీ టూర్‌పై రాష్ట్ర నాయకత్వం సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ నేతలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇంటర్నల్ సమావేశం ఏర్పాటుచేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు, మోదీ టూర్ ప్రధాన అజెండాగా ఈ సమావేశం జరగనున్నట్లు సమాచారం. కాగా, మోదీ పర్యటనతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగే అవకాశం ఉంది.




## స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోంది

- సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి: సజ్జనార్
- అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి
- "ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి
- మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారు




## రూ.44 లక్షల భారీ విరాళాన్ని నారా కుటుంబం అందజేత

- తిరుమల వీధుల్లో నడుస్తూ.. భక్తుల సమస్యలు అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు..
- లడ్డూ ప్రసాదం నాణ్యత ఎలా ఉందని ప్రశ్నించగా, చాలా బాగుందని భక్తులు బదులిచ్చారు
- దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని పలువురు భక్తులు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు
- భక్తుల సౌకర్యం కోసమే టీటీడీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేసింది

# లక్ష ఉద్యోగాలతో ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

## శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు

- ➤ సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం
- ➤ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ ముందడుగు
- ➤ రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గత 21 నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు
- ➤ తొలిదశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గత 21 నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు ఉత్పాదక సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా), రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ మిగతా..2లో

## కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- గర్భాలయంలో పూజల అనంతరం బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు

హైదరాబాద్: జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు. ఆ వెలితిని పూడ్చుకుంటూ మళ్ళీ ఆలయానికి విచ్చేశారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీజేపీ నేతలు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

# తెలుగు రాష్ట్రాల్లో కొండెక్కిన కోడి ధర..

## మధ్య తరగతి గుండెల్లో రైళ్లు!

కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి

కేవలం ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు

విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది



హైదరాబాద్/అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ప్రియులకు ఆదివారం భోజనం భారంగా మారబోతోంది. నిన్నటి వరకు సాదాసీదాగా ఉన్న కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిగతా..2లో

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి ప్రధాని మోదీ ఫోన్.

### పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ

పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించాం

పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం

హర్మూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు



ఢిల్లీ: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం ఉగ్రరూపం దాల్చుతున్న తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మరోసారి ఫోన్‌లో మిగతా..2లో

## "మోదీ కానీ, బీజేపీ కానీ మీ ఓటు హక్కును దొంగిలించనివ్వను

### ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కేంద్రం కుట్ర

ఓటర్ల జాబితా సవరణ పేరుతో మైనార్టీల ఓటు హక్కును కాలరాస్తోంది

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు

రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న మమత.. బీజేపీపై తీవ్ర వ్యాఖ్యలు



పశ్చిమ బెంగాల్ : పవిత్ర రంజాన్ పర్వదినం వేళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్న ఆమె, ముస్లిం మైనార్టీలను మిగతా..2లో

## ఇరాన్‌లోని నతాంజ్ అణుకేంద్రంపై మరోసారి దాడి

ఢిల్లీ: ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులు చేశాయి. ఈ మేరకు స్థానిక మీడియా వెల్లడించింది. అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయని తస్నిమ్ వార్తా సంస్థ తెలిపింది. అయితే రేడియా ధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని పేర్కొంది. నతాంజ్ అణుశుద్ధి కర్మాగారంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ ఖండించింది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం జరిగిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజామిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఈ నెల ప్రారంభంలో కూడా నతాంజ్ అణుశుద్ధి కర్మాగారంపై ఒకసారి దాడి జరిగింది.

## ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా భారత్ సాయం కోరినట్లు వార్తలు.. స్పందించిన కేంద్రం

ఢిల్లీ: ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికా భారత్ సహాయం కోరిందని సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన వార్తలంటూ కొట్టిపారేసింది. పశ్చిమాసియాలో 22 రోజుల క్రితం ప్రారంభమైన యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలో పశ్చిమ భారత్ నుంచి ఇరాన్‌పై దాడులు చేయడానికి వీలుగా మిలటరీ స్థావరాలను వినియోగించుకుంటామని అమెరికా అడిగినట్లు ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి ఇంగ్లీష్ మీడియాలో కథనాలు రావడంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇలాంటి అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని కోరింది. నిరాధారమైన, కల్పిత విషయాలపై జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారత్‌పై కొన్ని అసత్య ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో శ్రీలంకకు సమీపంలో ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచివేసింది. ఆ సమయంలో భారత పోర్టులను అమెరికా ఉపయోగించుకుంటోందనే ప్రచారం జరగగా, ప్రభుత్వం ఖండించింది. ఇటీవల శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిసనాయక ఆ దేశ పార్లమెంటులో మాట్లాడుతూ, రెండు యుద్ధ విమానాల కోసం అమెరికా తమ పోర్టులను ఉపయోగించుకుంటామని చెబితే తిరస్కరించామని వెల్లడించారు. తాము యుద్ధంలో తటస్థంగా ఉంటున్నామని, అందుకే తమ పోర్టులను ఉపయోగించుకోవడానికి అంగీకరించలేదని తెలిపారు. శ్రీలంక అధ్యక్షుడి ప్రకటన అనంతరం భారత్ సహాయం కూడా అమెరికా కోరినట్లు ప్రచారం జరగడం గమనార్హం.

## ఎగుమతి చేయడానికి చమురు నిల్వలు ఉంటేకదా..: ఇరాన్

ఢిల్లీ: ఎగుమతి చేయడానికి తమ వద్ద చమురు నిల్వలు లేవని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. దేశీయ అవసరాలు, వ్యూహాత్మక నిల్వలకు మాత్రమే ప్రస్తుతం చమురు అందుబాటులో ఉందని, అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేసే స్థితిలో తమ దేశం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. అమెరికా విధించిన ఆంక్షల కారణంగానే చమురు ఉత్పత్తి, రవాణాపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన అంగీకరించారు. ఇరాన్ అక్రమంగా చమురు ఎగుమతి చేస్తోందంటూ అమెరికా చేస్తున్న ఆరోపణలను అరాఘ్చీ తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ కేవలం తమ దేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి, ప్రపంచ దేశాలను అయోమయానికి గురిచేయడానికి అమెరికా ఆడుతున్న 'మైండ్ గేమ్స్' అని ఆయన అభివర్ణించారు. వాషింగ్టన్ ఇలాంటి తప్పుడు ప్రచారాలతో తమపై ఆర్థిక యుద్ధం చేస్తోందని ఆరోపించారు. చమురు ఎగుమతులపై ఆధారపడిన ఆర్థిక మూలాలను దెబ్బతీసి, తమను లొంగదీసుకోవాలని అమెరికా ప్రయత్నిస్తోందని, కానీ తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని అరాఘ్చీ తేల్చిచెప్పారు. ఇరాన్ తాజా ప్రకటనతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో కలకలం రేగింది. ప్రపంచానికి చమురు సరఫరా చేసే ప్రధాన దేశాల్లో ఇరాన్ ఒకటి కావడంతో, తాజా ప్రకటన ఇంధన ధరలు భారీగా పెరిగేందుకు దారితీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్ నుంచి అధికంగా చమురు దిగుమతి చేసుకునే ఆసియా దేశాలపై ఈ ప్రభావం ఎక్కువగా పడే అవకాశం ఉంది.

## రూ.44 లక్షల భారీ విరాళాన్ని నారా కుటుంబం అందజేత

అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడు మనవడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కుమారుడైన దేవాన్ష్ జన్మదిన వేడుకలు తిరుమలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం సీఎం చంద్రబాబు తిరుమల వీధుల్లో నడుస్తూ సామాన్య భక్తులతో ముచ్చటించారు. శ్రీవారి దర్శనం త్వరితగతిన పూర్తయ్యేలా చూసేందుకు త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ప్రవేశపెట్టనున్నట్టు భక్తులకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి భువనేశ్వరి, మంత్రి లోకేశ్, దేవాన్ష్ కలిసి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయానికి చేరుకున్నారు. వీరికి టీటీడీ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని, శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు ఒకరోజు వితరణ ఖర్చు కింద రూ.44 లక్షల భారీ విరాళాన్ని నారా కుటుంబం అందజేసింది. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, దేవాన్ష్ స్వయంగా భక్తులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమాల తర్వాత సీఎం చంద్రబాబు తన కాన్వాయ్ దిగి తిరుమల మాడ వీధుల్లో కొద్దిసేపు కాలినడకన పర్యటించారు. ఈ సమయంలో భక్తులను ఆపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లడ్డూ ప్రసాదం నాణ్యత ఎలా ఉందని ప్రశ్నించగా, చాలా బాగుందని భక్తులు బదులిచ్చారు. దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని పలువురు భక్తులు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు. భక్తుల సౌకర్యం కోసమే టీటీడీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, దర్శన ప్రక్రియను వేగవంతం చేయడానికి ఏఐ టెక్నాలజీని తీసుకువస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర, పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోంది

హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. "ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది. సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారు" అని తెలిపారు. ఆ ఫోటోలను వారితో పంచుకోగానే ఆ అపరిచితులు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు విజ్ఞప్తి ఒక్కటేనని, మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడవద్దని, ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దని, ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని అన్నారు. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేదానిపై గమనిస్తూ ఉండాలని సూచించారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు పట్టుబడబోమని సైబర్ నేరగాళ్లు భ్రమల్లో ఉండవద్దని, మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## "మోదీ కానీ, బీజేపీ కానీ మీ ఓటు హక్కును దొంగిలించనివ్వను

మొదటి పేజి తరువాయి

ముస్లిం మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ పేరుతో మైనార్టీల ఓటు హక్కును కాలరాస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, ముఖ్యంగా మైనార్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ తొలగింపులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. "మోదీ కానీ, బీజేపీ కానీ మీ ఓటు హక్కును దొంగిలించనివ్వను. ప్రజాస్వామ్యాన్ని, పౌరుల హక్కులను కాపాడేందుకు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడతాను" అని ఆమె అన్నారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. వెరిఫికేషన్ సాకుతో అర్హులైన వారిని జాబితా నుంచి తొలగించడం ద్వారా బీజేపీకి లబ్ధి చేకూర్చాలని చూస్తున్నారంటూ ఎన్నికల సంఘంపై మమత విమర్శలు గుప్పిస్తున్నారు. బెంగాల్‌ను టార్గెట్ చేసి, రాష్ట్రాన్ని విభజించాలని చూస్తున్న వారు 'నరకానికి' వెళతారంటూ ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. "హిందువులు, ముస్లిలు, సిక్కులు, క్రైస్తవులు ఇక్కడ అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తారు. ఈ సామాజిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరుకోం" అని మమత స్పష్టం చేశారు. బెంగాల్ అస్తిత్వాన్ని దెబ్బతీసే శక్తులకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

## తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి: తిరుమల శ్రీవారి భక్తులకు అందించే ప్రసాదాలు, అన్నప్రసాదాల నాణ్యతను మరింత పెంచే దిశగా కీలక అడుగు పడింది. తిరుమలలో స్టేట్ ఫుడ్ లాబరేటరీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్మించిన అత్యాధునిక వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి, పప్పులు, ఇతర ముడిసరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించి, భక్తులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల వచ్చిన సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ముఖ్యమంత్రి హోదాలో మహాద్వారం ద్వారా నేరుగా ఆలయ ప్రవేశం చేసే అవకాశం ఉన్నప్పటికీ, తన ఆనవాయతీని కొనసాగిస్తూ సామాన్య భక్తుడిలాగే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే స్వామివారి దర్శనానికి వెళ్లారు. సీఎం అయిన తొలిసారి నుంచి ఆయన ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించగా, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి ఏటా మనవడు దేవాన్ష్ పుట్టినరోజున అన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చే సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా ఒకరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షల విరాళాన్ని అన్నదానం ట్రస్టుకు అందజేశారు. దేవాన్ష్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 12 సార్లు ఈ విరాళాన్ని అందించారు. దర్శనానంతరం సీఎం, ఆయన కుటుంబ సభ్యులు కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. అక్కడ భోజనం చేస్తున్న భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించి, వారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాడ వీధుల్లో నడుచుకుంటూ వెళుతున్న ముఖ్యమంత్రిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఈ క్రమంలో, చంద్రబాబు తన సెక్యూరిటీ ప్రోటోకాల్ ను పక్కనపెట్టి, నేరుగా భక్తుల వద్దకు వెళ్లి వారితో కరచాలనం చేస్తూ, ఫొటోలు దిగుతూ ఆనందం కలిగించారు. ఈ క్రమంలో ఓ భక్తురాలు సీఎంకు కరుంగళి మాలను బహూకరించగా, ఆయన ఆప్యాయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుమలలో అందుతున్న సౌకర్యాలపై సీఎం భక్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లడ్డూ ప్రసాదం నాణ్యత గురించి అడగ్గా, గతంతో పోలిస్తే నాణ్యత చాలా మెరుగుపడిందని, రుచి బాగుందని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని కొందరు భక్తులు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు. భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ద్వారా శ్రీవారి దర్శనం మరింత సులభతరం, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి ప్రధాని మోదీ ఫోన్.

మొదటి పేజి తరువాయి

ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మరోసారి ఫోన్‌లో సంభాషించారు. ఈ ఫోన్ కాల్‌లో మోదీ ఇరాన్ ప్రజలకు ఈద్, నౌరూజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు నేతలు ప్రాంతీయ భద్రత, స్థిరత్వంపై కీలక అంశాలను చర్చించుకున్నారు. ఇజ్రాయెల్, అమెరికాతో ఇరాన్ ఘర్షణ పూరిత వాతావరణంలో ఉన్న నేపథ్యంలో ఈ సంభాషణకు దౌత్యపరంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. "ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడాను. ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగల సమయం పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించాం" అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చల సందర్భంగా, పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, హర్మూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత, సంక్షేమానికి ఇరాన్ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తమ పౌరుల భద్రతకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశాన్ని ఇది పరోక్షంగా తెలియజేసింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న దౌత్య ప్రయత్నాల్లో ఇదొక ముఖ్యమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి చర్చలే సరైన మార్గమని భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసినట్లయింది. ఇదిలా ఉండగా, మార్చి 12న జరిగిన తొలి ఫోన్ సంభాషణలో కూడా ప్రధాని మోదీ పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల మరణాలు, మౌలిక సదుపాయాల విధ్వంసంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ స్థిరమైన వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. సరుకు రవాణా, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై, ప్రాంతీయ స్థిరత్వంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

## తెలుగు రాష్ట్రాల్లో కొండెక్కిన కోడి ధర..

మొదటి పేజి తరువాయి

కేవలం ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ఏపీలో నిన్నటి కంటే ఈరోజు ఏకంగా రూ. 70 అదనంగా పెరగడం గమనార్హం. విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది. హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు. అసలు దీని ధర అడిగితేనే గుండె జారిపోయేలా ఉంది. కిలో నాటుకోడి ఏకంగా రూ. 800 పలుకుతోంది. అంటే దాదాపు మటన్ ధరతో పోటీ పడుతోంది. వ్యాపారులు మరియు పౌల్ట్రీ రైతుల విశ్లేషణ ప్రకారం ఈ పెరుగుదల వెనుక ఐదు కీలక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన ఎండల వల్ల కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. దీంతో మార్కెట్‌లోకి రావాల్సిన సప్లై గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రంజాన్ పండుగ కావడంతో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ రెట్టింపయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. అలాగే కోళ్లకు వేసే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు రేట్లు పెంచక తప్పడం లేదు.

## లక్ష ఉద్యోగాలతో ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఈనెల 23వ తేదీన (సోమవారం) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులతో కలిసి భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్నే మార్చగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. తొలిదశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, ఈ ప్లాంట్ ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. దేశీయంగా పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌ను అందుకోవడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది.

### అనుబంధంగా క్యాప్టివ్ పోర్టు.. మరో 6,000 ఉద్యోగాలు

ఈ భారీ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా ఏఎంఎన్ఎస్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనుంది. ఇందుకోసం అదనంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 316 ఎకరాల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ పోర్టును అభివృద్ధి చేస్తారు. ఈ పోర్టు నిర్మాణం ద్వారా మరో 6,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా (హబ్) రూపాంతరం చెందనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. పరిశ్రమకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను శరవేగంగా కల్పిస్తోంది. ప్లాంట్‌ను జాతీయ రహదారి-16తో అనుసంధానించేందుకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులను కూడా ప్రభుత్వం చేపట్టింది.

సీఎం పర్యటన వివరాలు

సోమవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆయన అమరావతి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం రాజయ్యపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3:40 గంటలకు ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి, అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక తిరిగి అమరావతికి పయనమవుతారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేశ్ సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు: కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, వాటికి చట్టబద్ధమైన హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఈ అంశానికి సంబంధించి ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే శుక్రవారం అసెంబ్లీలో తాము 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెట్టబోతున్నామని, దీనికి అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నామని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజే 6 గ్యారెంటీల ఫైలుపై సంతకం చేశారని, గవర్నర్ ప్రసంగంలో కూడా ఇదే చెప్పించారని... కానీ ఇప్పుడు ఆ ఫైలు ఎక్కడుందో తెలియడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఈ బిల్లు చట్టంగా మారితే... మహిళలకు రావాల్సిన రూ.2,500, రైతులకు రూ.15,000 రైతు భరోసా, విద్యార్థులకు విద్యా భరోసా వంటివి ప్రజల హక్కుగా మారుతాయని, ప్రభుత్వం ఎగ్గొట్టే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. గతంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కూడా బీజేపీ ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లును ఆమోదించి చట్టం చేసిన దాఖలాలు ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఆరు గ్యారెంటీల్లో కనీసం 'అర' గ్యారెంటీ కూడా సరిగ్గా అమలు కాలేదని, 4 కోట్ల మంది ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఎద్దేవా చేశారు.

## ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం ఇజ్రాయెల్ రక్షణ మంత్రి

ఢిల్లీ: ఇరాన్‌పై వచ్చేవారం దాడులు మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉధృతం చేస్తామని కాట్జ్ తెలిపినట్లుగా ఇజ్రాయెల్ పత్రిక ఒకటి తెలిపింది. ఇరాన్ పాలకులు, ఆ దేశానికి ఆదాయవనరుగా ఉన్న మౌలిక సదుపాయాలపై తమ రెండు దేశాలు జరిపే దాడులు మరింత పెరుగుతాయని అన్నారు. ఈ యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని కాట్జ్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇరాన్‌పై క్రమంగా సైనిక చర్యను తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛను కల్పించడమే తమ ముందున్న లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ అన్నారు.

## ఆధునిక యుద్ధాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి: రాజ్‌నాథ్ సింగ్

ఢిల్లీ: ఆధునిక యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను, సైబర్ స్పేస్‌ను దెబ్బతీస్తున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని అన్నారు. యుద్ధం సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలో భాగమయ్యాయని పేర్కొన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి దేశపౌరుడు అన్ని సమయాల్లో దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. ఆధునిక యుద్ధాలకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సాయుధ దళాలకు ఆధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశ రక్షణలో యువత తనవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, యువత దేశం కోసం ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సైన్యం, పౌరులు బలంగా ఉంటేనే దేశం ముందుకు సాగుతుందని అన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. పీపీపీ నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారని, ఇది చారిత్రాత్మక ముందడుగు అన్నారు. ఇది దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందని అన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్: సిద్దిపేట అభివృద్ధికి నిధులు రద్దు చేశారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేపు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన పలు ప్రశ్నలతో బహిరంగ లేఖ రాశారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం తాము చేస్తే శిలాఫలకం మీది ఎందుకని ప్రశ్నించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్దిపేటకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గం లేదన్నట్లుగా ఇన్నాళ్లు వ్యవహరించారని విమర్శించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట సిద్దిపేటలో అడుగుపెడుతున్న ముఖ్యమంత్రికి తాను పలు ప్రశ్నలు సంధించదలుచుకున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ పామాయిల్ ఫ్యాక్టరీ అని పేర్కొన్నారు. కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన కృషి ఫలితమే అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు, పామాయిల్ తోటల సాగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. 2021 జూన్ 5న తొలి పామాయిల్ మొక్కను నాటింది తానేనని వెల్లడించారు. 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్‌ను ప్రారంభించామని తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీకి పునాదిరాయి వేసి పనులు ప్రారంభించామని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత్ర కొండంత అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర గోరంత కూడా లేదని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1,070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశారని ఆరోపించారు. నిధులను రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు అధికారిక పర్యటన చేస్తున్నందున, ఆ నిధులన్నీ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. రూ.170 కోట్ల మేర రైతు భరోసా నిధులు రాలేదని, వాటిని రేపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రద్దయి ఆగిపోయిన పనుల జాబితాను ఆయన పేర్కొన్నారు. రంగనాయకసాగర్ టూరిజం, కోమటిచెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగు రోడ్డు, తోర్నాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, మిట్టపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం, సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్, టు టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు, సిద్దిపేట-కిష్టాపూర్ రహదారి, సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం, సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ ఆగిపోయాయని అన్నారు.

## తితిదే ఆలయాలను అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి: చంద్రబాబు



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తితిదే బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

# భద్రాచలం పునర్‌నిర్మాణం పునరుజ్జీవనం ప్రాజెక్ట్ ప్రణాళికలపై విస్తృత చర్చ

### అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి కొండా సురేఖ




భద్రాచలం : లోకల్ గైడ్ :భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, పట్టణ సమగ్ర అభివృద్ధిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం



వెంకట్రావు, జాటోత్ రామ్ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు. "భద్రాచలం పునర్‌నిర్మాణం, పునరుజ్జీవనం" ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని, ఆలయం, పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యాత్రికుల సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పార్కింగ్ సదుపాయాలు, రహదారుల విస్తరణ, పరిశుభ్రత పరిరక్షణ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాడ వీధుల అభివృద్ధి, కల్యాణ మండప నిర్మాణం, రామవనం అభివృద్ధి, డిజిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్లు, తాగునీటి సరఫరా, శుభ్రమైన మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ఈ నెల మార్చి 27న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. కల్యాణ మండపాన్ని ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు లైటింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక చర్యలు, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ, రామయ్యర్‌తో పాటు ఇతర అధికారులు, ప్రాజెక్ట్ రూపకర్తలు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్ ఈద్గాలో ఘనంగా రంజాన్ ప్రార్థనలు

### -ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన తుమ్మల..పాండురంగా రెడ్డి



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్గాలో ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ పర్వదినం శాంతి, సౌహార్దం, సహనం, దానధర్మాలకు ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందించడానికి ఇటువంటి పండుగలు దోహదపడతాయని అన్నారు. అమీన్‌పూర్ ప్రాంతంలో రంజాన్ పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రార్థనలు సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయి. ప్రజా ప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలపడం ద్వారా మతసౌహార్దాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నం కనిపించింది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ తో పాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముస్లిం మత పెదలు, మైనార్టీ సోదరులు, స్థానిక ప్రజలు, పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

# రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మిరియాల ప్రీతమ్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ఈద్ పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మాసం ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, ఆధ్యాత్మికత, సహనం, సత్ప్రవర్తనను పెంపొందించే పవిత్ర కాలమని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం, సమాజంలో సహానుభూతి, సోదరభావం పెంపొందించడం ఈ పండుగ యొక్క ప్రధాన సందేశమని అన్నారు. రంజాన్ ద్వారా సమస్త మానవాళికి శాంతి, ప్రేమ, సామరస్యాన్ని అందించే ఆధ్యాత్మిక సందేశం వెలుగొందుతుందని, ఈద్ పండుగ అందరికీ సుఖశాంతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని ముస్లిం సోదరులందరికీ "ఈద్ ముబారక్" అంటూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సేవే లక్ష్యంగా సునీత ప్రభాకర్ రెడ్డి ముందడుగు కార్పొరేటర్ రేసులో

### -చందానగర్ అభివృద్ధికి మాజీ కౌన్సిలర్, సునీత ప్రభాకర్ రెడ్డి హామీ, కార్పొరేటర్ గా అవకాశానికి ప్రజల మద్దతు

### -రిజర్వేషన్ మారితే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం..ప్రభాకర్ రెడ్డి అభ్యర్థిత్వంపై చర్చ



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిస్థితులు వేడెక్కుతున్నాయి. మహిళా రిజర్వేషన్ అమలు కాకపోతే, గత 30 సంవత్సరాలుగా ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రభాకర్ రెడ్డి కార్పొరేటర్ అభ్యర్థిగా రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభాకర్ రెడ్డి స్థానిక సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలకు చేరువగా ఉండటంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలలో కూడా చురుకుగా పాల్గొంటున్నారు. మూడు దశాబ్దాల అనుభవంతోఎ ప్రజల నమ్మకాన్ని సంపాదించిన ఆయన, చందానగర్ అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మహిళా రిజర్వేషన్ అమలైతే మాజీ కౌన్సిలర్, ప్రస్తుత శేరిలింగంపల్లి కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీత ప్రభాకర్ రెడ్డి అభ్యర్థిత్వం బలంగా ఉండగా, రిజర్వేషన్ లేకపోతే ప్రభాకర్ రెడ్డి పోటీకి దిగే అవకాశాలు ఉండటంతో చందానగర్ రాజకీయాలలో కొత్త సమీకరణాలు ఏర్పడు తున్నాయి ఈ నేపథ్యంలో, స్థానిక ప్రజలు, నాయకుల మధ్య చర్చలు మరింత వేగం పుంజుకుంటున్నా యి. రాబోయే ఎన్నికలలో ఎవరు పోటీ చేస్తారు, ప్రజల మద్దతు ఎవరికి లభిస్తుంది అన్నది ఆసక్తికరంగా మారింది. రిజర్వేషన్ నిర్ణయంపై ఆధారపడి చందానగర్ కార్పొరేటర్ పోటీ రూపురేఖలు మారే అవకాశం ఉండగా, కాంగ్రెస్ పార్టీ నుండి ప్రభాకర్ రెడ్డి అభ్యర్థిత్వం స్థానిక రాజకీయాలలో కీలకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# బీసీ సబ్ ప్లాన్ అమలుపై టీఆర్‌పీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపు

### -ఎన్నికల హామీలు నిలబెట్టలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

### -టిఆర్ పి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



హైదరాబాద్, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆధ్వర్యంలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. 2026 మార్చి 23 సోమవారం ఈ నిరసనలు జరగనున్నాయి. టీఆర్‌పీ నాయకత్వం ఆరోపణ ల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయకపోవడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రతి సంవత్సరం బీసీలకు రూ.20,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే కేటాయించడం బీసీ వర్గాలపై అన్యాయం అని పేర్కొన్నారు. అదే సమయంలో బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రత్యేకంగా రూ.55 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలని టీఆర్‌పీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలలో పార్టీ కార్యకర్తలు, బీసీ సంఘాలు నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిరసనలలో భాగంగా ప్రజలు నలుపు దుస్తులు ధరించడం లేదా నలుపు రిబ్బన్ కట్టుకోవడం ద్వారా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయాలని సూచించారు. ఈ నిరసన పిలుపు తెలంగాణలో బీసీ రాజకీయాల ప్రాధాన్యతను మరోసారి వెలుగులోకి తెస్తోంది. బీసీ వర్గాలు రాష్ట్ర జనాభాలో పెద్ద శాతం ఉండటంతో, వారికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు రాజకీయంగా కీలకంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కేటాయింపులు, టీఆర్‌పీ డిమాండ్ చేస్తున్న మొత్తం మధ్య పెద్ద తేడా ఉండటం రాజకీయ వాదోపవాదాలకు దారి తీస్తోంది. ఎన్నికల హామీల అమలు విషయంలో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఒత్తిడి పెంచే అవకాశాలు ఉన్నాయి. ఇక ఈ నిరసనలు ఎంతవరకు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయన్నది, భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ప్రభావం చూపే అంశంగా మారవచ్చు అని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు



చర్ల : లోకల్ గైడ్ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజలను మోసం చేసే విధంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు విమర్శించారు. ఈ బడ్జెట్ పేదలకు ఉపయోగపడని, వాస్తవికత లేని బడ్జెట్గా ఉందన్నారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలను మూడు సంవత్సరాలు గడిచినా అమలు చేయలేకపోయిందని ఆయన ఆరోపించారు. ప్రజలను, ఉద్యోగులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. "ఓడ ఎక్కే వరకు ఓడ మల్లయ్య, ఓడ ఎక్కిన తర్వాత బోడి మల్లయ్య" అన్నట్లు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వం ప్రకటించిన పథకాలలో రైతు భరోసా, కౌలు రైతులకు ఎకరాకు రూ 15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ 12 వేలు, దళిత బంధు, బీసీ బంధు, ఆసరా పెన్షన్ రూ 4 వేలు, వికలాంగులకు రూ 6 వేలు, మహిళలకు నెలకు రు 2,500లు, రూ 500కే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ భృతి వంటి పథకాలు అమలు కాలేదన్నారు. విద్యార్థులకు రూ 5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్, రెండు లక్షల ఉద్యోగాలు, అంగన్వాడీ టీచర్లకు రూ 26,000 వేతనం వంటి హామీలు కూడా నెరవేర్చలేదని తెలిపారు.రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు లేకపోవడం, రోడ్లు వేయకపోవడం, ప్రాజెక్టులు నిర్మించకపోవడం, ప్రజా సంక్షేమం పట్టించుకోకపోవడం జరుగుతోందని తాతారావు అన్నారు. ప్రభుత్వం పథకాలను అమలు చేయకుండా కేవలం విమర్శలకే పరిమితమైందని, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని తెలిపారు. 2029 ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

# సమైక్యతా సౌరభం.. రంజాన్ సంబరం!- ముస్లిం సోదరులతో తుంబూరు దయాకర్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం



ఖమ్మం : లోకల్ గైడ్ :భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంక్షేమ పథకాలపై భరోసా

ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం" అని భరోసా ఇచ్చారు.



## ఆత్మీయ ఆతిథ్యం

పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్ రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అక్బర్‌పేట భూంపల్లి మండలంలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్ తెలంగాణ) మార్చి21:అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో ఈరోజు మక్కల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల డైరెక్టర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాసరెడ్డి గారు మాట్లాడుతూ రైతులు తమ పంటను దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్మాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.2400 చొప్పున మక్కలను విక్రయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం ఏఎంసీ డైరెక్టర్ మండల్ నరసింహులు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని, నష్టపోకుండా తమ పంటకు సరైన ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ - ఈద్గా - సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన....

### రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ .



సత్తుపల్లి :లోకల్ గైడ్ :పట్టణం ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు... అనంతరం ఈద్గాలో మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదరులకు అన్ని విధాల తోడుగా అండగా ఉంటుందని , వారి



అభివృద్ధికి సహకరిస్తుందని రంజాన్ పండుగ సందర్భంగా తెలియజేశారు... తెలంగాణ రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులు గల ప్రతి ఒక్కరికి అందుతాయి అని తెలిపారు... రాజకీయ చరిత్రలో మొట్టమొదటిసారి సత్తుపల్లి పట్టణంలో ముస్లిం మహిళకు మున్సిపల్ కమిషనర్ గా రిహానా బేగం కమల్ పాషానీ మించడం జరిగిందని ముస్లిం సోదరులకు తెలియజేశారు... సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మునిసిపాలిటీ అభివృద్ధి చెందుతుందని హామీ ఇచ్చారు.... సత్తుపల్లి పట్టణంలో అతి త్వరలో షాదీఖానా, ఈద్గా అభివృద్ధి పనులు పూర్తి అవుతాయని తెలిపారు... ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమలపాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, ముస్లిం కౌన్సిలర్స్ గ్రాండ్ మౌలాలి, హకీమ్, షరీఫ్ మరియు సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదు చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు మరియు సత్తుపల్లి పట్టణ మరియు మండలం ముస్లిం సోదరులు మరియు సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు...

# రంజాన్ పండుగ సందర్భంగా డిప్యూటీ మేయర్ నివాసంలో శుభాకాంక్షలు తెలిపిన మేయర్



ఖమ్మం :లోకల్ గైడ్ :పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామ్ హిల్స్‌నందు డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్ ముక్తార్ నివాసంలో శుభాకాంక్షల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ హాజరై డిప్యూటీ మేయర్



దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొల్పే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డ్రా.తుమ్మల యుగంధర్, కార్పొరేటర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# వంగూరి వాచకం -నవరత్నాలు



1. మండే
ఎండకు
నీడనిచ్చే చెట్టే
నీకు చుట్టం
రగిలే గుండెకు
ఓదార్చే మాటే
కదా పట్టం.

2. మనసున
మాటేసిన
పశుత్వాన్ని
ఓడిస్తే గెలుపు
మనిషిలో
నిక్షిప్తమైన
మానవత్వం
జయిస్తే మలుపు.

3. నీటితో
గది శుభ్రం
నీతితో
మది శుభ్రం.

4. అద్దమైనా
అవసరంలేని
అందమైన
అలంకరణం
పెదవులు
రెండు వేరు చేసి
మనసారా చేసే మందహాసం.

5. ఉన్నది నిలుపుకోవాలని
ఒకరి ఆరాటం
లేనిది కలుపుకోవాలని
మరొకరి ఉబలాటం.

6. చిన్న చిన్న కష్టాలకే
చిర్రుబు ర్రులేమిటి
మండు టెండలో శ్రమించి
మధురఫలాలివ్వదా మామిడి.

7. నోటితో చెవులను
మెప్పించేవాడు గాయకుడు
నొసటితో జనులను
నడిపించేవాడు నాయకుడు.

8. పెళ్లంటే ముదులు మూడు
అడుగులు అయితే మాత్రం ఏడు
ఫోటోలు వీడియోలు చూడు
అటూ ఇటూ తిప్పి కొట్టుడు బోలెడు.

9. సంబంధాలు చూపాలంటే
మ్యారేజ్ బ్యూరోలు
సంబంధాలు కుదరాలంటే
ప్యాకేజీ బేరాలు.

**వంగూరి గంగిరెడ్డి**
**9652286270**
**షాద్ నగర్**

## శేరిలింగంపల్లి లో రంజన్ సందర్భంగా ఈద్ ఉల్ ఫితర్

–శుభాకాంక్షలు తెలిపిన..మారబోయిన రవి యాదవ్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): పవిత్ర రంజాన్ మాసం ముగింపును సూచించే ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ మాజీ యూత్ వైస్ ప్రెసిడెంట్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి మూడు డివిజన్ల ఇంచార్జ్ మారబోయిన రవి యాదవ్ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మాసం మనుషులలో క్రమశిక్షణ, ఆత్మపరిశీలన, సహనం, దాతృత్వం వంటి మహత్తర గుణాలను పెంపొందించే పవిత్ర కాలమని పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు, నమాజ్‌లు, సేవా కార్యక్రమాలతో గడిచే ఈ పవిత్ర నెల అనంతరం వచ్చే ఈద్ పండుగ ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సహకారం పెంపొందించడంలో ఇలాంటి పండుగలు ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈద్ సందేశం సమానత్వం, సోదరభావాన్ని మరింత బలపరచాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, అల్లా కరుణాకటాక్షాలు అందరికీ లభించాలని ప్రార్థించారు. ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ అధిష్టానంతో మంచి పేరు సంపాదించుకున్న మారబోయిన రవి యాదవ్, నియోజకవర్గంలో యువతను సమీకరించడం, ప్రజలకు అందుబాటులో ఉండడం, సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. పార్టీ పట్ల నిబద్ధతతో పాటు సామాజిక సేవలోనూ ముందుండి పనిచేస్తూ స్థానిక నాయకత్వంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి ముస్లిం సోదరులకు ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యాన్ని నింపాలని ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ నెలలో ఆచరించే ఉపవాస దీక్షలు మనుషులలో క్రమశిక్షణ, దయ, సహనాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అల్లాహ్ కరుణ ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని, సమాజంలో ఐక్యత, సౌహార్దం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినం అందరికీ శుభాలను తీసుకురావాలని కోరుతూ, ముస్లిం సోదరులు సంతోషంగా, శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. హమీద్ పటేల్ తన తరఫున, తన కుటుంబ సభ్యుల తరఫున రంజాన్ పర్వదిన శుభాకాంక్షలను తెలియజేశారు.

## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన

–శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాతృశ్రీ నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ..స్వరాష్ట్రంలో పేద ముస్లింలకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. అన్ని కులాలు, మతాలను సమానంగా చూసే సెక్యులర్ నాయకత్వంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, నియోజకవర్గ నాయకులు బల్లింగ్ యాదగిరి గౌడ్, శేఖర్ ముదిరాజ్, దేవరాజ్, మల్లికార్జున్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్, మునఫ్ ఖాన్, హమీద్, రహీం, హనీఫ్, ఖాజా, ముషారఫ్, ఇస్మాయిల్, ముక్తార్, జాఫర్, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగంవచేసుకోవాలి

ఎంపి .డీకే అరుణ



నారాయణపేట మార్చి 21(లోకల్ గైడ్ : పేద ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకా లను సద్వినియోగం చేసుకో వాలని పాలమూరు ఎంపీ డి కే అరుణ అన్నా రు.శనివా రం ఆమె క్యాంపు కార్యాల యంలో నారాయ ణపేట నియోజక వర్గానికి చెందిన అయిదు మంది లబ్ధిదారుల కు సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను పంపిణీ చేశారు. నారా యణపేట పట్టణానికి చెంది న అనారోగ్యంతో బాధపడిన వారికి వైద్య ఖర్చుల నిమి త్తం ప్రభుత్వం పరంగా చెక్కు లుఅందజేశారు.నారాయణపేట పట్టణానికి చెందిన టక్ సూర్యకాంత్ కు 14 వేలు, రూప కు 24 వేలు,కందు కూరు నర్సమ్మ కు11 వేలు, దామరిగిద్ద మండలం జే.మొగులప్ప కు11 వేలు,సి సి కుంటకు చెందిన గోళ్ళ మణెమ్మకు 38 వేల చెక్కు లను అందజేశారు.ఈ సంద ర్భంగా ఎంపి అరుణమ్మ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథ కాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ,బిజెపి నాయకులు మొగులప్ప,ఉమాకాంత్,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



నారాయణపేట మార్చి 21: ముస్లింల పవిత్ర పండగ రంజాన్ వేడుకలు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగావ్ ముస్లింలు ఉదయమే చిన్న పెద్దలు అందరూ ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ ఒకరికొకరు ఆలింగ నం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.కాగా నారాయణపేట జిల్లా కేంద్రం లోనీ ఈద్గా లో వివిధ పార్టీల నాయకులు చేరుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి,డిసిసి మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి,జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్య యాదవ్,కౌన్సిలర్ అపిరెడ్డి పల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ నల్లపు లింగయ్య



నారాయణపేట మార్చి 21(లోకల్ గైడ్ :రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణ పేట జిల్లాలోని ఈద్గాలు, మసీదులు,ప్రార్థన మందిరా ల వద్ద ఎలాంటి అవాంచనీ య సంఘటనలు జరగకుం డా పోలీసులు పోలీస్ అధికా రులు, సిబ్బంది కట్టుదిట్ట మైన బందోబస్తు నిర్వహిం చారు.ఈ సందర్భంగా డిఎస్పీ ఎన్. లింగయ్య జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా అవసరమైన సూచ నలు సిబ్బందికి ఇచ్చారు.అనంతరం అక్కడికి విచ్చేసి న ముస్లింలకు రంజాన్ పం దుగ శుభాకాంక్షలు తెలి యజేశారు. శాంతి, సామ రస్య వాతావరణంలో పండు గను జరుపుకోవాలని కోరారు.

# రాష్ట్రవ్యాప్తంగా భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ల 95 వ, వర్ధంతి వేడుకలు నిర్వహించాలి

పీడీఎస్‌యూ, రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, పీవైఎల్ రాష్ట్ర శివ

భగత్‌సింగ్ త్యాగాలు యువతకు మార్గదర్శకం

నాయకుల సందేశం

విద్య, ఉపాధి హక్కుల కోసం యువత ఉద్యమించాలి.



ఖమ్మం జిల్లా, కారేపల్లి :లోకల్ గైడ్, మార్చి 21 : కారేపల్లి మండల కేంద్రంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు శివ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలను విస్తృతంగా, ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి విద్యాసంస్థలో విప్లవ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ (19071931) భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహావిప్లవకారుడని, కేవలం 23 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదురు నిలబడి దేశ స్వాతంత్ర్యానికి తన ప్రాణాలను అర్పించిన గొప్ప వీరుడని కొనియాడారు. “ఇంక్విలాబ్ జిందాబాద్” అనే నినాదంతో యువతలో విప్లవ స్ఫూర్తిని నింపిన ఆయన, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి 1931 మార్చి 23న లాహోర్ జైల్లో ఉరి శిక్షను చిరునవ్వుతో స్వీకరించిన ఘట్టాన్ని వారు స్మరించారు. భగత్‌సింగ్ చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలతో పెరిగారని, జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ ఆయన మనసుపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతు తెలిపినా, చౌరీచౌరా ఘటన తర్వాత విప్లవాత్మక మార్గాన్ని ఎంచుకున్నారని వివరించారు. 1929 లో బటుకేశ్వర్ దత్‌తో కలిసి ఢిల్లీ సెంట్రల్ అసెంబ్లీలో హానికరం కాని బాంబులు విసిరి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గళమెత్తిన ఘటనను ప్రస్తావించారు. అలాగే జైలులో ఖైదీల హక్కుల కోసం 116 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టి పోరాట స్ఫూర్తిని చాటిన గొప్ప నాయకుడని అన్నారు.నేటి స్వాతంత్ర్య భారతదేశ పరిస్థితులపై వారు ఆందోళన వ్యక్తం చేస్తూ దేశంలో కుల, మత, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, సామాజిక న్యాయం బలహీనపడుతోందని విమర్శించారు. విద్యా రంగం పూర్తిగా వ్యాపారంగా మారి ప్రతి ఏటా లక్షలాది మంది పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 79 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశం ఇప్పటికీ పేదలకు నాణ్యమైన, సమాన విద్యను అందించలేకపోవడం బాధాకరమని అన్నారు. అదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ మూసివేస్తున్నారని, దీని వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమవుతోందని ఆరోపించారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు దేశ సంపదను కట్టబెడుతున్న విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.అంతర్జాతీయ రాజకీయాలపై స్పందిస్తూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండించాలని, ప్రపంచంపై ఆధిపత్యం కోసం జరుగుతున్న యుద్ధ రాజకీయాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అలాగే యూజీసీ సమానత్వ మార్గదర్శకాలపై సుప్రీంకోర్టు విధించిన స్టేను ఎత్తివేసి విద్యలో సమానత్వాన్ని సాధించాలని డిమాండ్ చేశారు.

**డిమాండ్లు:**

దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న విధానాలను నిలదీయాలి అమెరికా సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను ఖండించాలి నూతన జాతీయ విద్య విధానాన్ని రద్దు చేయాలి విద్య, ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం యువత ఉద్యమించాలిడఈ కార్యక్రమంలో పీవైఎల్ మహబూబాబాద్ జిల్లా నాయకుడు గణేష్‌తో పాటు పీడీఎస్‌యూపీవైఎల్ నాయకులు ప్రమోద్, రాజేష్, కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నాయకులు యువతకు పిలుపునిస్తూ భగత్‌సింగ్ చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కట్టుబడి పనిచేయాలని కోరారు. విప్లవ వీరుల త్యాగాలు వృథా కాకుండా దేశ అభివృద్ధి దిశగా పోరాటాలు కొనసాగించాలని తెలిపారు.

## కారేపల్లి లో రంజాన్ వేడుకలు పార్టీలకు అతీతంగా ఘనంగా

–కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి , బి ఆర్ ఎస్ నాయకుడు గౌసుద్దిన్





ఖమ్మం జిల్లా, కారేపల్లి :లోకల్ గైడ్, మార్చి 21 : కారేపల్లి మండల కేంద్రంలో పార్టీ లకు అతీతంగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు గౌసుద్దిన్ గృహం లో రంజాన్ సెలబ్రేషన్ వేడుకలో పాల్గొని అతిథ్యాన్ని స్వీకరించి, వారి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపినా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతి రావు.ఈ సందర్భంగా ఇంటికి ప్రేమతో వచ్చిన ఇమ్మడి కి గౌసుద్దీన్ హిమామే జామ్ కట్టి , శాలువాతో సత్కారించినాడు . ఇమ్మడి మాట్లాడుతూ...ఎంతో భక్తితో నెల రోజులుగా ఉపవాసా దీక్షలు చేసి పవిత్రమైన రంజన్ పర్వదినం రోజు పూర్తి చేసుకొని రంజన్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదారులతో పాటు గ్రామ ప్రజలకు అల్లా మంచి చేయాలని కోరారు.గౌసుద్దీన్ మంచి విజన్ ఉన్న నాయకుడు, రాజకీయాలతో పాటు మంచి సేవ కార్యక్రమాలు తన వంతుగా చేయడం గర్వించదగ్గ విషయం అని అన్నారు .గౌసుద్దీన్ కు రాజకీయాలలో మంచి భవిషత్ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నేత డొంకన రవీందర్, కాంగ్రెస్ నాయకులు తోగర శ్రీను, పాలిక వీరయ్య, మోషన్, ముస్తాబు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా పూలే కమిటీ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు

**నారాయణపేట మార్చి 21:లోకల్ గైడ్ :మహాత్మా జ్యోతిబా పూలె వారధి కమిటీ ఆధ్వర్యంలోమాగనూర్ మండలం కొల్పూర్ లో వ్యాసరచన పోటీలు ఏప్రిల్ 1న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనే స్త్రీ లు పురుషులు వయసుతో సంబంధం లేకుండా మహాత్మా జ్యతిబా పూలె జీవిత చరిత్ర ,డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర,చదువుల తల్లి సావిత్రి బాయి పూలె జీవిత చరిత్ర,ఛత్రపతి శివాజి మహారాజ్ జీవిత చరిత్ర పైన తెలిపిన మహనీయుల పై వ్యాస రచన ఉంటుందనీ తెలిపారు.ఈ పోటీలో పాల్గొనే వారు 8374776486, 9393203075 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.**

# డిండి ప్రాజెక్టు నిర్మాణంలో వివక్ష ఆపాలి. ఏదుల రిజర్వాయర్ నుంచి సమాన ఎత్తుతో నీరు ఇవ్వాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్.

ప్రాజెక్టులో జరుగుతున్న అన్యాయంపై సిపిఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జిల్లా కేంద్రంలో సదస్సు.

పంట పొలాలు ఎండిపోతున్న రైతులను ఆదుకోవాలి.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.మార్చి 21. (లోకల్ గైడ్) ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులకు ఎలాంటి వివక్ష లేకుండా ఒకే లెవెల్ లో నీటిని సరఫరా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మఖ్దూమ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి పల్లా వెంకట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని ఫ్లోరైడ్ మరియు కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న పాలమూరురంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తరలించే అవకాశం కల్పిస్తుండగా, డిండి కాలువకు మాత్రం 440 మీటర్ల ఎత్తు నుంచి మాత్రమే నీటిని తీసుకునేలా నిబంధనలు విధించడం నల్లగొండ జిల్లాపై జరుగుతున్న అన్యాయమని పేర్కొన్నారు.డిండి ప్రాజెక్టు విషయంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ , కొంతమంది ఇంజనీర్లు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం 440 మీటర్ల నుంచి 436.70 మీటర్లకు తగ్గిన తర్వాత 1,500 క్యూసెక్కుల నీరు కూడా కేవలం 56 రోజులపాటు మాత్రమే డిండి కాలువకు అందే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. దీని వల్ల ప్రభుత్వం నిర్ణయించిన 30 టీఎంసీల నీటికి బదులుగా కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే నల్లగొండ జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితి కొనసాగితే మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని హెచ్చరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 1, 2 తేదీలలో బీసీ టన్నల్, ఏదుల రిజర్వాయర్ ప్రాజెక్టులను సిపిఐ బృందం సందర్శించి, ఏప్రిల్ 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న రెండు పంటల రైతు భరోసాను ఒకేసారి విడుదల చేయాలని కోరారు. వ్యవసాయం చివరి దశలో ఉన్న రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలో పారదర్శకంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి బొల్లుగి నర్సింహ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరి రావు, పబ్బు వీరస్వామి, ఆర్. అంజచారి, బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, నలపరాజు రామలింగయ్య, టి. వెంకటేశ్వర్లు, తుమ్మ బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోరాట యోధుడు బానోరి లింగంగౌడ్ ఆశయాలను కొనసాగించాలి.

తోలుకట్టే చౌరస్తాలో సిపిఐ మాజీ నాయకుడు బానోరి లింగం గౌడ్ 25 వర్ధంతి వేడుకలు.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): పోరాట యోధుడు కామ్రేడ్ బానోరి లింగం గౌడ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. ప్రభులింగం అన్నారు. శనివారం మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట చౌరస్తాలోని స్థూపం వద్ద సిపిఐ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సిపిఐ చేవెళ్ల కాంగ్రెస్ లేబర్ సెల్ జనరల్ సెక్రెటరీ ఆయన కుమారుడు శివ శంకర్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లింగం గౌడ్ అనునిత్యం బడుగు బలహీన వర్గాల కోసం పెతందార్ల పైన పోరాటం చేసి నాయకుడు అమరజీవి కామ్రేడ్ లింగం గౌడ్ అని కొనియాడారు. ఆయన అనుకున్న లక్ష్యలను సాధించడంలో కీలక పాత్ర పోషించాడు కోరారు. అయన పోరాటం వల్లనే తోలుకట్ట స్టేజి పైన 500 ప్లాట్ ను ఇప్పించిన ఘనుడన్నారు. బడుగులకు అనునిత్యం ఎక్కడ అన్యాయాలు జరిగినా ఎర్రజెండా నీడన పోరాటాలు చేయాలని వారి ఆశయాలను ఈనాటి యువతరం ముందుకు తీసుకుపోవాలని ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకుడు చేవెళ్ల ఎం సుధాకర్ గౌడ్ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఈనాడు ఉన్న పరిస్థితుల్లో గ్రామ గ్రామాలలో పేద ప్రజలకు అండగా ఉండాలని వారికి తోడుగా వారి బాటగా నిలవాలని ఆనాడు బడుగు బలహీన వర్గాలకు పోరాటాలు నిర్వహించి ఎట్టి చాకిరి విముక్తి గురించి బాణవతుల సమస్య మీద కుల సమస్యల పైన నిరుపేదలకు గూడు గుడ్డ కావాలని దున్నేవానికి భూమి అని ఏసేవానికి చెట్టు అని సూసైట్ల గురించి టిప్ టి లైసెన్స్ ఇవ్వాలని ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల లవాన్ని భూమి ప్రభుత్వమే కేటాయించాలని ఆనాడు పోరాటాలు నిర్వహించి 560 జీవన తీసుకురావడం జరిగింది అనేక పోరాటాలు నిర్వహించడం జరిగింది సందర్భంగా వారి కోరారు ఈ కార్యక్రమంలో లింగం గౌడ్ గారి సతీమణి అనసూయ లింగంగారు గారి కుమారులు రాజు ఇంద్రసేన తోపాటు ఆనాటి ఆయన మిత్రులు వెంకటయ్య మల్లేష్ శ్రీనివాస్ బుచ్చయ్య శ్రీశైలం గౌడ్ సాకలి కిష్టయ్య వెంకటయ్య తదితరులు పాల్గొన్నారుశంకరయ్య దాసరి శ్రీనివాస్ బోడ వెంకటయ్య టిఆర్ఎస్ నాయకుడు మండల నాయకుడు బిక్షపతి కావలి సురేష్ ఎండి జలీల్ లు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మార్చి 21. (లోకల్ గైడ్) నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి రంజాన్ పండుగ సందర్భంగా నగరంలోని పలు ముస్లిం సోదరుల నివాసాలకు వెళ్లి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు కంచర్లను



సాదరపూర్వకంగా ఆహ్వానించి అత్తరు సెంట్లు పూసి.. స్వీట్లు తినిపించారు..రాష్ట్ర పార్టీ కార్యదర్శి నిరంజన్ వలి,నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు. భువనగిరి దేవేందర్, మున్సిపల్ ఫ్లోర్ మాజీ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, సయ్యద్ జాఫర్,కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరి దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, నాయకులు, మహమ్మద్ సమీ, మహమ్మద్ అన్వర్, ఫసి, మహమ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్అశ్వాక్, పెరిక కరణ్ జయరాజ్, నజీర్,పెండెం ధనుంజయ కందుల లక్ష్మయ్యతదితరులు వెంట ఉన్నారు.

## చర్ల మట్టిలో పుట్టిన మాణిక్యం- నాటక రంగానికి ధ్రువతార చిన్న రాము బాబాయ్



చర్ల : లోకల్ గైడ్ :చర్ల మట్టిలో పుట్టి నాటక రంగంలో అపార కీర్తి గడించిన ప్రముఖ రంగస్థల కళాకారుడు బండి చిన్న రాము (చిన్న రాము బాబాయ్) తన అద్భుతమైన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. నాటక రంగానికి ధ్రువతారగా నిలిచిన ఆయన అభినయ విన్యాసాలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి.ప్రత్యేకంగా "కుక్క" నాటికలో ఆయన పోషించిన పాత్ర ప్రేక్షక లోకాన్ని ఆకట్టుకుంది. సమాజంలోని మురికివాడల జీవన విధానాన్ని, సామాజిక అసమానతలను తన కళ్లలో ప్రతిబింబింపజేసి చూపించిన తీరు అందరినీ ఆలోచింపజేసింది. అది కేవలం పాత్ర కాదు, నిజ జీవితాన్ని ప్రతిబింబించిన ప్రదర్శనగా నిలిచింది. స్టేజ్‌పై అడుగుపెడితే గర్జించే సింహంలా కనిపించే చిన్న రాము, తన గంభీర స్వరంతో పలికే సంభాషణల ద్వారా అన్యాయాలపై పోరాటాన్ని ప్రతిబింబిస్తారు. ఆయన నటనలో ఉన్న లోతు, భావ వ్యక్తీకరణలో ఉన్న స్పష్టత నాటక రంగంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. ఎన్నో అవార్డులు, సత్కారాలు అందుకున్నప్పటికీ ఆయన వినయం తగ్గలేదు. చర్ల నాటక రంగానికి అలంకారంగా నిలిచిన చిన్న రాము, భావితరాలకు ప్రేరణగా మారారు. ఆయన పేరు నేడు ఒక బ్రాండ్‌గా మారి, కీర్తి అజరామరంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా చిన్న రాము బాబాయ్‌కు హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేస్తూ, ఆయన అభినయ ప్రయాణం నిరంతరం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

## గిరిజన మహిళల ఉత్పత్తులకు భద్రగిరి మార్ట్ వేదిక

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ రాహుల్



చర్ల : లోకల్ గైడ్ : మారుమూల గిరిజన ప్రాంతాల మహిళలు, రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ఈ నెలలో ప్రారంభించనున్న భద్రగిరి మార్ట్ ద్వారా సహజ సిద్ధమైన సేంద్రియ ఆహార పదార్థాలను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ రాహుల్ తెలిపారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న సేంద్రియ తినుబండారాల తయారీ విధానాలను సేకరించి పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను పంపుతున్నామని ఆయన పేర్కొన్నారు. శనివారం చర్ల మండలం సున్నం గుంపు గ్రామాన్ని సందర్శించిన ఆయన, శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లియాబిలిటీ గ్రూప్ మహిళలు తయారు చేస్తున్న పలు ఉత్పత్తులను పరిశీలించారు. ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీలు, చాక్లెట్లు, కరక్కాయ పొడి, నల్లేరు పచ్చళ్ళు, కారంపొడి ప్యాకెట్లు వంటి గృహ అవసరాలకు ఉపయోగపడే ఆహార పదార్థాలను మహిళలు నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలతో తయారు చేస్తున్న తీరు ఆయన అభినందించారు. ప్రత్యేకంగా ఇప్పపువ్వు, బెల్లం, యాలకులు, బాదం, జీడిపప్పు, నువ్వులు, పల్లీలు, నెయ్యి, కిస్మిస్, పుచ్చ గింజలు వంటి పోషకాహార పదార్థాలను సమపాళ్లలో కలిపి తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డూల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సేంద్రియ ఉత్పత్తులను భద్రాచలంలో ఏర్పాటు చేస్తున్న భద్రగిరి మార్ట్ ద్వారా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బీ రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది సాయి చంద్, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో నల్గొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.

ద్విచక్ర వాహనం నడుపుతూ గ్రామంలో సాగునీటి కాలువలను పరిశీలించిన మంత్రి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మార్చి 21. (లోకల్ గైడ్).నల్గొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు ఈరోజు బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కాలువలను పరిశీలించారు .మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ సాగునీటి కాలువలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నూతనంగా ఏర్పాటు చేసే పిల్ల కాలువ పనులకు మంత్రి అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణవెంలంలో ప్రాజెక్టు కాలువల ద్వారా నల్గొండ



నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపి ప్రతి ఎకరానికి నీరు అందిస్తా .నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే తన ధ్యేయమని తెలిపారు.పిల్లకాలువ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

## వృక్షారోపణ సేవకుడికి పూర్వ కలెక్టర్ జితేష్ వీ పాటిల్ ఆర్థిక సహాయం



పాల్వంచ : లోకల్ గైడ్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పరిధిలోని శ్రీనివాస గుట్ట వద్ద వృక్షారోపణకు విశేషంగా కృషి చేస్తున్న పిట్టల వెంకన్నకు పూర్వ జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఐఏఎస్ బదిలీపై వెళ్లే సందర్భంగా తమ సొంత నిధుల నుంచి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం వెంకన్నకు అందజేశారు. పాండురంగపురం గ్రామానికి చెందిన వెంకన్న, పాల్వంచలోని శ్రీనివాస గుట్టపై భక్తులకు సేవగా అనేక వృక్షాలను నాటి సంరక్షిస్తున్నారు. గుట్టకు వచ్చే భక్తులకు మొక్కలు అందించేందుకు నర్సరీ ఏర్పాటు చేయాలని ఆయన సంకల్పించారు. ఈ నర్సరీ ఏర్పాటుకు అవసరమైన మొక్కల కొనుగోలు, పెంపకం, తోటపని పరికరాలు మరియు కొమ్మల ద్వారా పెంచే మొక్కల కోసం ప్రోత్సాహకంగా ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా భక్త సమాజ మండలి అధ్యక్షులు ఊకె భద్రయ్య గారు, ఆరుట్ల లక్ష్మణాచారి సేవా ట్రస్టు సెక్రటరీ మరియు భక్త సమాజ మండలి సహాయ కోశాధికారి ధనకోటి వెంకటేష్ ఆ మొత్తాన్ని వెంకన్నకు అందజేశారు. ఈ సహాయంతో శ్రీనివాస గుట్ట వద్ద నర్సరీ ఏర్పాటు చేసి భక్తులకు మొక్కలు అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని వారు తెలిపారు.

## నల్గొండలో అత్యాధునిక సౌకర్యాలతో 'సన్ రైజ్ కార్ సర్వీసెస్' ప్రారంభం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మార్చి 21. (లోకల్ గైడ్)నల్గొండ పట్టణ కేంద్రంలోని అద్దంకి బైపాస్ రోడ్డులో వాహనదారుల సౌకర్యార్థం 'సన్ రైజ్ కార్ సర్వీసెస్' అత్యాధునిక మల్టీ బ్రాండ్ కార్ వర్క్ షాప్ అందుబాటులోకి వచ్చింది. చర్లపల్లి హైవే రోడ్డులోని టయోటా షోరూమ్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ



కేంద్రాన్ని నిర్వాహకులు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్ నిర్వాహకులు కాదరి శ్రీనివాస్, పి. ప్రవీణ్ మరియు కె. గణేష్ సంయుక్తంగా మాట్లాడుతూ నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్ల యజమానులకు నాణ్యమైన , నమ్మకమైన సేవలను ఒకే చోట అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రస్తుత ఆధునిక కాలంలో వస్తున్న అన్ని ప్రముఖ కంపెనీల కార్లకు ఇక్కడ నిపుణులైన మెకానిక్ల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన సర్వీసింగ్ చేస్తామని వారు తెలిపారు. ముఖ్యంగా జనరల్ సర్వీస్‌తో పాటు బాడీ షాప్ పనులు, ఏసీ మరియు ఎలక్ట్రికల్ రిపేర్లు, అత్యాధునిక వాటర్ వాష్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా, ప్రత్యేకంగా ఈవీ సర్వీసింగ్ విభాగం కూడా ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు.కేవలం సర్వీసింగ్ మాత్రమే కాకుండా పాత కార్ల కొనుగోలు, అమ్మకాలు మరియు ఎక్స్ఛేంజ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని, కస్టమర్ల సౌకర్యం కోసం కార్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ మరియు రెన్యూవల్స్ ప్రక్రియను కూడా ఇక్కడే పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశామని వారు వివరించారు. అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులతో తక్కువ సమయంలోనే మెరుగైన సేవలందిస్తామని, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వాల ఉచిత వాగ్దానాలు ప్రజల దగాకే! ..... ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

అశ్వారావుపేటలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలు



అశ్వారావుపేట, లోకల్ గైడ్ : ఓట్ల కోసం ఉచిత వాగ్దానాలతో ప్రజలను వంచిస్తూ, అధికారంలోకి వచ్చాక రైతాంగం, కూలీల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, ప్రజా నేత గుమ్మడి నరసయ్య పిలుపునిచ్చారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని శ్రీ సత్య సాయి కళ్యాణ మండపంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా మొదటి మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా సంఘం జిల్లా అధ్యక్షులు నాయని రాజు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సభకు దాసరి సాయి, అమర్లపూడి రాము, ముద్దా బిక్షం అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, జిల్లా కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ప్రభుత్వాలపై నిప్పులు చెరిగిన గుమ్మడి నరసయ్యఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మడి నరసయ్య తన శైలిలో ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, రోజుకు వెయ్యి రూపాయలు కూలి ఇచ్చినా కనీస అవసరాలు తీరని పరిస్థితి ఉందని, కానీ కూలీలకు అంత వేతనం ఇచ్చే నాథుడే లేదని, మన కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బడ్జెట్ అంకెల గారడీబడ్జెట్ ప్రసంగాలు వినడానికి విందు భోజనంలా ఉన్నా, ఆచరణలో పేదవాడి కడుపు కొట్టేలా ఉన్నాయని విమర్శించారు. ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను విస్మరించి, మళ్లీ కొత్త పేర్లతో పథకాలు తెచ్చి జనాలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీ వేదికగా రైతులు పోరాడి రద్దు చేయించిన నల్ల చట్టాలను, మోడీ ప్రభుత్వం మళ్లీ పేర్లు మార్చి దొడ్డిదారిన అమలు చేస్తోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజివిక గా పేరు మార్చడం పేదల హక్కులను కాలరాయడమేనని ధ్వజమెత్తారు.మావోయిస్టుల లొంగుబాటుపై వ్యాఖ్యలుప్రస్తుత రాజకీయ పరిణామాలను విశ్లేషిస్తూ నిన్నటి వరకు తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని నమ్మిన మావోయిస్టులు నేడు లొంగిపోతున్నారని, వారి భవిష్యత్తు ఏంటో వేచి చూడాలని ఆయన వ్యాఖ్యానించారు.పోరాటమే ఏకైక మార్గంమన దేశం వనరులు ఉన్న గొప్ప దేశమని చెబుతారే తప్ప, ఆ సంపద పేదరికంలో మగ్గుతున్న రైతు కూలీలకు ఎందుకు దక్కడం లేదని ఆయన ప్రశ్నించారు. హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ప్రగతిశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు కూలీలకు పిలుపునిచ్చారు. అలరించిన అరుణోదయ కళారూపాలుఅఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల సందర్భంగా అరుణోదయ కళాకారులు వేసిన కళారూపాలు అలరించాయి. ఎర్రజెండా పాటలు, నృత్యాలతో, డప్పు మోతలతో సభా ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు హాజరయ్యారు.

## ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్త్ క్యాంప్



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మార్చి 21. (లోకల్ గైడ్)నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని ఆర్కే ఎస్ ఫౌండేషన్ యాజ మాన్యం బిజెపి రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్, 10 వ డివిజన్ కార్పొరేటర్ పిల్లి కృష్ణమరాజు,పిల్లి శివకృష్ణ రాజ్ అన్నారు.యశోద హాస్పిటల్ మలకపేట,హైదరాబాద్, జిల్లా కేంద్రంలోని ప్రేరణ స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ప్రేరణ స్కూల్లో నిర్వహించిన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. స్థానికంగా 10 వ డివిజన్ కార్పొరేటర్ కావడంతో వివిధ డివిజన్లో నుంచి తరలివచ్చిన ప్రజలు ఈ శిబిరంలో సేవలు పొందారు. వివిధ చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ వీరారెడ్డి. (కార్డియాజి లిస్ట్) ), డాక్టర్ షైనీ (గైనకాలజిస్ట్ ) డాక్టర్. గోపీనాథ్ (జనరల్ మెడిసిన్) రోగులను పరీక్షించి సేవలందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోగుల తాకిడి నెలకొంది. దాదాపు 600 మందికి సేవ లందించిన వైద్యులు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రధానంగా టుడీకో, కళ్ళ పరీక్షలు, స్త్రీలకు వైద్యం,మధుమేహం, హెచ్బీ, ఈసీజీ,బీపీ, షుగర్,పరీక్షలతో పాటు రక్త పరిమాణ శాతం తెలిపే పరీక్ష లను చేశారు. ప్రేరణ స్కూల్లో నిర్వహిస్తున్న యశోద హాస్పిటల్ మలకపేట,హైదరాబాద్,పేదలకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ శిబిరంలో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి ,సురేందర్ రెడ్డి ,బానోత్ రవి నాయక్, గంగరబోయిన వెంకన్న ,ఐతరాజు జానయ్య ,పుల్లెంల మహేష్,జ్యోతి ,కృష్ణ,అశోక్ రెడ్డి, నామ ప్రకాష్ ,వెంకటాచారి, బిజెపి ఇన్చార్జి కందుల శ్రీను, ఉమాదేవి టెక్నీషియన్, అశోక్ రెడ్డి సీనియర్ ఎగ్జిక్యూటివ్(పి ఆర్ ఓ)తదితరులు పాల్గొన్నారు.

## కళలను ప్రోత్సహించడం సామాజిక బాధ్యత డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచ : లోకల్ గైడ్ :కళలను, కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాల్వంచ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లోని వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉగాది సంబురాలు2026 రెండవ రోజు శు



క్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాకారులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో దివంగత కళాకారుడు, ఉద్యమకారుడు గద్దర్ పేరు మీద తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి, ఇటీవల పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళారంగ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. గత 23 సంవత్సరాలుగా ఉగాది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డు తెలంగాణా చీఫ్ కోఆర్డినేటర్ పంజా మాలతీ నాయుడు, ప్రముఖ పౌరాణిక నాటక నటుడు, నంది అవార్డు గ్రహీత పాకలపాటి రోశయ్య చౌదరి, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు లతో పాటు కొత్వాల శ్రీనివాసరావును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, మంతపురి రాజు గౌడ్, వేముల కొండలరావు, డాక్టర్ బిక్కసాని సుధాకర్ రావు, డాక్టర్ నామ బుచ్చయ్య, టీ లింగమూర్తి, 45వ కార్పొరేటర్ దంతేబోయిన నరేష్, చిన్న పండు, చల్లగుండ్ల వీరభద్రం, కట్టి శ్రీను, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 21 నుండి 30 వరకు షహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుక్ దేవ్ ల 95వ వర్ధంతి సభలు జరుపండి.

పిడిఎస్‌బి యు పివైఎల్ సంఘాల పిలుపు.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మార్చి 21. (లోకల్ గైడ్) బ్రిటిష్ వలస పాలనపై తిరుగుబాటు జెండాఎత్తి విప్లవాగ్ని రగిలించిన యువ కిషోరాలు షహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా జరపాలని పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి చారి, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కామల్ల సంజయ్ లు పిలుపు నిచ్చారు. నల్లగొండ నగరంలో పి వై ఎల్‌బి పి డి ఎస్ యు రాష్ట్ర కమిటీలు ప్రచురించిన భగత్ సింగ్ 95వ వర్ధంతి వాల్ పోస్టర్ ను వారు ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో సామ్యవాదం, సార్వభౌమాధికారం, లౌకికవాదం, సోషలిజం, సమసమాజాన్ని స్వప్నించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు అమరులై నేటికీ 95 ఏండ్లు గడుస్తుందని అన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి యుక్త వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన యోధులని అన్నారు. బ్రిటిష్ పార్లమెంట్ పై పొగ బాంబులు విసిరి వెన్నులో వణుకు పుట్టించారని అన్నారు. భగత్ సింగ్ సాహసం, తెగువ, త్యాగనిరతి,దేశభక్తి నేటి యువతకు స్ఫూర్తి దాయకం అని అన్నారు. నాడు అనేకమంది యువకులు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేస్తే నేటి యువత డ్రగ్స్, గంజాయి, మాదక ద్రావ్యాల మత్తులో మునుగుతూ ప్రశ్నించడం మరిచి పోయారని అన్నారు. పాలకుల పాదాసేవలో పడి కులం, మతం అంటూ విద్వేషాలు రెచ్చగొట్టే వారివెంటే ఉంటున్నారని అన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక యువత ఉద్యోగాలు లేవని, రైతు, కార్మిక చట్టాలు కార్పొరేట్ కు అనుకూలంగా మలచబడ్డాయని అన్నారు. మహిళలకు రక్షణ లేదని, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. మరోవైపు అమెరికా, ఇజ్రాయేల్ సంయుక్త దాడిని ఇరాన్ పై కొనసాగిస్తుంటే కనీసం నివారించే వైపుగా కేంద్రం లేదని అన్నారు. ఫలితంగా గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగాయని అన్నారు.అమెరికా సామ్రాజ్యవాద దాడులు, దేశంలో మోడీ ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలను నిరసిస్తూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందూరు సాగర్ నాయకులు ప్రభు, కే. నరేష్, ఆర్. వెంకన్న, రాజ్ కుమార్, డి. స్వామి, మణికంఠ, బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 24 మున్సిపల్ కార్మికుల చలో హైదరాబాద్.

హాజరు పాయింట్ల వద్ద విస్తృత ప్రచారం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మార్చి 21. (లోకల్ గైడ్)మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆలోపు కనీస వేతనం 26,000 నిర్ణయించి అమలు చేయాలని కోరుతూ మార్చి 24 జరుగు చలో హైదరాబాద్ ను జయప్రదం చేయాలని లిసిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు.శనివారం నల్గొండ పట్టణం నగర కార్పొరేషన్ కార్మికుల ప్రకాశం బజార్ ఎగ్బాల్ మినార్ పాతబస్తీ చౌరస్తా హాజరు పాయింట్ల వద్ద కార్మికులను కలిసి చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు .ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ పట్టణాలు నగరాలు పరిశుభ్రంగా ఉంచుతూ అవార్డులు అందుకోవడానికి కారణం అవుతున్న పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు దుర్భరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల కనుగుణంగా వేతనాలు పెంచాలని ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు పిఎఫ్ ఈఎస్ఐ యూనిఫామ్ బట్టలు చెప్పులు సబ్బులు నూనెలు సకాలంలో అందించాలని వారు డిమాండ్ చేశారు జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పట్టణ పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపు కోసం నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 24న జరుగుతున్న చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాకు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు ఈ ప్రచార కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతకాయల సంతోష్ పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్ల సంజీవ, నాయకులు నక్క సత్తయ్య ,పాలడుగు వెంకటేశం, దర్శనం ఎల్లమ్మ, సంద బాగ్య, సుగుణమ్మ ,అంజమ్మ తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సిపిఎం నేతలు.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మార్చి 21. (లోకల్ గైడ్) పవిత్ర రంజాన్ మాస ముగింపు సందర్భంగా ఈద్గా దగ్గర ప్రార్థన ముగించుకొని వస్తున్న ముస్లిం సోదరులకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు హాశం మాట్లాడుతూ రంజాన్ నెల 30 రోజులపాటు ఉపవాస దీక్షలు ముగించుకోవడం జరిగిందని అన్నారు. నల్లగొండ జిల్లా సెక్యులర్ భావాలతో ఐక్యంగా కలిసి ఉండాలని ఆకాంక్షించారు. మతసామరస్యాన్ని పాటిస్తూ అన్ని మతాల పండుగలను అందరూ కలిసి ఘనంగా నిర్వహించుకోవడం సాంప్రదాయంగా మన జిల్లాలో కొనసాగుతుండడం అభినందనీయం అని అన్నారు. డిప్యూటీ మేయర్ కు , వివిధ డివిజన్ కార్పొరేటర్లకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు రంజాన్ శు భాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, బొల్లు రవీంద్ర కుమార్, సర్దార్ అలీ, ఎస్ కె లతీఫ్, సుల్తాన్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో కాంగ్రెస్ నాయకులు

-రాందాస్ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు



ఖమ్మం జిల్లా, కారేపల్లి :లోకల్ గైడ్, మార్చి 21 : కారేపల్లి మండలం పేరేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మద్యానపు సత్యనారాయణ గృహప్రవేశం వేడుక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు పథకం సహకారంతో కొత్త గృహాన్ని నిర్మించుకోని వారి సొంతకళను నెరవేర్చుకున్నందుకుగాను సంతోషం తో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రాతని చేపట్టి నూతన గృహం లో పూజలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులు కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ ఎమ్మెల్యే శ్రీ రాందాస్ నాయక్, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు , పెద్దలు యడవల్లి వెంకట్ రెడ్డి, మల్లెల నాగేశ్వరరావు , 5 వ వార్డు మెంబర్ వీరభద్రం ,సొసైటీ డైరెక్టర్ మద్యానపు శ్రీను , ఉప్పుగల్ల శ్రీను , బుడిగ రామయ్య , కల్లూరి హైమవతి , తదితరులు పాల్గొన్నారు.

## కాంపౌండ్ వాల్ కోసం రూ.25లక్షల నిధుల మంజూరు హర్షణీయం.

- ఎస్డిఎఫ్ నిధులతో పనులకు శ్రీకారం.
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన యువ నాయకుడు కిరణ్.
- హర్షం వ్యక్తం చేస్తున్న తాండూరు క్రిస్టియన్ మైనారిటీలు.
- త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణం పనులు.



లోకల్ గైడ్/తాండూర్:తాండూర్ విలియమున్ స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని వికారాబాద్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ(డివిఎంసి) అధ్యక్షులు కిరణ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు కిరణ్ మాట్లాడుతూ...రూ.25 లక్షల ఎస్డిఎఫ్ నిధులతో త్వరలో పనులకు శ్రీకారం చుట్టనునట్లు తెలిపారు.తాండూర్ పట్టణంలోని విలియమోన్ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేసిన సహాయం మరువలేనిదని అన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఎస్డిఎఫ్ నిధుల ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయడం క్రిస్టియన్ ప్రజల్లో ఆనందాన్ని నింపిందని స్పష్టం చేశారు.ఈ నిధులతో ప్రాంత భద్రత, శుభ్రత మరియు అభివృద్ధికి తోడ్పాటు లభించనుంది.ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఎంతో సంతోషకరమని కిరణ్ తెలిపారు. క్రైస్తవ ప్రజల అవసరాలను గుర్తించి స్పందించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవిధంగాస్థానిక ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ, నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి పనులు పూర్తి చేయాలని కోరుతున్నట్లు వివరించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తయితే, ఆ ప్రాంతంలో భద్రత మెరుగుపడటంతో పాటు పరిసరాలు మరింత శుభ్రంగా, క్రమబద్ధంగా మారతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.కాగా రానున్న రోజుల్లో తాండూర్ నియోజకవర్గంలోని క్రిస్టియన్ మైనార్టీ ప్రజలందరము ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెంటే ఉంటామని డివిఎంసి అధ్యక్షుడు కిరణ్ మద్దతు తెలిపారు.

## క్రమశిక్షణకు ప్రతీక రంజాన్

## - ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే.

- రంజాన్ వేడుకల్లో పాల్గొన్న చీఫ్ విప్.





లోకల్ గైడ్/తాండూర్: పవిత్ర ప్రార్థనలు, క్రమశిక్షణ, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండగ అని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం తాండూర్ పట్టణ పరిధిలోని ఖాంజపూర్ గుట్ట సమీపంలో గల ఆఇలేహదిస్ ఈద్గాలో రంజాన్ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుమారు నెల రోజులపాటు అత్యంత కఠినంగా ఉపవాసము అంటూ, భక్తిని చాటుకున్న ముస్లిం సోదరులకు అల్లా దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.అదేవిధంగా ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన దైవాన్ని ప్రార్థిస్తూ, ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని సూచించారు.ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు,మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు అబ్దుల్ రాహుఫ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, కర్ణం పురుషోత్తం రావు, ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ లు బంటు వేణు, శ్రీకాంత్, రాము, మల్లేశం, రాజు గౌడ్, నాయకులు బంటు మల్లప్ప, అనిల్, అంకిత్, బిర్కట్ రఘు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం.



లోకల్ గైడ్/బంట్వారం:మండల కేంద్రంలోనీ ఎస్సి కాలనిలో రూ,10 లక్షల నిధులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంజూరు చేయడం తో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బంట్వారం గ్రామ సర్పంచ్, దుర్గం చెరువు మల్లేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచారం యాదగిరి, శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా ఏర్పడుతుందని పేర్కొన్నారు. భారీగా నిధులు కేటాయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు గ్రామం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో సిసి రోడ్లు ప్రధానమైనవి. అందులో భాగంగా సిసి రోడ్డు పనులు ప్రారంభించడం చాలా సంతోషమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జె. సిద్ధిరాములు, యాచారం.రమేష్, వార్డ్ మెంబర్ శాంతికుమార్, గ్రామస్తులు, తదితరులు,పాల్గొన్నారు.

## ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు విజయవంతం

నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



అశ్వారావుపేట, లోకల్ గైడ్ : అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ మహాసభలు అశ్వారావుపేట మండల కేంద్రంలో శ్రీ సత్య సాయి కళ్యాణ మండపంలో విజయవంతమయ్యాయి. ఈ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోకినపల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ కృష్ణ, కోశాధికారిగా బుర్రా వెంకన్న, ఉపాధ్యక్షులుగా దాసరి సాయి, సహాయ కార్యదర్శిగా నాయిని రాజు, కార్యవర్గ సభ్యులుగా తెల్లం రాజు, బానోతు లింగా, మంచినీల్ల భాస్కర్, ఎం రాజశేఖర్, కంగాల వెంకటమ్మ, కుర్సం ముత్యాలరావు, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, పోతుగంటి లక్ష్మణ్, కాకా వెంకటేష్, బండి వెంకటమ్మ, చింతకాయల సరళ లతో కలిపి 17 మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం కొన్ని తీర్మానాలు చేయడం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పాత పేరునే కొనసాగించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో సంవత్సరానికి రూ.12,000.లు ఇచ్చే కార్యక్రమాన్ని వెంటనే నెరవేర్చాలని, కనీస వేతన చట్టాన్ని సవరించి వెంటనే అమలు చేయాలని, పోడుభూముల సమస్యలు పరిష్కరిస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోగా పోడు సాగుదారులపై దాడులు చేయటాన్ని నిరసిస్తూ, వెంటనే పోడు భూములకు పట్టా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది. ఈనెల 24 25 తేదీలలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని మహాసభ ప్రజలకు పిలుపునిచ్చింది.

## మానవత్వానికి, శాంతికి ప్రతీక రంజాన్ పండుగ

-వైరా మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

-20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మ శ్యాం బాబు



లోకల్ గైడ్, వైరా 21 : వైరా మున్సిపాలిటీ లోని ముస్లిం సోదరులకు సోదరీమణులకు రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరులకు వెళ్లి ప్రతి ఒక్కరిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన వైరా మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు..శనివారం రంజాన్ పండగ సందర్భంగా వైరా మున్సిపాలిటీలో పలు వార్డులలో ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు వారి ఇళ్లకు వెళ్లి రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ,జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ మెడికల్స్ హెల్త్ విభాగం చైర్మెన్ డాక్టర్ కాపా మురళి కృష్ణ , 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఈ సందర్భంగా వారు ప్రత్యేక సందేశం విడుదల చేశారు. ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఉపవాస, ధ్యాన, దానధర్మ కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సహోదరభావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఆయన కొనియాడారు. రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సామరస్యం నింపాలని ఆయన ముస్లిం సమాజానికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 20వ వార్డు షేక్ రహీమ్ పండు, 14 వ వార్డు మొహ్మద్ గౌస్, 04 వ వార్డు షేక్ ఖమ్మం మీరా, 04 వ వార్డు షేక్ బీబా, 13 వ వార్డు షేక్ బాబు జానీ, 13 వ వార్డు షేక్ అఫ్జల్, కౌసర్, 13 వ వార్డు సయ్యద్ అన్వర్, 12 వ వార్డు షేక్ సొందు సాహెబ్ ఇళ్లకు వెళ్లి రంజాన్ పండుగ సందర్భంగా వారికి ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా వారు మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , శ్యాంబాబు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు... ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోదిల హరినాథ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, రత్నాకర్,పల్లపు కొండలు, వీరంశెట్టి సీతారాములు, పమ్మి తిరుమల రావు, తెళ్ళూరి వీరయ్య, పృధ్వి, కాజా, గూగులోత్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా పరిచయాలతో మోసాలు పెరుగుతున్నాయి.. అప్రమత్తంగా ఉండాలి

-యువత టార్గెట్‌గా సైబర్ నేరాలు..పోలీసుల కీలక సూచనలు

-ఫేక్ ఐడీలతో మోసాలుడ వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు

-అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లపై జాగ్రత్త..సీపీ సజ్జనార్ హెచ్చరిక



హైదరాబాద్, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హైదరాబాద్: సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సిపి సజ్జనార్ ప్రజలకు, ముఖ్యంగా యువతకు కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహాలు పెంచుకోవడం, వ్యక్తిగత వివరాలు పంచుకోవడం ప్రమాదాలకు దారి తీస్తుందని ఆయన హెచ్చరించారు. ఇటీవలి కాలంలో ఫేక్ ఐడీలతో పరిచయాలు పెంచుకుని మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలలో బాధితులు మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. అందుకే అపరిచితులతో చాట్ చేయడం, ఫోటోలు లేదా వ్యక్తిగత సమాచారం పంచుకోవడం పూర్తిగా నివారించాలని సూచించారు. అదేవిధంగా, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఏదైనా మోసం జరిగినట్లు అనిపిస్తే వెంటనే 100 లేదా సంబంధిత హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాజంలో డిజిటల్ వినియోగం పెరిగిన కొద్దీ సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడటం వల్ల మోసగాళ్లకు సులభంగా బలవుతున్నారు. పోలీసుల సూచనలు పాటించడం ద్వారా ఇలాంటి నేరాలను చాలా వరకు నివారించవచ్చు. వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడం, అపరిచితులపై అతి నమ్మకం పెట్టుకోకపోవడం, ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి అని పోలీసులు సూచిస్తున్నారు.

## 15 క్వింటాళ్లు రేషన్ బియ్యం స్వాధీనం...




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)కెరమెరి మండలంలోని సుర్దాపూర్ ఎక్స్ రోడ్డ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం,బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కెరమెరి నుండి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న టిఎస్01యుబి1561 నెంబర్ గల బొలెరో వాహనంపై అనుమానం కలగడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో బొలెరో వాహనంలో సుమారు15క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.గ్రామాల్లో ప్రభుత్వ రేషన్ పొందుతున్న లబ్ధిదారుల వద్ద నుండి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి,ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయించే అక్రమ రవాణా జరుగుతోందని,అధిక సొమ్ము చేసుకునేందుకు కొందరు ఈ దందా సాగిస్తున్నట్లు తెలిపారు.ఈ మేరకు ఆసిఫాబాద్ అడ గ్రామానికి చెందిన వాహనం డ్రైవర్ గుర్నులే మధుకర్,ఆసిఫాబాద్ జనకాపూర్ గ్రామానికి చెందినవాహన యజమాని మహమ్మద్ రియాజ్ ఖాన్ లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.రేషన్ బియ్యం విక్రయించే వారు,కొనుగోలు చేసే వారిపైనా కూడా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని,ప్రజలు కూడా సహకరించి అక్రమ రవాణా గురించి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

## ఒకరోజు వయసు శిశువు గుర్తింపు...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ఒక రోజు వయస్సు గల శిశు బాలికను గుర్తు తెలియని వ్యక్తులు ఈస్గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాగజ్‌నగర్ మండలం సీతానగర్ గ్రామం సమీపంలో శనివారం వదిలివేసినట్లు పోలీసులు గుర్తించారు.వెంటనే స్పందించిన ఈస్గావ్ పోలీసులు,వల్లకొండ సర్పంచ్,సీతానగర్ గ్రామస్థులు ఆ శిశువును రక్షించారు.శిశువుకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నారు.శిశువు తల్లిదండ్రులను గుర్తించేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.ఆ బాలిక శిశువు సంరక్షణ కోసం స్థానిక చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారులకు అప్పగించారు.

## రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ నుండి శ్రీనివాస్ థియేటర్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్థానిక నాయకులు,అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు అభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్రంలోనే మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మొదటి స్థానంలో ఉంచడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా డివిజన్ లలో రోడ్డు విస్తరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని,ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.రోడ్డు విస్తరణ కార్యక్రమానికి సహకరిస్తున్న వివిధ శాఖల అధికారులకు,వ్యాపారస్తులకు,ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,కార్పొరేటర్లు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత,సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్.

రంజాన్ జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.




ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్) విజన్ ఆంధ్ర:మత కలహాలు లేకుండా సోదరభావంతో,ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలనిరాష్ట్ర రోడ్డు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం ఆయన నల్గొండ పట్టణంలోనిమునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులతోకలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర దీక్షలు, ప్రార్థనలు చేశారని,క్రమశిక్షణ,దాతృత్వం, ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ పర్వదినం అని అన్నారు.అల్లా వారందరి జీవితాలలో వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షించారు.అల్లా ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు.ముస్లిం సోదరులంతా రంజాన్ పండుగను కుటుంబ సభ్యులందరితో కలిసి భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు.నల్గొండ పట్టణంలోగత 30 సంవత్సరాలుగా హిందు, ముస్లింలు ఎలాంటి మత కలహాలు లేకుండా పండుగలు శాంతియుతంగా జరుపుకుంటున్నారని మంత్రి తెలిపారు.ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని,ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రూ.3 వేల 500 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు.గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య,ఉద్యోగ రంగాలలో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు.రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి ,ఏ ఎస్ పి రమేష్.జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్,తహసిల్దార్ పరుశురాములు,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్,సుభాష్,నవీన్,అధికారులు,మైనార్టీ నాయకులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ నుండి శ్రీనివాస్ థియేటర్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్థానిక నాయకులు,అధికారులతో కలిసి శనివారం



పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు అభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్రంలోనే మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మొదటి స్థానంలో ఉంచడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా డివిజన్ లలో రోడ్డు విస్తరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని,ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.రోడ్డు విస్తరణ కార్యక్రమానికి సహకరిస్తున్న వివిధ శాఖల అధికారులకు,వ్యాపారస్తులకు,ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,కార్పొరేటర్లు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ కు ప్రతీక రంజాన్ పండుగ

-కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ



ఖమ్మం జిల్లా, కారేపల్లి :లోకల్ గైడ్, మార్చి 21 : సింగరేణి మండల కేంద్రంలో ముస్లింల పవిత్రమైన రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పార్టీలకు అతీతంగా వేడుకలను ఆత్మీయుల మధ్య దూరలు పెరగవద్దని ఆ అల్లా ప్రేమానురాగాలు ప్రతీ ఒక్కరికీ దక్కాలని ముస్లిం సోదర్లు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. స్టానికి బీ ఆర్ ఎస్ పార్టీ ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు షేక్. గౌసుద్దిన్ వారి ఇంట్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ వేడుకలకు కారేపల్లి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ ), గౌసుద్దీన్ పిలుపు మేరకు వెళ్లి రంజాన్ వారికీ, వారి కుటుంబ శుభాకాంక్షలు తెలిపి అలిగానం చేసుకొని సంతోషాన్ని వ్యక్తం చేసినాడు. ఈ సందర్భంగా గౌసుద్దీన్ ప్రేమతో ఇంటికి వచ్చిన సర్పంచ్ టోనికి హిమమే జామ్ కట్టి, శాలువతో ఘనంగా సత్కారించినాడు. ఈ సందర్భంగా టోనీ మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఈ పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించిన ఉపవాస, ధ్యాన, దాన ధర్మ కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సహోదరాభవాన్ని పెంపొదించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి అనీ కొనియాడారు. ఈ రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సమరస్యం నింపాలని సర్పంచ్ టోనీ అనీ ముస్లిం సోదర్లకు మారో మారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపినాడు. ఈ కార్యక్రమం లో ముస్లిం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి.

## మంత్రి కోమటిరెడ్డి.

## డిప్యూటీ మేయర్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న మంత్రి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి మార్చి 21.:లోకల్ గైడ్) ముస్లింల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని రాష్ట్ర రోడ్డు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.రంజాన్ పండుగ సందర్భంగా శనివారం మునుగోడు రోడ్ లోని ఈద్గా వద్ద ముస్లింల



సామూహిక ప్రార్థనల నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ ఆమేర్ నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రంజాన్ విందుకు హాజరై ఆతిథ్యాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## కారు విడి భాగాల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం

-50 మందికిపైగా గాయాలు



సియోల్ : దక్షిణ కొరియాలోని డేజియోన్ నగరంలో కారు విడి భాగాలు తయారుచేసే కంపెనీలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 55 మంది గాయాలపాలయ్యారు. వీరిలో 24 మందికి తీవ్రంగా గాయపడ్డారని అగ్నిమాక సంస్థ వెల్లడించింది. అగ్నిమాపక ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి, ప్రాణాలను కాపాడడానికి అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమీకరించాలని అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఆదేశించారని అధ్యక్ష భవనం బ్లూహౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది. గాయపడిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని జాతీయ అగ్నిమాపక సంస్థ వెల్లడించింది. కాగా, అగ్నిప్రమాదం సంభవించిన కంపెనీ ఆ దేశ రాజధాని సియోల్‌కు 160 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రమాదానికి రెండు భవనాల్లో ఒకటి కూలిపోయిందని, మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని అగ్నిమాపక అధికారి మీడియాకు వెల్లడించారు. ఈ కంపెనీ అంజున్ ఇండిస్టియల్. ఇంజన్ విడి భాగాలను తయారుచేసి హ్యూండారు మోటార్, కియా కార్ప్ వంటి ఇతర సంస్థలకు సరఫరా చేస్తున్నామని ఆ కంపెనీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే ఈ ఘటనపై ఆ కంపెనీ యాజమాన్యం వెంటనే స్పందించలేదు.

## గ్యాస్ సంక్షోభంపై హర్దీప్ సింగ్‌పూరీకి లేఖ రాసిన కర్ణాటక సిఎం



న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌లో తీవ్రంగా గ్యాస్ సంక్షోభం నెలకొంది. గ్యాస్ కొరత వల్ల బెంగళూరులో వ్యాపారాలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ కొరతని తీర్చాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం కేంద్ర పెట్రోలియం శాఖామంత్రికి లేఖ రాశారు. బెంగళూరులో నెలకొన్న గ్యాస్ కొరత ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, గ్యాస్ కొరతను తీర్చడానికి హర్దీప్ సింగ్ పూరి తక్షణమే జోక్యం చేసుకోవాలని సిద్ధరామయ్య తన లేఖలో పేర్కొన్నారు. ప్రాధాన్యతా, నిత్యావసర రంగాలకు సరఫరాను నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రోజుకు 50 వేల సిలిండర్ల డిమాండ్ ఉండగా... సరఫరా కేవలం వెయ్యి సిలిండర్లకే పరిమితం కావడంతో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. దీనివల్ల వ్యాపారాలు, హోటళ్లు మూతపడుతున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా గ్యాస్‌ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సిద్ధరామయ్య తన లేఖలో కేంద్ర మంత్రిని కోరారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## సౌభ్రాతృత్వం పాటిస్తే విద్వేష ప్రసంగాలనేవి ఉండవు



న్యూఢిల్లీ : సమాజంలో ప్రతి ఒక్కరూ సౌభ్రాతృత్వాన్ని పాటించినపుడు విద్వేష ప్రసంగాలనేవి ఉండవని సుప్రీంకోర్టు శుక్రవారం సూచించింది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా కచ్చితంగా పోరాటం చేయాలని, అయితే ఈ పోరాటం కేవలం ఒక కమ్యూనిటీకే పరిమితం కాకుండా, అన్ని వర్గాల తరపున జరిగేలా చూడాలని పేర్కొంది. "విద్వేషపూరిత ప్రసంగాల నుండి మా కమ్యూనిటీని రక్షించండి అని నిర్దిష్ట కమ్యూనిటీ ఎందుకు ప్రశ్నించాలి. బదులుగా ఎవరూ విద్వేషపూరిత ప్రసంగాలు చేయకూడదని మనం చెప్పాలి. ఈ పోరాటం అందరి తరపున జరగాలి" అని జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ఏమైనప్పటికీ.. విద్వేష ప్రసంగాలకు కోర్టు వ్యతిరేకమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. విద్వేష ప్రసంగాలను తాము కోరుకోవడం లేదని, అది సమాజంలోని విద్య స్థాయి, మేధో వికాసం, సహనం మరియు ఓర్పుపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సౌభ్రాతృత్వాన్ని పాటించినపుడు, విద్వేష ప్రసంగాలనేవి ఉండవని పేర్కొన్నారు. బ్రాహ్మణ కమ్యూనిటీ లక్ష్యంగా చేస్తున్న విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా కోర్టు జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. 'బ్రహ్మఫోబియా' అనే పదాన్ని సృష్టించారని, కుల ఆధారిత వివక్షగా పరిగణించి తగిన విధంగా శిక్షించాలని పిటిషనర్, న్యాయవాది మహాలింగం బాలాజీ స్వయంగా వాదనలు వినిపించారు.

## ఇరాన్ సహా 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దు భారత విమానయాన సంస్థలకు డీజీసీఏ సూచన




న్యూఢిల్లీ : మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో, భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్‌తో సహా 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దని భారత విమానయాన సంస్థలకు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ కఠినమైన సూచనలు జారీ చేసింది. ఇరాన్ సైనిక, ఇంధన కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆ ప్రాంతంలోని గగనతలం తీవ్ర ప్రమాదకర స్థితిలో ఉందని వచ్చిన నివేదికల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఖతార్ దేశాల గగనతలాలను 'అధిక ప్రమాదం'గా ఉన్న జాబితాలో చేర్చారు. ఈ దేశాల మీదుగా అన్ని ఎత్తులలోనూ విమాన ప్రయాణాలను నివారించాలని ఆ ఆదేశంలో పేర్కొన్నారు. ఒకవేళ ఒమన్, సౌదీ అరేబియా మీదుగా విమానాలను నడపాల్సి వస్తే, 32,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో మాత్రమే ప్రయాణించాలని డీజీసీఏ స్పష్టం చేసింది. అత్యాధునిక క్షిపణులు, డ్రోన్‌ల ఉనికి పౌర విమానాలకు ముప్పు కలిగిస్తుందని డీజీసీఏ హెచ్చరించింది. విమానాలను తప్పుగా గుర్తించే లేదా అవి సైనిక కార్యకలాపాలలో పాలుపంచుకునే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వంటి విమానయాన సంస్థలు పశ్చిమ ఆసియా దేశాలకు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. యూరప్, అమెరికాకు వెళ్లే విమానాలను ఎక్కువ దూరాలున్న సురక్షిత మార్గాలకు మళ్లిస్తారు. దీనివల్ల ప్రయాణ సమయాలు పెరుగుతాయి. ప్రస్తుత మార్గదర్శకాలు మార్చి 28 వరకు అమలులో ఉంటాయని, పరిస్థితిని అంచనా వేసిన తర్వాత వాటిని సవరిస్తామని డీజీసీఏ తెలిపింది. సిరియా, యెమెన్ గగనతలాన్ని నివారించాలన్న మునుపటి ఆదేశం ఇప్పటికీ అమలులో ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం పరిస్థితిని సమీక్షించింది. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, టిక్కెట్ల ధరలను అధికంగా పెంచకుండా చూసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించారు. మధ్యప్రాచ్యంలో ఉన్న భారతీయుల భద్రతను నిర్ధారించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి కేంద్ర ప్రభుత్వం కూడా కృషి చేస్తోందని తెలిపింది.

# నెతన్యాహు ఎక్కడ?

### ఇజ్రాయెల్ ప్రధాని మరణించారని వదంతులు

### ఏఐ వీడియోలతో దాస్తున్నారంటూ వార్తలు

### ఆరో వేలు దృశ్య భ్రాంతే: గ్రోక్ ఫ్యాక్ట్ చెక్



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు క్షేమమేనా? ఆయన ఎక్కడున్నారు? ఎలా ఉన్నారు? అసలు బతికే ఉన్నారా? ఇలాంటి రకరకాల ప్రశ్నలు, పుకార్లతో శనివారం సోషల్ మీడియా హోరెత్తిపోయింది. నెతన్యాహు ఎక్స్ ఖాతా నుంచి శుక్రవారం విడుదల చేసిన అధికారిక వీడియోనే వీటన్నింటికీ కారణంగా మారడం విశేషం. ఇరాన్‌పై తలపెట్టిన యుద్ధం గురించి ఇజ్రాయెలీలను ఉద్దేశించి అందులో ఆయన ప్రసంగించారు. అయితే వీడియోలో ఒకచోట నెతన్యాహు కుడి చేతికి ఆరు వేళ్లున్నట్టుగా కన్పించింది. అది నెటిజన్లను వెంటనే ఆకర్షించింది. చూస్తుండగానే ఆ వీడియోకు 10 లక్షలకు పైగా వ్యూస్ లభించాయి. వాస్తవానికి నెతన్యాహు రెండు చేతులకూ ఐదు వేళ్లే ఉంటాయి. దాంతో ఆ అధికారిక వీడియో పలు అనుమానాలకు తావిచ్?చంది. దానిపై రకరకాల విశ్లేషణలూ తెరపైకొచ్చాయి. అందులో ఉన్నది నెతన్యాహు కాదని, అది ఏఐ జెనరేటెడ్ వీడియో అని నెటిజన్లు అనుమానం వెలిబుచ్చారు. మార్చి 2వ తేదీన నెతన్యాహు కార్యాలయంపై ఇరాన్ క్షిపణి దాడిని పలువురు గుర్తు చేశారు. ఆ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారని, బహుశా మరణించి ఉంటారని ఇరాన్ అప్పుడే ప్రకటించింది. కానీ కాసేపటికే నెతన్యాహు బాహాటంగా కన్పించారు. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో దెబ్బతిన్న పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న వీడియోలను ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. దాంతో ఆయన మరణించారన్న వార్తలకు తెరపడింది. కానీ మార్చి 2 నాటి దాడిలో నెతన్యాహు నిజంగానే మరణించడమో, తీవ్రంగా గాయపడటమో జరిగిందని తాజాగా నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. యుద్ధం మధ్యలో ఆ విషయం బయటికొస్తే ఇరాన్‌కు నైతిక బలంగా మారుతుందనే భయంతో ఇజ్రాయెల్ గోప్యంగా ఉంచి ఉంటుందన్నది వారి విశ్లేషణ. అందుకే నాటినుంచీ ఏఐ సాయంతో నెతన్యాహు వీడియోలను రూపొందిస్తూ ప్రపంచాన్ని మభ్యపెడుతోందన్నది వాటి సారాంశం. కానీ నెతన్యాహు తాజా వీడియో నిజమైనదేనని పలు ఫ్యాక్ట్ చెకింగ్ సైట్లు అంటున్నాయి. వీడియో నిజమే గానీ కుడి చేతికి ఆరు వేళ్లు వాస్తవం కాదని గ్రోక్ తేల్చింది. ఒకానొక ఫ్రేమ్‌లో నిర్దిష్ట కోణంలో అరచేతికి ఆరో వేలున్నట్టు కేవలం దృశ్యభ్రాంతి కలుగుతోందని పేర్కొంది. అయినా ఆన్‌లైన్ రగడకు తెర పడకపోవడం విశేషం! 'నెతన్యాహు ఎక్కడ?', 'బిబి (నెతన్యాహు ముద్దుపేరు) క్షేమమేనా?'అంటూ సోషల్ మీడియాలో పోస్టుల వరద కొనసాగుతూనే ఉంది. నెటిజన్లు తమ వాదనకు మద్దతుగా శుక్రవారం నాటి అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ ఇంటర్వ్యూను కూడా ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. వైట్‌హౌస్‌లో ఓ మీడియా ప్రతినిధికి బెసెంట్ ఇంటర్వ్యూ ఇస్తుండగా అధ్యక్షుడు ట్రంప్ నుంచి 'అత్యవసర'పిలుపు రావడంతో ఉన్నపళంగా 'సిచ్యుయేషన్ రూమ్'కేసి పరుగెత్తారు. ఏకంగా రెండు గంటల అనంతరం తిరిగొచ్చారు. తర్వాత ఇంటర్వ్యూ కొనసాగించినా బెసెంట్‌లో తడబాటు, గొంతులో వణుకు కనిపించాయి. "నెతన్యాహు ఇక లేరని బహుశా ట్రంప్‌కు ఉప్పంది ఉంటుంది. అదే విషయాన్ని బెసెంట్‌తో పంచుకున్నారు. తడబాటుకు అదే కారణం కావచ్చు"అని సోషల్ మీడియా యూజర్లు విశ్లేస్తున్నారు. ప్రఖ్యాత రాజకీయ వ్యాఖ్యాత జోహనస్ ఎం.కొన్రాడ్ట్ కూడా నెతన్యాహు మరణించారని సదరు వీడియోను ఉటంకిస్తూ పేర్కొనడం విశేషం. ఆ విషయం తెలియడం వల్లే బెసెంట్ అంతగా దిగ్భ్రాంతికి లోనైనట్టు కన్పించారని ఆయన కూడా చెప్పుకొచ్చారు.

# నూకలతో డిజైనర్ బియ్యం

### మూడు రెట్లు ప్రొటీన్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌తో షుగర్‌ను పెంచని వరి బియ్యం సిద్ధం

### నూకలతో షుగర్ నిరోధక డిజైనర్ వరి బియ్యం ఉత్పత్తి సాంకేతికతను రూపొందించిన సీఎస్ఐఆర్

### జన్యుమార్పిడి అవసరం లేకుండా గోల్డెన్ రైస్ ఉత్పత్తి

### రెండు సంస్థలకు సాంకేతికత బదిలీ.. త్వరలో మార్కెట్‌లోకి..



సాధారణ వరి బియ్యం కన్నా మూడు రెట్లు అధిక ప్రొటీన్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన సరికొత్త డిజైనర్ వరి బియ్యం మన వంటగదిలోకి త్వరలోనే రానున్నాయి. పసుపు రంగులో ఉండే ఈ పోషక సంపన్న బియ్యం చూడ్డానికి, తినటానికి సాధారణ బియ్యం మాదిరిగానే ఉంటాయని చెబుతున్నారు. కేంద్ర శాస్త్ర, పారిశ్రామిక పరిశోధనా సంస్థ (సీఎస్ఐఆర్)కు అనుబంధంగా తిరువనంతపురంలోని నేషనల్ ఇంటర్ డిసిప్లినరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐఐఎస్‌టీ) శాస్త్రవేత్తలు ఈ డిజైనర్ రైస్‌ను ఉత్పత్తి చేసే సాంకేతికతను రూపొందించారు. దేశంలో తెల్ల బియ్యం తినే కోట్లాది మందిని వేధిస్తున్న సూక్ష్మ పోషకాహార లోపాన్ని పరిష్కరించటం, షుగర్ ముప్పును తగ్గించే లక్ష్యంతో ఈ బియ్యాన్ని రూపొందించినట్లు ఎన్ఐఐఎస్‌టీ ప్రకటించింది. సాధారణ తెల్ల వరి బియ్యంలో పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది త్వరగా జీర్ణమై రక్తంలో గ్లూకోజ్‌ను పెంచుతుంది. టైప్ 2 డయాబెటిస్ పెరుగుదలకు దోహదం చేస్తుంది.

### డిజైనర్ బియ్యం అంటే?

వరి బియ్యం నూకను పిండి చేసి.. అందులో ఉండే పిండి పదార్థం, మాంసకృత్తులు, పీచును వేరుచేస్తారు. ఎక్కువ మోతాదులో ఉండి బ్లడ్ షుగర్ పెంచుతున్న పిండి పదార్థాన్ని తగ్గించి, ప్రొటీన్లను మూడు రెట్లు పెంచేలా, సమతుల్యత పొందేలా బియ్యాన్ని తిరిగి తయారు చేస్తారు. ఇది జీవక్రియ సంబంధమైన అనారోగ్యానికి చురుకైన, నిర్మాణాత్మక పరిష్కారంగా పనిచేసే పోషక--సాంద్రత గల ఆహారమని చెబుతున్నారు. మన అభీష్టానికి అనుగుణమైన సుగుణాలతో రూపొందించింది కాబట్టి 'డిజైనర్ బియ్యం' అని పిలుస్తున్నారు.

### పౌష్టికాహార లోపానికి చెక్

మన దేశం ఒక విలక్షణమైన ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అధిక గ్లైసెమిక్ సూచిక (జీఐ)తో కూడిన తెల్ల బియ్యంతో భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర ప్రమాదుకరమైన వేగంతో పెరుగుతుంది. మరోవైపు, లక్షలాది మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. తగినన్ని కేలరీల అన్నం తిన్నప్పటికీ ప్రొటీన్, ఖనిజాల లోపం వస్తోంది.

### డిజైనర్ రైస్ ప్రయోజనాలు

తక్కువ జీఐ (55 కంటే తక్కువ): శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచదు.

ప్రొటీన్ పవర్‌హౌస్: సాధారణ బియ్యంలో 6--8% ప్రొటీన్ ఉంటుంది. ఈ బియ్యంలో 20% కంటే ఎక్కువే ఉంటుంది.

బలవర్ధకమైన రక్షణ: ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బీ12ను కలిపి తయారు చేసిన బియ్యం కావటంతో రక్తహీనతను తగ్గిస్తుంది.

పిండి తగ్గించి ప్రొటీన్లు పెంచాం

డిజైనర్ బియ్యాన్ని ఒక 'ఆహార భవన నిర్మాణం'గా భావించండి. ఉదాహరణకు.. సాధారణ బియ్యం లాంటి ఒక భవనం ఉందనుకోండి. ఇది ఎక్కువగా 'చక్కెర ఇటుకల' (పిండి పదార్థం)తో తయారైన ఇల్లు. ఎన్ఐఐఎస్‌టీ పరిశోధకుల బృందం ఆ ఇంటిలోని ఇటుకలన్నింటినీ విడదీశారు. ఆ ఇటుకల్లో ఎక్కువగా ఉన్న పిండి పదార్థాన్ని చాలావరకు తొలగించి, ఆ ఖాళీని ప్రొటీన్ల ఇటుకలతో భర్తీ చేశారు. జన్యుమార్పిడి సాంకేతికతకు బదులు ఆహార శుద్ధి సాంకేతికతను ఉపయోగించి ఈ బియ్యాన్ని రూపొందించారు. తక్కువ ధరకు అమ్ముడయ్యే వరి నూకను మెత్తని పిండిగా చేసి.. అందులో పిండి పదార్థాన్ని తీసేసి.. ఆ మేరకు ప్రొటీన్లు, ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్--బీ12 వంటి సూక్ష్మపోషకాలను కలిపారు. ఈ మిశ్రమాన్ని లేత పసుపు రంగులో ఉండే సన్న వరి బియ్యపు గింజలుగా తయారు చేశారు. మనకు తెలిసిన బియ్యంలాగా ఇవి కనిపిస్తాయి. రుచిగా, సంతృప్తికరంగా ఉండేలా డిజైనర్ బియ్యాన్ని తయారు చేశారు. అధిక ప్రొటీన్ ఉన్న కారణంగా ఈ బియ్యంతో వండిన అన్నం మామూలు అన్నం కంటే రుచిగా ఉంటుంది. నూకలకు విలువ పెరుగుతుంది కాబట్టి రైతులకూ ఉపయోగకరమే.

# సోషల్ మీడియాతో సంతోషం ఆవిరి!

### యువతలో పెరుగుతున్న ఆందోళన

### 'వరల్డ్ హ్యాపినెస్ రిపోర్ట్-2026'వెల్లడి

### సంతోషకరమైన దేశాల్లో ఫిన్‌లాండ్‌కు మొదటి ర్యాంకు

### అమెరికాకు 23, కెనడాకు 25, బ్రిటన్‌కు 29వ ర్యాంకు

### 147 దేశాలకు గాను 116వ స్థానంలో నిలిచిన భారత్



హెల్సింకీ: ఆధునిక కాలంలో అందుబాటులోకి వచ్చిన సోషల్ మీడియా యువతలో సంతోషాన్ని ఆవిరి చేస్తోంది. లేనిపోని ఆందోళనకు కారణమవుతోంది. ప్రధానంగా పశ్?చమ దేశాల్లో ఈ పరిస్థితి అధికంగా కనిపిస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ గురువారం విడుదల చేసిన 'వరల్డ్ హ్యాపినెస్ రిపోర్ట్--2026'ఇదే విషయం వెల్లడించింది. గ్యాలప్ విశ్లేషణ సంస్థ, ఐక్యరాజ్యసమితి సస్టెనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో ఈ నివేదిక రూపొందించారు. అధ్యయనంలో భాగంగా 147 దేశాల్లో లక్షల మందిని ప్రశ్నించారు. వారి అభిప్రాయాలు సేకరించారు. ప్రపంచంలో ఫిన్‌లాండ్ అత్యంత సంతోషంగా ఉన్న దేశమని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో ఫిన్‌లాండ్ వరుసగా తొమ్మిదోసారి అగ్రస్థానం దక్కించుకోవడం విశేషం. ఈసారి టాప్--10 జాబితాలో ఫిన్‌లాండ్‌తోపాటు ఐస్‌లాండ్, డెన్మార్క్, స్వీడన్, నార్వే తదితర దేశాలకు స్థానం దక్కింది. అగ్రరాజ్యం అమెరికాకు 23, కెనడాకు 25, బ్రిటన్‌కు 29వ ర్యాంకు లభించింది. భారత్‌కు 116వ ర్యాంకు దక్కింది. నివేదికలోని కీలక అంశాలివీ..

కోస్టారికా దేశం 2023లో 23వ స్థానంలో ఉండగా, 2026లో నాలుగో ర్యాంకు దక్కించుకుంది.

ఏమాత్రం సంతోషంగా లేని దేశాల్లో అఫ్గానిస్తాన్, సియెర్రాలియోన్, మలావీ నిలిచాయి.

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో 25 ఏళ్లలోపు యువత సోషల్ మీడియాకు బానిసగా మారుతోంది. ఫలితంగా వారు వాస్తవ ప్రపంచానికి దూరంగా జీవిస్తున్నారు. సంతోషానికి దూరమవుతున్నారు.

మనుషులు సంతోషంగా ఉండాలంటే కుటుంబ బంధాలకు విలువ ఇవ్వడం చాలా ముఖ్యం. సామాజికంగా ఇతరులతో స్నేహ సంబంధాలు మెరుగుపర్చుకోవాలి.

సామాజిక జీవితాల్లో నాణ్యత, స్థిరత్వం ఉన్న దేశాల్లో ప్రజలు సంతోషంగా ఉంటున్నట్లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్ ఎమ్మానుయేల్ డీ నెవ్ చెప్పారు. లాటిన్ అమెరికా దేశాల్లో కుటుంబ బంధాలు, సామాజిక సంబంధాలు బలంగా ఉంటాయని వెల్లడించారు. అందుకే అక్కడి ప్రజలు సంతోషంగా జీవిస్తున్నట్లు స్పష్టంచేశారు.

ఫిన్‌లాండ్‌తోపాటు ఉత్తర యూరోపియన్ దేశాలు సంతోషంగా ఉండడానికి కారణం ఏమిటన్నది పరిశీలిస్తే.. అక్కడి సంపద, ఆ సంపద పంపిణీలో సమానత్వం, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వాలు ఉండడం, ఆర్థిక విపత్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు చర్యలు చేపట్టడం, ఆరోగ్యకరమైన జీవన శైలి, ప్రజల ఆయుర్దాయం ఎక్కువగా ఉండడం వంటివి కనిపిస్తాయి.

## దుబ్బాకలో మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




సిద్దిపేట జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్ తెలంగాణ) మార్చి21:దుబ్బాక నియోజకవర్గంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ బక్కి వెంకటయ్య గారు పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించారు. భూంపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్ చారి తల్లి భూంపల్లి భాగ్యలక్ష్మి గారు మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే చీకుడు గ్రామానికి చెందిన సంఘం ప్రభాకర్ తండ్రి రాజయ్య గారు మరణించగా వారి కుటుంబాన్ని సందర్శించి ఓదార్చారు. ఖాజీపూర్ గ్రామానికి చెందిన విఠల్ సేటు గారు మరణించగా వారి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చైర్మన్ వెంకటయ్య గారు, వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆస సులోచన స్వామి, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ గన్నే వనిత భూమిరెడ్డి, మాజీ ఎంపీపీ పంజాల శ్రీనివాస్, గంబీర్‌పూర్ సర్పంచ్ బాణాల శ్రీనివాస్, భూంపల్లి ఉపసర్పంచ్ బాల్శెట్టి అనూష నందం, వార్డు సభ్యులు అనిల్, మాజీ ఉపసర్పంచ్ వడ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దవెళ్ళిలో ఘనంగా ఈద్ ఉల్ ఫితర్ ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు



లోకల్ గైడ్ కేశంపేట :కేశంపేట మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలో శనివారం ముస్లిం సోదరులు ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.. ముస్లింల పవిత్ర మాసమైన రంజాన్ నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు చివరి రోజైనా రంజాన్ పర్వదినాన్ని ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిర్దవెళ్లి గ్రామ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద లేమామిడి, కాకునూరు , తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు అలింగనం చేసుకొని రంజాన్ శు భాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద సీసీ రోడ్డు, ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్ మైనార్టీ నాయకులు ఎండి.మక్బూల్, జబ్బార్ ఖాన్, ఖలిక్ మౌలిసాబ్, హఫీజ్ ఖాన్, నసీరుద్దీన్, జహెద్, అజీజ్, ఇస్మాయిల్ ఖాన్, ఆర్మాన్, పాషా, జబ్బార్, ఖాజా, ఫైజన్, అజహర్, జాకీర్, సిరాజ్ , షాబుద్దీన్,మజహర్ వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రమేష్ , రాము, మల్లయ్య, మోహిజ్ , జంగేష్, నాయకులు పల్లాటి సురేందర్, పి.కృష్ణయ్య, జంగయ్య, జైసింగ్, రంగయ్య, వెంకటేష్ ,జంగాచారి, శ్రీశైలం,ముత్యాలు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ ను పురస్కరించుకొని గౌరవ కౌన్సిలర్ 23 వార్డ్



లోకల్ గైడ్‌యూనూస్ బాయ్ గారు వారి ఇంటి వద్ద రంజాన్ దావత్ ఇచ్చి మున్సిపల్ సిబ్బందికి శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వాటర్ సప్లై ఇన్చార్జ్ లింగం మరియు ఎలక్ట్రిషన్ మరియు యూనియన్ నాయకులు ప్రభాకర్, ప్రభు, వార్డ్ ఆఫీసర్, వినయ్, ప్రకాష్, సానిటరీ జవాన్ వారి సిబ్బంది వాటర్ మ్యాన్ ఎస్ కే పాషా ట్యాంకర్ డ్రైవర్ సుదర్శన్ శ్రీకాంత్ మిత్రులు కుమార్ రాజేందర్ వారి కుటుంబ సభ్యులు పాలు పంచుకోవడం జరిగింది యూనుస్ బాయ్ మాట్లాడుతూ మీరందరూ నాకు సహకరిస్తేనే నా వార్డ్ ప్రజలు అందరూ మంచిగా ఉంటారని నేను కూడా ఎల్లప్పుడూ మీకు సహకరిస్తానని మనమందరం కలిసి మెలిసి ఉంటే ఏదైనా అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు ఇంతవరకు ఏ కౌన్సిలర్ కూడా ఇన్ని సంవత్సరాలల్ల ఎవరు కూడా మున్సిపల్ సిబ్బందిని పిలిచి తన ఇంటికి పిలిచి సన్మానం చేయలేరు మా అందరికీ చాలా సంతోషకరం గా ఉంది ఆయనకు ఆయన కుటుంబ సభ్యులందరికీ రంజాన్ శుభాకాంక్షలు నాయకులు కాత్రియాల ప్రభు,ప్రభాకర్

## చర్లలో టీ-10 అంతర్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



చర్ల : లోకల్ గైడ్ :చర్ల పోలీస్ గ్రౌండ్, గడికోటలో నిర్వహించనున్న టీ-10 అంతర్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, మాజీ రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు, కురుకుందుల జితేందర్‌లు సంయుక్తంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు యువతకు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి అంతర్ రాష్ట్ర స్థాయి పోటీలు గ్రామీణ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. ఈ క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చర్ల మండలం యూత్ ప్రెసిడెంట్ జితేందర్, కమిటీ సభ్యులు, స్థానిక క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.""""""

## బుగ్గ దేవాలయానికి వంట సామాగ్రి పంపిణీ...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల రాజరాజేశ్వరి దేవాలయానికి దాత శనివారం వంట సామాగ్రిని అందజేశారు. బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాదం వండుటానికి బెల్లంపల్లి పట్టణ వాస్తవ్యులు కొలిపాక రాజేందర్,కొలిపాక అరవింద్ లు ఆలయ కమిటీ చైర్మన్ మహేష్ కు శనివారం వంట సామాగ్రి అందజేసారు. ఎంతో సహృదయంతో ఆలయంలో అన్నప్రసాదాలు వండడానికి వంట సామాగ్రి అందజేసిన దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వృద్ధుడు ఆత్మహత్య..



బెల్లంపల్లి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన జాడి మొండయ్య(80)అనే వృద్ధుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు తాండూరు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సింగరేణిలో ఉద్యోగం చేసి పదవి విరమణ పొందిన మృతుడు కుమారుడు జాడి పోషం వద్ద నివాసం ఉంటున్నాడని తెలిపారు. గత 2సంత్సరాల క్రితం మృతుడికి పక్షవాతం రావడంతో అప్పటి నుండి తన రోజువారీ పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉండేవాడని,అదే విషయం గురించి రోజు బాధపడుతు ఉండేవాడని,శనివారం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి దగ్గరలో ఉన్న బాత్రూంలోకి వెళ్ళి ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో ఇంట్లో వాళ్ళు వెళ్ళి చూడగా మృతుడు బాత్రూంలో ఉన్న రాడ్ కి తాడుతో మెడకు ఉరి పెట్టుకొని చనిపోయి ఉన్నాడని తెలిపారు. వెంటనే బంధువులు అతనికి సిపిఆర్ చేసినప్పటికి మృతుడు చనిపోయాడని ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా జీ లక్ష్మణ్ కుమార్ నియామకం

### రాష్ట్ర స్థాయిలో గుర్తింపు చర్ల యువకుడికి గౌరవం




చర్ల : లోకల్ గైడ్ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన ప్రముఖ కళాకారుడు, విద్యావేత్త జి. లక్ష్మణ్ కుమార్‌ను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సాహిత్య, సాంస్కృతిక సంస్థ 'శ్రీ శ్రీ కళావేదిక' తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా నియమించారు. ఈ నియామకం జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువకుడు రాష్ట్ర స్థాయి పదవిని అధిరోహించడంతో స్థానిక కళాకారులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### అద్భుత కళా ప్రస్థానం

జీ లక్ష్మణ్ కుమార్ బహుముఖ ప్రజ్ఞాశాలి. సుమారు 60 మంది సినీ, రాజకీయ ప్రముఖుల గళాలను అనుకరించే మిమిక్రీ కళలో ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. 2003లో కాకతీయ యూనివర్సిటీ నిర్వహించిన యువజనోత్సవాల్లో మిమిక్రీ ప్రదర్శన చేసి, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. కళాకారుడిగానే కాకుండా కవిగా కూడా ఆయన ప్రతిభ చాటుకున్నారు. 300కు పైగా పాటలు, 1000కు పైగా కవితలు రచించారు.

#### ప్రఖ్యాత వేదికలపై ప్రదర్శనలు

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి, త్యాగరాయ గానసభ (చిక్కడపల్లి), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, విజయవాడ, ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం, ప్రసాద్ కలర్ ల్యాబ్ వంటి ప్రతిష్టాత్మక వేదికలపై వందలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

#### విద్యావేత్తగా, జర్నలిస్టుగా రాణింపు

జీ లక్ష్మణ్ కుమార్ ఎం.ఏ (తెలుగు), ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), బి.ఎడ్, ఎల్.ఎల్.బి వంటి ఉన్నత విద్యలను పూర్తిచేశారు. ప్రస్తుతం ఒక కళాశాలకు ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్నారు. సామాజిక స్పృహతో జర్నలిస్టుగా కూడా తన కలం, గళాన్ని వినిపిస్తున్నారు. నటన, షార్ట్ ఫిల్మ్ రంగంలో ప్రతిభపాఠశాల దశ నుంచే నాటక రంగంలో ప్రవేశించిన లక్ష్మణ్ కుమార్, 2022లో ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాల్లో భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున పాల్గొని జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. 2018లో ఏలూరులో నిర్వహించిన "చిన్న సినిమా పెద్ద సందేశం" షార్ట్ ఫిల్మ్ పోటీల్లో 8 రాష్ట్రాల నుండి వచ్చిన 80 చిత్రాల మధ్య "ఒంటరి వ్యసనం" చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. అదేవిధంగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్వహించిన బతుకమ్మ ఫిల్మ్ ఫెస్టివల్2025లో చర్ల మండలంలోని ఆదివాసీలతో కలిసి "అధికర్మయోగి" షార్ట్ ఫిల్మ్ నిర్మించి సినీ ప్రముఖుల ప్రశంసలు పొందారు.

#### కృతజ్ఞతలు తెలిపిన లక్ష్మణ్ కుమార్

ఈ సందర్భంగా జీ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, తనను రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా నియమించినందుకు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ (సీఈఓ), జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి యశోభూషణంకు కృతజ్ఞతలు తెలిపారు. 9 దేశాల్లో 15,000 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ సంస్థ ద్వారా తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధికి, తెలంగాణ కళాకారుల గుర్తింపుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# 75.8 శాతం మంది భారతీయులు యాక్టివ్ డైరీ వినియోగదారులు...

### గృహ పోషణలో కీలక పాత్ర పోషిస్తున్న మల్టీ ప్రొడక్ట్ మిల్క్ అండ్ డైరీ లైఫ్ స్టైల్... గోద్రెజ్ జెర్సీ ఇండియా లాక్టోగ్రాఫ్ ఫలితాలు ఎఫ్ వై25-26

కుత్బుల్లాపూర్ మార్చి 21( లోకల్ గైడ్ ప్రతినిధి)భారతదేశంలో పాలతో ఉన్న అనుబంధం కేవలం ఒక గ్లాసు పాలు తాగడానికే పరిమితం కాలేదు. మన అల్పాహారం, పండగ సమయంలో పంచుకునే మిఠాయిలు, రోజువారీ వంటలు మరియు ఇప్పుడు ప్రోటీన్ షేక్స్, స్మూతీలలో కూడా పాలు భాగమయ్యాయి, గోద్రెజ్ జెర్సీ విడుదల చేసిన లాక్టోగ్రాఫ్ నివేదిక ప్రకారం.. భారత దేశంలో 75.8 శాతం మంది ఇప్పుడు యాక్టివ్ డైరీ వినియోగదారులుగా ఉన్నారు. అంటే వీరు కేవలం పాలు మాత్రమే కాకుండా పెరుగు, పనీర్, నెయ్యి, వెన్న, లస్సీ, యోగర్ట్ మరియు చీజ్ వంటి రకరకాల పాల ఉత్పత్తులను క్రమం తప్పకుండా వాడుతున్నారు. పాలు కేవలం అప్పుడప్పుడు తీసుకునే అదనపు పానీయం మాత్రమే కాదు.. అన్ని ప్రాంతాలు మరియు అన్ని తరాల వారి భారతీయ ఆహార సంస్కృతిలో భాగమైపోయిన రోజువారీ బహుళ-ఉత్పత్తుల పోషకాహార వ్యవస్థగా డైరీ ఆవిర్భవించింది. ఒక గ్లాసు పాలకు బదులుగా, భారతీయ గృహాలు ఈ నివేదిక పేర్కొన్న విధంగా ఒక "డైరీ బాస్కెట్"ను (పాల ఉత్పత్తుల సముదాయం) నిర్మించుకుంటున్నాయి. యాక్టివ్ డైరీ వినియోగదారులలో జాతీయ స్థాయిలో పెరుగు (80 శాతం), పనీర్ (76 శాతం), వెన్న (74 శాతం) మరియు నెయ్యి (71 శాతం) అత్యంత ఇష్టపడే ఉత్పత్తులుగా ఉన్నాయి. వీటి తర్వాత వరుసగా లస్సీ (63 శాతం), చీజ్ (58 శాతం), యోగర్ట్ (57 శాతం) మరియు సంప్రదాయ పాల మిఠాయిలు (55 శాతం) ఉన్నాయి. వంటల్లో, భోజన , భోజన అనుబంధ పదార్థాలుగా, చిరుతిళ్లుగా మరియు వేడుకలలో డైరీ పోషిస్తున్న పాత్రను ఈ విస్తృత వినియోగం నొక్కి చెబుతోంది. ఒక భారత్, అనేక డైరీ ప్లేట్లు..భారతీయ గృహాలన్నింటిలో డైరీ అనేది ఒక ఉమ్మడి అంశంగా ఉన్నప్పటికీ, అది ప్లేట్పై కనిపించే విధానం ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. డైరీ ఉత్పత్తులలో పెరుగు అత్యంత విస్తృతంగా కనిపిస్తుంది. దక్షిణాదిలో పెరుగన్నం, మజ్జిగ నుండి, ఉత్తరాదిన రైతా, దహీ వరకు దేశవ్యాప్తంగా రోజువారీ భోజనంలో విడదీయలేని భాగంగా కలిసిపోయింది. ఇది పెరుగును నిజమైన పాన్-ఇండియన్ ప్రధాన ఆహారంగా మార్చింది. పనీర్ ఒకప్పుడు ఎక్కువగా ఉత్తర భారత వంటకాలకే పరిమితమై ఉండేది. కానీ ఇప్పుడు దేశవ్యాప్తంగా తన ప్రభావాన్ని క్రమంగా విస్తరించుకుంది. ప్రస్తుతం ఇది ప్రాంతీయ వంట పద్ధతుల్లోనూ మరియు వివిధ రకాల భోజనాల్లోనూ కనిపిస్తోంది. సంప్రదాయ మరియు ఆధునిక వంటకాలు రెండింటిలోనూ పనీర్ ఒక అంగీకరించిన శాఖాహార ప్రోటీన్గా ఎలా ఎదిగిందో ఇది ప్రతిబింబిస్తోంది. అదే సమయంలో పాలతో చేసే రుచికరమైన పదార్థాలు తమ ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నాయి. నెయ్యి, వెన్న, సంప్రదాయ పాల మిఠాయిలు గృహాల దైనందిన అలవాట్లలో, వేడుకలలో విడదీయలేని భాగంగా ఉన్నాయి. వినియోగదారులు ఆరోగ్యం మరియు సమతుల్యత పట్ల మరింత జాగ్రత్తగా ఉంటున్నప్పటికీ, డైరీ ఉత్పత్తులకు ఉన్న భావోద్వేగ, సాంస్కృతిక ప్రాముఖ్యతను ఇది మరింత బలపరుస్తోంది. ఆధునిక కాలంలో ప్రోటీన్ పట్ల అవగాహన పెరిగిన జీవనశైలికి, ముఖ్యంగా యువత, నగరాల్లో ఉండేవారికి అనుగుణంగా డైరీ తనను తాను మార్చుకుంది. సంప్రదాయ పద్ధతులే కాకుండా, ప్రస్తుతం స్మూతీలు, షేక్స్ మరియు కేఫ్ తరహా పానీయాలలో ఇది ప్రధానంగా కనిపిస్తోంది. శక్తి, ఫిట్నెస్ మరియు పోషణపై దృష్టి సారించే నేటి ఆధునిక దైనందిన అలవాట్లలో ఇది సులభంగా కలిసిపోయింది. పాలు మరియు డైరీ ఆధారిత పానీయాలు ఇప్పుడు కాఫీ, ప్రోటీన్ షేక్స్, స్మూతీల సరసన చేరుతున్నాయి. ఇవి కేవలం చిన్ననాటి అలవాటుగా మాత్రమే మిగిలిపోకుండా.. రోజువారీ శక్తి, అలసట నుండి కోలుకోవడం మరియు మెరుగైన పనితీరు కోసం ఉపయోగపడే బహుముఖ సాధనాలుగా అందరూ ఆదరిస్తున్నారు. ఈ నివేదిక ఫలితాలపై గోద్రెజ్ జెర్సీ మార్కెటింగ్ హెడ్ శంతను రాజ్ మాట్లాడుతూ.. 'భారతదేశం కేవలం ఒక గ్లాసు పాలు అనే ఆలోచనను దాటి నిర్ణయాత్మకంగా ముందుకు సాగింది, పాలు అనేవి ఒకే రకమైన ప్రధాన ఆహారంగా ఉండటం నుండి పనీర్, పాల ఆధారిత పానీయాలు మరియు అధిక ప్రోటీన్ కలిగిన ఉత్పత్తుల వరకు ఎలా పరిణామం చెందాయో మనం చూస్తున్నాం. ఇవి అద్భుతమైన రుచితో పాటు అదనపు ప్రయోజనాలను కూడా అందిస్తున్నాయి. గోద్రెజ్ జెర్సీలో మా ప్రయాణం ఈ మార్పును ప్రతిబింబిస్తోంది, పాలపై ఉన్న నమ్మకాన్ని కొనసాగిస్తూనే, ఆధునిక వినియోగదారులకు మరింత పోషణ, సౌలభ్యం, అనేక ప్రయోజనాలను అందించేలా మేం విస్తరిస్తున్నాము. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా రుచి, ప్రోటీన్ మరియు రోజువారీ అవసరాలను కలగలిపి నేటి భారతదేశానికి తగ్గట్టుగా డైరీ రంగాన్ని కొత్తగా ఆవిష్కరించడమే మా లక్ష్యం' అని ఆయన పేర్కొన్నారు. భారతీయులు ఏం తింటున్నారు, ఎంత తరచుగా, ఏ రూపంలో తీసుకుంటున్నారు అనే అంశాలను విశ్లేషించడం ద్వారా మన దేశ ఆహారపు అలవాట్లపై ఈ నివేదిక స్పష్టమైన అవగాహన కల్పిస్తోంది. రోజువారీ గృహ పోషణలో డైరీ ఒక ముఖ్యమైన పునాది అని ఇది ధృవీకరిస్తోంది. సంప్రదాయ భోజనపు థాలీ నుండి జిమ్ బాటిల్ వరకు, అలాగే ఇంటి వంటగది నుండి ఆధునిక కేఫ్ తరహా పానీయాల వరకు అన్నింటికీ సరిపోయేలా డైరీ ఉత్పత్తులు అన్నింటికీ సరిపోయేలా మారాయి. క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్ గురించి:దక్షిణ భారతదేశంలోని ఒక ప్రముఖ ప్రైవేట్ డెయిరీ సంస్థ అయిన గోద్రెజ్ జెర్సీ, 1986 నుండి పాడి పరిశ్రమలో ఒక విశ్వసనీయమైన పేరుగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక మరియు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లలో తన ఉనికిని చాటుకుంటూ, ఈ సంస్థ జెర్సీ పేరుతో అధిక నాణ్యత గల పాల ఉత్పత్తులను అందిస్తూ నిలకడగా అభివృద్ధి చెందింది. 8 కాంపోజిట్ డెయిరీ ప్లాంట్లు మరియు ఒంగోలులో ఒక అత్యాధునిక మిల్క్ పౌడర్ ప్లాంట్‌తో, గోద్రెజ్ జెర్సీ తన పాల వ్యాపార మూలాల నుండి విభిన్నమైన, వినూత్నమైన పాల ఉత్పత్తుల శ్రేణి వరకు తన ఉత్పత్తి శ్రేణిని విస్తరించింది. సంవత్సరాలు గడిచేకొద్దీ, జెర్సీ తన స్థిరమైన నాణ్యతతో లక్షలాది మంది నమ్మకాన్ని సంపాదించుకుని, ప్రతి ఇంట్లోనూ సుపరిచితమైన పేరుగా మారింది. ప్రఖ్యాత గోద్రేజ్ బ్రాండ్‌తో ఇటీవల ఏర్పడిన అనుబంధం తరువాత, జెర్సీ తన గుర్తింపును పునర్నిర్వచించుకునే ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ కొత్త దృశ్య రూపకల్పన, సుపరిచితమైన ఆవు నమూనా వారసత్వాన్ని నిలుపుకుంటూనే, మరింత శుభ్రమైన, ఆధునికమైన మరియు వినియోగదారులకు అనుకూలమైన ప్రదర్శన కోసం సవరించబడింది. ఈ నవీకరించబడిన రూపం, జెర్సీ యొక్క గొప్ప వారసత్వాన్ని మరియు గోద్రేజ్ బ్రాండ్‌తో చిరకాలంగా ముడిపడి ఉన్న నాణ్యత మరియు విశ్వాసం యొక్క వాగ్దానాన్ని రెండింటినీ ప్రతిబింబిస్తుంది. గోద్రేజ్ జెర్సీ తన వారసత్వాన్ని నిలబెట్టుకుంటూనే, ఒక సరికొత్త, సమకాలీన గుర్తింపును స్వీకరిస్తూ, స్వచ్ఛత, నాణ్యత మరియు ఆవిష్కరణలకు పర్యాయపదంగా నిలిచే ఉత్పత్తులను అందిస్తోంది.

# విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు తేవాలి.

### ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మార్చి 21. (లోకల్ గైడ్) విద్యుత్ బస్ ల వల్ల ఆర్టీసి రక్షణ, కార్మికుల ఉద్యోగులకు ఎసరు వస్తుందని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ విధానంలో మార్పులు కోసం ఐక్య పోరాటం జరగాల్సిన అవసరం వుందని, ఐక్య పోరాటాల ద్వారానే" ఆర్టీసీ రక్షణ -కార్మికుల హక్కుల హక్కుల పరిరక్షణ" సాధించుకోగలుగుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నల్గొండ డిపో గౌరవ అధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య అన్నారు. శనివారం నల్గొండ ఆర్టీసీ డిపో ఆవరణంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు, విద్యుత్ బస్సులను ఆర్టీసీ కి కేటాయించాలని డిమాండ్ బ్యానర్ పై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యుత్ బస్ కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్, ఆర్టీసిలె నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ ల విధానంలో మార్పులు చేయాలని డిమాండు చేశారు. కార్మికుల ఉద్యోగ భద్రత, విద్యుత్ బస్ ల విధానాల్లో మార్పు, కేంద్ర ప్రభుత్వ విధానంలో మార్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయకపోగా, ప్రయివేటు విద్యుత్ ల విధానాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ బస్ లను సమకూర్చుకొంటున్నది. ఈ విధానంలో మార్పు జరగకుండా, ఆర్టీసీలు తమ మనుగడ సాగించడం కష్టమని ఉద్యోగులకు ముప్పు వస్తుందన్నారు. విద్యుత్ బస్ ల విధానంలో మార్పు కోసం ఆర్టీసిలోని అన్ని కార్మిక సంఘాలు సమైక్య ఆందోళనకు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ప్రజా రవాణా సంస్థలను ప్రైవేటు సంస్థలకు వారికి అప్పచెప్పడాన్ని ఎస్ డబ్ల్యూ ఎఫ్ వ్యతిరేకిస్తున్నదని ఆ పద్ధతిని మార్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు విపరీతమైన పని భారము మోపిందన్నారు. కార్మికుల ను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈనెల 24న అన్ని డిపోల ముందు జరుగు ధర్నాలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణాల పరిపూర్ణాచారి, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జంజరాల శ్రీనివాస్, టిజేఎస్ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి, ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజయన్ అధ్యక్షులు కందుల నరసింహ, సహాయ కార్యదర్శి కే శ్యాంసుందర్ డిపో కార్యదర్శి ఎస్.కె గులాం రసూల్ పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గెట్ టు గెదర్ లో సింగరేణి ఉద్యోగులు పాల్గొనాలి...

బెల్లంపల్లి (లోకల్ గైడ్)ఈనెల 22న నిర్వహించనున్న గెట్ టు గెదర్ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు,పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పాల్గొనాలని కార్యక్రమ నిర్వాహకులు రాసకట్ల బాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి నెంబర్1,1ఎ ఇంక్లైన్ లలో పనిచేస్తున్న ఉద్యోగులు,పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.అందరు ఉద్యోగులు ఒకే చోట చేరితే పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకునే అవకాశం ఉంటుందని అందువల్ల ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.వివరాలకు 9490378641 మొబైల్ కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం.

- దశలవారీగా సంపూర్ణ గ్రామ అభివృద్ధికి కృషి.

- గ్రామ సర్పంచ్ శివరాం నాయక్.



లోకల్ గైడ్/తాండూర్: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ శివరాం నాయక్ పేర్కొన్నారు. శనివారం పెద్దేముల్ మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో రూ.10 లక్షల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సిసి రోడ్డు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శివరాం నాయక్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నాయకత్వంలో తాండూర్ నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని అన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వివరించారు.ఇందుకు గ్రామ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోంక నర్సిములు, తాండూర్ యూత్ ప్రెసిడెంట్ అనిల్, జయరాం తండా సర్పంచ్ సురేష్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ సూర్యప్ప ,పార్టీ సీనియర్ నాయకులు అంజిలప్ప, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వినోద్, లాలప్ప, హనుమంతు,శ్రీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ ను పురస్కరించుకొని గౌరవ కౌన్సిలర్ 23 వార్డ్



లోకల్ గైడ్:యూవ్నూస్ బాయ్ గారు వారి ఇంటి వద్ద రంజాన్ దావత్ ఇచ్చి మున్సిపల్ సిబ్బందికి శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వాటర్ సప్లై ఇన్చార్జ్ లింగం మరియు ఎలక్ట్రిషన్ మరియు యూనియన్ నాయకులు ప్రభాకర్, ప్రభు, వార్డ్ ఆఫీసర్, వినయ్, ప్రకాష్, సానిటరీ జవాన్ వారి సిబ్బంది వాటర్ మ్యాన్ ఎస్ కే పాషా ట్యాంకర్ డ్రైవర్ సుదర్శన్ శ్రీకాంత్ మిత్రులు కుమార్ రాజేందర్ వారి కుటుంబ సభ్యులు పాలు పంచుకోవడం జరిగింది యూనుస్ బాయ్ మాట్లాడుతూ మీరందరూ నాకు సహకరిస్తేనే నా వార్డ్ ప్రజలు అందరూ మంచిగా ఉంటారని నేను కూడా ఎల్లప్పుడూ మీకు సహకరిస్తానని మనమందరం కలిసి మెలిసి ఉంటే ఏదైనా అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు,-------- ఇంతవరకు ఏ కౌన్సిలర్ కూడా ఇన్ని సంవత్సరాలల్ల ఎవరు కూడా మున్సిపల్ సిబ్బందిని పిలిచి తన ఇంటికి పిలిచి సన్మానం చేయలేరు మా అందరికీ చాలా సంతోషకరం గా ఉంది ఆయనకు ఆయన కుటుంబ సభ్యులందరికీ రంజాన్ శుభాకాంక్షలు నాయకులు కాట్రియాల ప్రభు,ప్రభాకర్

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



( లోకల్ గైడ్ షాద్ నగర్)ఫరూక్నగర్ మండలం కడియాల కుంట తండా గ్రామ పంచాయతీకి చెందిన రాత్లవాత్ చాంది కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈరోజు తమ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును లబ్ధిదారులైన చాందికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడియాల కుంట తండా డిప్యూటీ సర్పంచ్ తావు సింగ్ నాయక్ మరియు మాజీ సర్పంచ్ బుజ్జి రాజు నాయక్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డులో ప్రభుత్వ భూమి కబ్జా యత్నం...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని13వ వార్డులో అవార్డు కౌన్సిలర్ కను సన్నలలోనే పాఠశాల పక్కన గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ కబ్జాలకు స్థానిక కౌన్సిలర్ ఊతమిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.గంగారాం నగర్ ఏరియాలోని ప్రభుత్వ పాఠశాల పక్కన కాలువకు ఆనుకొని ఉన్న భూమిలో శనివారం యదేచ్చగా చెట్లు కట్ చేసి నాలా కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ కబ్జా వెనుక ఉన్న వారు ఎంతటి వారైనా సరే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక వార్డు ప్రజలు కోరుతున్నారు.ఈ కబ్జా



విషయమై బెల్లంపల్లి తాహసిల్దార్ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కబ్జా కోర్ల నుండి కాపాడాలని బస్తీ ప్రజలు కోరుతున్నారు.

## కామారెడ్డి ఈద్గా వద్ద రంజాన్ వేడుకల్లో పాల్గొన్న షబ్బీర్ అలీ గారు



(లోకల్ గైడ్)పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు కామారెడ్డి పట్టణంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు గౌరవనీయులు షబ్బీర్ అలీ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రార్థనలు నిర్వహించారు.ప్రార్థనల అనంతరం షబ్బీర్ అలీ గారు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం మరియు సహనానికి నిలువుటద్దమని ఆయన పేర్కొన్నారు. ఆకలి విలువను తెలుసుకుంటూ, పేదలకు సహాయం చేయడమే ఈ పండుగ యొక్క అసలు పరమార్థమని వివరించారు. గంగా-జమునా తెహజీబ్ సంస్కృతితో అందరూ కలిసి మెలిసి పండుగను జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## మానవత్వం చాటుకున్న మందమర్రి పోలీసులు.... రోడ్డుపై ప్రమాదకర గుంతను పూడ్చివేసిన పోలీసులు....




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు.రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ఒక పెద్ద గుంతను గుర్తించిన పోలీసులు తక్షణమే స్పందించి ఆ గుంతను పూడ్చివేయించారు.మందమర్రి ప్రధాన రహదారిపై పోలీసులు పెట్రోలింగ్,వాహనాల తనిఖీలు చేపడుతున్న సమయంలో రోడ్డు అంచున ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్న ఒక లోతైన గుంతను గమనించారు.ముఖ్యంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ఈ గుంతను గమనించక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని భావించిన పోలీసులు,ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టారు.జేసీబీ యంత్రాన్ని ఉపయోగించి రోడ్డు పక్కన ఉన్న మట్టి,రాళ్లతో ఆ గుంతను పూర్తిగా పూడ్చివేసి సమాంతరంగా చేశారు.పోలీసుల సమయస్ఫూర్తి వల్ల జరగబోయే పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మందమర్రి ఎస్సై జి నరేష్ మాట్లాడుతు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటం కూడా తమ బాధ్యతే అని,రాత్రి వేళల్లో ఈ గుంత వల్ల వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గుర్తించి వెంటనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.పోలీసుల ఈ చొరవను చూసి అటుగా వెళ్తున్న ప్రయాణికులు,స్థానిక ప్రజలు మందమర్రి పోలీసు యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## వివాహ విందు వేడుకల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



లోకల్ గైడ్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి (21)తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాధిత్య సాక్షి వివాహ విందు కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజక వర్గం ఎమ్మెల్యే మదన్ మోహన్ శనివారం హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసి, వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, అడ్లూర్ లక్ష్మణ్, శాసన మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మరియు రాష్ట్ర రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, విశిష్ట అతిథులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో అలరించినా భరతనాట్య ప్రదర్శనాలు.....




లోకల్ గైడ్ మాదాపూర్ : శిల్పారామం మాదాపూర్ లో రెండు రోజులు శ్రీమతి అంజనా చౌదరి ఆధ్వర్యం లో సృజన ఉగాది సంబరాలు 2026 ఉత్సవాలను నిర్వహించారు. శనివారం శ్రీమతి డాక్టర్ శేషులత విశ్వనాధ్ సంగీత గాత్ర కచేరి అలరించింది. శ్రీమతి మాధవి లత శిష్య బృందం భరతనాట్య



ప్రదర్శనలో పుష్పాంజలి, మూషిక వాహన, గురు బ్రహ్మ, విన్నపాలు, గరుడ గమన, వీణ పుస్తక దారిని, నటేశ కౌతం, గణపతి స్తుతి మొదలైన అంశాలను శ్రీనిక, శ్రీ శరణ్య, అవంతి, సాయి స్నేహ, శ్రీనిత, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## రవీంద్ర భారతిలో తెలుగు నూతన సంవత్సర

ఉగాది శ్రీరామనవమి పండగ సెలబ్రేషన్ సందర్భంగా బీరంగూడ ఆదిత్య గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు




కుత్బుల్లాపూర్ మార్చి 21 (లోకల్ గైడ్ ప్రతినిధి)తెలుగు నూతన సంవత్సర ఉగాది, శ్రీరామ నవమి పండుగల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీరంగూడలోని ఆదిత్య గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. గ్లోబల్ ఈవెంట్స్ ఆర్గనైజింగ్ సంస్థ అధ్యక్షుడు లయన్ కె.వి. రమణారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థులు పి. నందిని, కె. మన్విత, కె. తేజశ్రీ, కె. జశ్వంత్, ఎమ్. నిఖిల్ టైక్వాండో సాహస విన్యాసాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన గణిత ఉపాధ్యాయురాలు సునిత మరియు టైక్వాండో మాస్టారు సూర్య విద్యార్థులు ప్రతిభను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రమణారావు విద్యార్థులు మరియు మాస్టార్ల పేర్లను తెలుగు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేయడంతో పాటు ప్రశంసాపత్రాలతో సత్కరించారు.పాఠశాల డైరెక్టర్




హనీష్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు యోగా, మార్షల్ ఆర్ట్స్, కర్రసాము, టైక్వాండో, సెల్ఫ్ డిఫెన్స్, మ్యూజిక్, డ్యాన్స్, ఆటలు వంటి సహా పాఠ్య కార్యక్రమాలను అందిస్తూ వారి సర్వాంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఇటువంటి అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ పిల్లలను ప్రోత్సహిస్తున్న ఆదిత్య గ్లోబల్ స్కూల్ బీరంగూడ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదివాసీల పట్టా కష్టాలు! ఆరవ రోజుకు చేరిన ఆకలి కేక!

రెవెన్యూ-ఫారెస్ట్ ఫైటింగ్‌లో నలిగిపోతున్న ఆదివాసి బిడ్డలు

రామన్నగూడెం భూపోరాటంపై ప్రత్యేక కథనం




అశ్వారావుపేట, లోకల్ గైడ్ : రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులు కాగితాలకే పరిమితమయ్యాయా? పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా ఆదివాసీల తలరాతలు మారవా? భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ సాక్షిగా గత ఆరు రోజులుగా జరుగుతున్న రామన్నగూడెం ఆదివాసీల నిరవధిక నిరాహార దీక్ష ఈ ప్రశ్నలనే సంధిస్తోంది. తమ స్వంత పట్టా భూముల కోసం దశాబ్దాలుగా అడవి బిడ్డలు చేస్తున్న పోరాటం ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. ఇల్లు, వాకిలి, పశువులను వదిలి, పసిపిల్లలతో సహా రోడ్డెక్కిన ఆదివాసీల ఆర్తనాదం పాలకుల చెవికి ఎందుకు చేరడం లేదన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ సమస్యకు మూలం అశ్వారావుపేట మండలంలోని లంకాలపల్లి అనే రద్దు చేయబడిన రెవెన్యూ గ్రామం. ఒకప్పుడు ఉనికిలో ఉండి, జన సంచారం లేదనే సాకుతో రద్దు చేసిన ఈ గ్రామం పేరు చెప్పి ఫారెస్ట్ అధికారులు రామన్నగూడెం ఆదివాసీల పట్టా భూములను ఆక్రమించుకున్నారనేది ప్రధాన ఆరోపణ. సర్వే చేయకుండానే, హద్దులు నిర్ణయించకుండానే గిరిజనుల సాగు భూములను తమ పరిధిలోకి తెచ్చుకున్న అటవీ శాఖ తీరు వల్ల వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయి. రెవెన్యూ రికార్డుల్లో పట్టా అని ఉన్నా, క్షేత్రస్థాయిలో అటవీ శాఖ కంచె వేయడం అధికారుల మధ్య సమన్వయ లోపానికి పరాకాష్ట. ఎన్నికల హామీలు ఎడారి ఎండమావులు ఓట్ల సమయంలో వస్తారు, కాళ్ళ వేళ్ళ పడతారు. తీరా గెలిచాక మా మొహం చూసే నాథుడే లేడు అని రామన్నగూడెం గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు మారారు, ప్రభుత్వాలు మారాయి. కానీ ఆదివాసీల భూ సమస్య మాత్రం మ్యాపుల మధ్యే నలుగుతోంది. ప్రజాప్రతినిధుల హామీలు కేవలం ఎన్నికల స్టంట్లుగానే మిగిలిపోయాయని, తమను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని వారు మండిపడుతున్నారు. పోలీసు లాఠీలు, అధికారుల వేధింపులు, తమ హక్కుల కోసం గొంతెత్తితే ఎదురయ్యేది పోలీసు కేసులు, ఫారెస్ట్ అధికారుల బెదిరింపులేనని గిరిజనులు వాపోతున్నారు. అభివృద్ధికి వందేళ్ల దూరంలో నెట్టబడిన ఈ గ్రామం, నిత్యం గొడవలు, ఆందోళనలతోనే కాలం వెళ్లదీస్తోంది. పచ్చని పంటలు పండించాల్సిన చేతులు, నేడు జిల్లా కార్యాలయం ముందు నిరసన ప్లకార్డులు పట్టుకోవడం వ్యవస్థ లోపానికి నిదర్శనం. నిమ్మకు నీరెత్తినట్లు యంత్రాంగంఉంది. వరుసగా ఆరో రోజు దీక్ష కొనసాగుతున్నా, ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చీమ కుట్టినట్లయినా లేదు అన్న ఆదివాసీల మాట వారిలోని తీవ్ర అసంతృప్తిని తెలియజేస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఆదివాసీల పట్టా భూములను తక్షణమే వారికి అప్పగించాలని,దశాబ్దాల నిర్లక్ష్యానికి చరమగీతం పాడి, ఆ గ్రామానికి సామాజిక న్యాయం చేయాలని, రామన్నగూడెం ఆదివాసీల ఆత్మగౌరవ పోరాటానికి ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ ఆకలి కేకలు శాంతి భద్రతల సమస్యగా మారకముందే ప్రభుత్వం మేల్కొనాలని ప్రజలు ప్రజాస్వామిక వాదులు హెచ్చరిస్తున్నారు.



Notification

Notification under Section (19) Forest Act, 1355 F, Hyderabad, Thursday, February, 4th 1954.

***

In exercise of the powers conferred by Section 19 of the Hyderabad Forest Act No. 2 of 1355 F. The Rajapramukh is pleased to notify that with effect from one month after the publication of this notification in the official gazette the forest block described herein below and falling within the boundaries as described hereunder shall constitute reserved forest to be called " Lankalpalli." Reserved forest. The forest block of Lankalpalli is situated in the Range Aswaraopet, Taluq Paloncha, District Warangal, Division Paloncha, includes only one village Lankalapally constituting a total area of (1621) acres 36 guntas.

Boundary

The boundary line of this reserve starts from the point "A" as shown in ... village boundary line of Lankalpalli

# ఇదీ ఏఐ ప'వార్'!

**యుద్ధ రంగంలోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్**

**అత్యంత శక్తివంతమైన ఆయుధంగా కొత్త సాంకేతికత**

**ఏఐ ఆధారిత ఆయుధాలకు బిలియన్ల కొద్దీ డాలర్ల వ్యయం**




ఉక్రెయిన్ మొదలు పశ్చిమ ఆసియా వరకు జరుగుతున్న యుద్ధాలలో సైన్యాలు కేవలం డేటా విశ్లేషణకే పరిమితం కాకుండా తమ లక్ష్యాలను వేగంగా గుర్తించడానికి, కదన రంగ సమాచారాన్ని విశ్లేషించడానికి, మిషన్ ప్లానింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడుతున్నాయి. అత్యంత శక్తివంతమైన ఆయుధంగా కొత్త సాంకేతికత ఉపయోగ పడుతోంది. దీనివల్ల కేవలం తెర వెనుక ఉండి సమాచారా న్ని విశ్లేషించే స్థాయి నుండి నేరుగా యుద్ధ రంగంలోకి ఏఐ ప్రవేశించినట్టయింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం.. 2024లో ప్రపంచ సైనిక వ్యయం 9.4% పెరిగి రికార్డు స్థాయిలో 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. సైనిక ఖర్చులో ఇంతటి భారీ పెరుగుదల ఇదే మొదటిసారి. ప్రభుత్వా లు ఏఐ ఆధారిత ఆయుధాలు, సైబర్ వార్‌ఫేర్ సిస ?టమ్స్, శాటిలైట్స్, అటానమస్ డ్రోన్ల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నాయి. 2015 నుండి 2024 మధ్య సైనిక వ్యయం 37% పెరగడం గమనార్హం.

### దేశాల వారీగా సైనిక, ఏఐ వ్యయాలు..

1. అమెరికా: మొత్తం బడ్జెట్ 997 బిలియన్ డాలర్లు (జీడీపీలో 3.40%). 2026 బడ్జెట్‌లో యుద్ధ పరికరాల కొనుగోళ్లు, పరిశోధన కోసం 384 బిలియన్ డాలర్లు కేటాయించారు. అటానమస్, మానవరహిత వ్యవస్థల కోసం ప్రత్యేకంగా 9.8 బిలియన్ డాలర్లు కేటాయించారు.

2. చైనా: మొత్తం బడ్జెట్ 314 బిలియన్ డాలర్లు (జీడీపీలో 1.70%). 2024లో పరిశోధన కోసం చేసిన ఖర్చు 785.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది మొదటిసారి అమెరికా కంటే ఎక్కువ. బైడూ, అలీబాబా వంటి పౌర సంస్థల ఏఐ సాంకేతికతను నేరుగా సైనిక వ్యవస్థల్లోకి అనసంధానిస్తున్నారు. మిలిటరీ గ్రేడ్ ఏఐ మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి కంప్యూట్ క్లస్టర్ల కోసం 70 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నారు.

3. రష్యా: మొత్తం బడ్జెట్: 149 బిలియన్ డాలర్లు (జీడీపీలో 6--7%). ఏఐ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో 10 ఏళ్ల కాలానికి రక్షణ రంగ ఆధునీకరణ ప్రణాళికను ప్రవేశపెట్టింది.

4. భారత్: మొత్తం బడ్జెట్: 93.5 బిలియన్ డాలర్లు (జీడీపీలో 2.40%). పరిశోధన, అభివృద్ధి కోసం రూ.29,100 కోట్లు కేటాయించారు. డీఆర్‌డీఓ, ఇండియన్ నేవీ కలిసి 'మిషన్ సుదర్శన్ చక్ర'అనే ఏఐ ఆధారిత వాయు రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాయి.

### యుద్ధ రంగంలో కృత్రిమ మేధ వినియోగం..

1. ఇజ్రాయెల్--గాజా సంఘర్షణ:

ది గోస్పెల్ (హబ్సొరా): ఇది ఒక ఆటోమేటెడ్ టార్గెట్ సిస్టమ్. మానవ మేధస్సు కంటే 50 రెట్లు వేగంగా భవనాలను, మౌలిక సదుపాయాలను గుర్తించగలదు.

లావెండర్: సోషల్ మీడియా సంబంధాలు, సమాచారం ఆధారంగా తీవ్రవాదులుగా అనుమానిస్తున్న వ్యక్తులను గుర్తించడానికి దీనిని ఉపయోగిస్తారు.

వేర్ ఈజ్ డాడీ?: లావెండర్ గుర్తించిన వ్యక్తులు వారి ఇళ్లకు, నిర్దేశిత ప్రాంతానికి చేరుకున్నప్పుడు సైనిక అధికారులకు సమాచారం ఇచ్చే ట్రాకింగ్ సాధనం.

స్మార్ట్ షూటర్స్: డ్రోన్లను అడ్డుకోవడంలో సహాయపడే ఏఐ ఆధారిత గన్--సైట్స్.

2. ఉక్రెయిన్--రష్యా యుద్ధం:

అటానమస్ డ్రోన్లు: రష్యన్ జీపీఎస్ జామింగ్‌ను అధిగమించి లక్ష్యాలను గుర్తించి దాడి చేయడానికి వీటిని వాడుతున్నారు.

మానవరహిత భూ వాహనాలు: సామాగ్రి సరఫరా, సైనికుల తరలింపు, ప్రత్యక్ష యుద్ధం కోసం ఆయుధాలు కలిగిన రోబోలను రంగంలోకి దించారు.

డెల్టా సిస్టమ్: ఇది ఉక్రెయిన్ ప్రధాన యుద్ధరంగ కంప్యూటర్ వ్యవస్థ. ఉపగ్రహాలు, డ్రోన్లు, క్షేత్రస్థాయి నివేదికల నుండి వచ్చే భారీ డేటాను విశ్లేషించి అధికారులకు రియల్ టైమ్ లక్ష్యాల జాబితాను అందిస్తుంది.

3. వెనిజులా

నికోలస్ మదురోను పట్టుకోవడానికి కారకాస్‌లో జరిగిన దాడులను సమన్వయం చేయడానికి ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐని (పలాంటిర్ ఐటీ కంపెనీ ద్వారా) యూఎస్ మిలిటరీ ఉపయోగించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# ఒంటరి.. డిజిటల్ దరి



**ఆత్మీయ స్పర్శ కోసం ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపానియన్ యాప్స్ వాడకం**

**డిజిటల్ స్నేహితులతోగంటల తరబడి ముచ్చట్లు పెడుతున్న కోట్లాది మంది**

**సాధారణ చాట్‌బాట్స్‌తో పోలిస్తే ఇవి ఎంతో భిన్నం**

**అవతలి వ్యక్తుల భావోద్వేగాలనుఅర్థం చేసుకొని స్పందించే లక్షణం వాటి సొంతం**

పట్టణీకరణ,పనిఒత్తిడి, మారుతున్న సామాజిక సంబంధాలు.. కారణం ఏదైనా నేటి డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కేవలం పనిముట్టుగా మాత్రమే కాకుండా మనుషులకు ఒక 'డిజిటల్ తోడు'గా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో కోట్లాది మంది వినియోగదారులు ఏఐ కంపానియన్ యాప్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా 18--30 ఏళ్ల వయసు వారు ఈ యాప్స్‌ను ఎక్కువగా వాడుతున్నారు. ఈ యాప్స మనుషులతో స్నేహితుల్లా లేదా ఒక తోడులా సంభాషిస్తున్నాయి. సాధారణ చాట్‌బాట్స్ కంటే ఇవి భిన్నమైనవి. వినియోగదారుల భావోద్వేగాలను అర్థం చేసుకొని వారికి తగినట్లుగా స్పందిస్తాయి.

### ఐటీ ఉద్యోగుల వాడకమే అధికం..

వ్యక్తిగత విషయాలను పంచుకోవడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి లేదా కేవలం కాలక్షేపం కోసం 'డిజిటల్ స్నేహితుల'తో యూజర్లు గంటల తరబడి గడుపుతున్నారు. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని యువత, ఐటీ ఉద్యోగులు వాటిని అధికంగా ఉపయోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల వినియోగదారుల్లో 30% నుంచి 50% వరకు సానుకూల మార్పు కనిపిస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మంది ఏఐ కంపానియన్ యాప్స్ వినియోగిస్తున్నట్లు అంచనా. యూజర్లపరంగా అమెరికా అగ్రస్థానంలో ఉంది.

### ఇదీ మార్కెట్..

నాస్కామ్ లెక్కల ప్రకారం 2024లోప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపానియన్ మార్కెట్ విలువ 28 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 30.8% వార్షిక వృద్ధిరేటుతో 2030 నాటికి 140.8 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. గ్రాండ్ వ్యూ రీసెర్చ్ ప్రకారం 2024లోభారత్‌లో ఏఐ కంపానియన్ మార్కెట్ ఒక బిలియన్ డాలర్లుగా ఉంది. 40.4% వార్షిక వృద్ధితో 2030 నాటికి 7.9 బిలియన్ డాలర్లనుతాకుతుందని అంచనా.

### రోజుకు 45 నిమిషాలు..

' భారత్‌లో ఏఐ కంపానియన్ యాప్స్ వినియోగం ప్రపంచ సగటు కంటే 40% వేగంగా పెరుగుతోంది.

' సగటున ఒక్కో వినియోగదారు రోజుకు45 నిమిషాల సమయాన్ని వెచ్చిస్తున్నారు.

' వినోదం కోసమే కాకుండా ఒత్తిడి తగ్గించుకోవడానికి వాటిని ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

ఆధారం: నాస్కామ్, సెన్సార్ టవర్, టెక్నావియో, గ్రాండ్ వ్యూ రీసెర్చ్

### ప్రయోజనాలు ఇవీ..

' సామాజికంగా ఒంటరినని బాధపడే వారికి ఈ యాప్స్ 24/7 అందుబాటులో ఉండే స్నేహితుడిలా తోడుంటాయి.

' కొన్ని యాప్స్ ఒత్తిడి,ఆందోళన, కుంగుబాటుతగ్గించడానికి 'కాగ్నిటివ్‌బిహేవియరల్ థెరపీ' పద్ధతులను వాడుతూసహాయపడతాయి.

' మనుషులతో మాట్లాడితే వారు మనల్ని జడ్జ్ చేస్తారనే భయం ఉంటుంది. కానీ ఏఐతో ఎలాంటి సంకోచం లేకుండా మనసులోని మాటలు పంచుకోవచ్చు.

నష్టాలూ ఉన్నాయి

' మన వ్యక్తిగత విషయాలను పంచుకోవడం వల్ల డేటా హ్యాక్ అయ్యే లేదా ప్రకటనల కోసం అమ్ముడయ్యే ప్రమాదం ఉంది.

' మనుషుల కంటే ఏఐతోనే ఎక్కువ సమయం గడపడం వల్ల నిజజీవితంలో సామాజిక నైపుణ్యాలు తగ్గిపోయి, మనుషులతో మాట్లాడటం కష్టంగా మారవచ్చు.

' మనుషులు ఏఐ స్నేహితులకు బానిసలుగా మారే ప్రమాదం.

' ఏఐ ఇచ్చే సలహాలు వాస్తవ విరుద్ధంగా, ప్రమాదకరంగా ఉండే అవకాశం.

# డీప్‌గా మౌనం..!

**పురుషుల కంటే మహిళలకే డీప్‌ఫేక్ ముప్పు**

**62% సంఘటనల్లో మౌనంగా బాధితులు**

**ఫిర్యాదుల్లో బెంగళూరు, హైదరాబాద్ టాప్**



తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఓ ప్రముఖ నటికి సంబంధించిన మార్ఫింగ్ వీడియో 2023లో దేశవ్యాప్తంగా వైరల్ అయింది. ఆమె ముఖాన్ని వేరొక మహిళ శరీరానికి అంటించిన ఆ క్లిప్ భారతీయులకు ఒక చేదు నిజాన్ని చెప్పకనే చెప్పింది. అదేమిటంటే మహిళలకు వ్యతిరేకంగా అత్యంత శక్తివంతమైన ఆయుధాలలో ఒకటిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవతరించడమే. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ చర్యలు తీసుకునేలోపే ఆ వీడియో 80 లక్షలకుపైగా వ్యూస్‌ను పొందింది. ఈ రెండేళ్లలో ఇటువంటి డీప్‌ఫేక్ కంటెంట్ విస్తృతమైంది. ప్రపంచవ్యాప్తంగా డీప్‌ఫేక్ బాధితుల్లో అత్యధికులు మహిళలే ఉన్నారు. ఏఐ సేఫ్టీ సంస్థ 'పై ల్యాబ్స్'నివేదిక ప్రకారం.. అంతర్జాతీయంగా డీప్‌ఫేక్ బాధితుల్లో 93% మంది మహిళలే. ఇటీవలి కాలంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని సృష్టించిన అనధికారిక కృత్రిమ కంటెంట్ ఏకంగా 900% పెరిగింది. భారత్‌లో మహిళలు బాధితులుగా నమోదైన సైబర్ నేరాల ఫిర్యాదులు 2024లో సుమారు 50వేలు ఉండగా.. 2025 నాటికి 80 వేలకు చేరుకున్నాయి. ఫొటోల మార్ఫింగ్, అసభ్యకరమైన డీప్‌ఫేక్ వీడియోలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇంటర్నెట్‌లో కనిపిస్తున్న కంటెంట్‌లో డీప్‌ఫేక్ పోర్నోగ్రఫీ అత్యధికంగా ఉంటోంది. వాస్తవ వ్యక్తుల పోలికలు లేకుండా పూర్తిగా కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన మహిళా రూపాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతమైన ఆదరణ పొందుతున్నాయి.

### మౌనంగా బాధితులు..

మహిళలకు సంబంధించిన 62% డీప్‌ఫేక్ వేధింపుల ఘటనలు అసలు బయటకే రావడం లేదు. సామాజిక వివక్ష, అవమానం జరుగుతుందనే భయంతో బాధితులు మౌనంగా ఉంటున్నారు. ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొంటున్న భారతీయ మహిళల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది ఎటువంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. చాలామంది ఎదురుదాడి చేయడానికి బదులుగా నిశ్శబ్దంగా తమ డిజిటల్ ఉనికిని (సామాజిక మాధ్యమాల వినియోగాన్ని) తగ్గించుకుంటున్నారు. 33% మందికి తమను రక్షించడానికి ఉన్న చట్టాల గురించి కనీస అవగాహన కూడా లేదు.

### పరిశ్రమలా విస్తరించాయి..

డీప్‌ఫేక్ వీడియోలతో వేధింపులు కేవలం సెలబ్రిటీలకే పరిమితం కాలేదు. విస్తృతంగా ప్రచారంలోకి వచి?చన ఒక కేసులో.. మాజీ భాగస్వామి ఒకరు ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఒక మహిళ చిత్రంతో అసభ్యకరమైన ఇన్‌స్టాగామ్ ప్రొఫైల్‌ను సృష్టించాడు. ఈ విషయాన్ని గుర్తించేలోపే 1.4 మిలియన్ల ఫాలోవర్లను ఆ ప్రొఫైల్ సంపాదించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఐదువేల కంటే ఎక్కువ ఫేస్--స్వాప్ టూల్స్, 1,000 వాయిస్--క్లోనింగ్ అప్లికేషన్స్ ద్వారా ఈ వేధింపులు ఒక పరిశ్రమలా విస్తరించాయి. సాధారణ మహిళలు కూడా సెలబ్రిటీలకు సమానంగా ప్రమాదంలో ఉన్నారు. డీప్‌ఫేక్‌లను అరికట్టుడం అనేది ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది. జెనరేటివ్ ఏఐ టూల్స్ అందరికీ అందుబాటులో ఉండటం, దుర్?వినియోగం చేసే వారి సంఖ్య పెరుగుతుండటమే దీనికి కారణం. వీటిని గుర్తించే సాంకేతికతలు అందరికీ సమానంగా అందుబాటులో లేవు.

# పేద మహిళలకు క్లైమేట్ బీమా

**వడగాడ్పులు, భారీ వర్షాల్లోపేద మహిళలు పనులు కోల్పోతే బీమా చెల్లింపులు**

**ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో 'పారామెట్రిక్ ఇన్సూరెన్స్' అమలు**



అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందే పేద మహిళలు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆదాయపరంగా, ఆరోగ్యపరంగా అభద్రతకు గురవుతున్నారు. తీవ్ర వడగాడ్పులు, భారీ వర్షాలు, తీవ్ర చలిగాలులు వీచే రోజుల్లో పనులకు వెళ్లలేకపోతే ఆదాయం ఉండదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పొట్ట తిప్పలకు పనులకు వెళ్లక తప్పని పరిస్థితుల్లో అనారోగ్యాల పాలవుతున్నారు. వీరికి ఆదాయ, ఆరోగ్య భద్రతను కల్పించడానికి కొన్ని రాష్ట్రాల్లో 'పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్'ను అమలు చేస్తున్నారు.

### పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్ అంటే..

ఈ పని బీమా పాలసీ తీసుకున్న వారికి మాత్రం.. వేడి, చలి, వాన ఒక పరిమితికి మించితే చాలు వీరు పనికి వెళ్లకుండా ఇంటి పట్టునే భద్రంగా ఉంటూ బీమా పరిహారం పొందొచ్చు. వాతావరణం మామూలుగా ఉంటేనే పేద మహిళలకు రోజువారీ పనులు సజావుగా దొరుకుతాయి. వాతావారణంలో ఏ మాత్రం తేడా వచ్చినా వారికి పని ఉండదు. పట్ట ణ / గ్రామీణ ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్లు/ నెత్తిమీద బుట్టలు పెట్టుకొని సరుకులు అమ్ముకునే వారు, చిరు వ్యాపార సంస్థల్లో పనిచేసే వారు, చిన్నాచితకా కూలి పనులు, వ్యవసాయ మహిళా కార్మికులకు రెక్కాడితే గాని డొక్కాడదు. ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ పని మానితే ఆదాయం పోతుందన్న బెంగతో పనులు కొనసాగిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ ఉంటారు. ఇటువంటి వారికి ఆదాయ భరోసా ఇవ్వటానికి ప్రారంభమైనదే పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్.

### అనేక రాష్ట్రాల్లో అమలు

పారామెట్రిక్ క్లైమేట్ ఇనరీ?స్యరెన్స్‌ను తొలుత అమలు చేసిన రాష్ట్రం నాగాలాండ్. కేరళలో పాల సహకార మార్కెటింగ్ సమాఖ్య 1,500 ఎంఎంకి మించి అధిక వర్షపాతం వల్ల పనిదినాలు కోల్పోయే వారికి బీమా అమలు చేస్తోంది. గుజరాత్‌లో ఈ బీమా పథకాన్ని నేషనల్ ఇనరీ?స్యరెన్స్ వైమో సేవ కోఆపరేటివ్ లిమిటెడ్ అనే సహకార బీమా సంస్థ అమలు చేస్తోంది. అహ్మదాబాద్, పరిసర జిల్లాల్లో 2023 ఏప్రిల్‌లో వైమో సేవ సంస్థ ఈ బీమాను తొలుత అమలు ప్రారంభించింది. 2024 నాటికి గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్ లలోని 22 జిల్లాలో 50 వేల మంది 18--70 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ఈ బీమా కల్పించారు.

' వడగాడ్పుల బీమా ప్రీమియంగా ప్రతి మహిళ రూ.350 ప్రీమియం చెల్లించాలి. 43.2 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రత ఎన్ని రోజులు పెరిగితే అన్ని రోజులకు ఒకరికి రోజుకు రూ.400 చొప్పున (అత్యధికంగా రూ. 3 వేలు) పరిహారంగా చెల్లిస్తున్నారు.

' 45.28 అంగుళాలకు మించి వర్షపాతం వల్ల పనులు కోల్పోయినా పరిహారం ఇచ్చే బీమాను కూడా అమలు చేస్తున్నారు. ప్రీమియం రూ.425. అత్యధికంగా రూ. 7 వేల వరకు పరిహారం చెల్లిస్తున్నారు.

' ఉష్ణోగ్రత, వర్షపాతం పెరుగుతున్న కొద్దీ పరిహారం తదనుగుణంగా పెరుగుతుంది.

### పారామెట్రిక్ బీమా అవసరం ఏమిటి?

' 2023లో కనీవిని ఎరుగనంతగా ఉష్ణోగ్రతలు పెరిగిన విషయం గుర్తుంది కదా. దాదాపు వంద రోజుల పాటు ఒక మోస్తరు వడగాడ్పులు వీచాయి. ఆరుబయట పనులు, శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పనులు చేయటం ప్రమాదకరంగా మారింది. 2024, 2025లలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

' ఆ ఏడాది అతి ఉష్ణం వల్ల మన దేశం 18,100 కోట్ల పని గంటలు కోల్పోయింది. తద్వారా రూ. 13 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని లాన్సెట్ అంచనా వేసింది.

' మహిళలు ఎక్కువ క్లైమేట్ రిస్క్‌కు గురవుతుంటారు. గర్భస్రావాలు లేదా నెలలు నిండకుండానే ప్రసవించటం వంటి ఉపద్రవాలను ఎదుర్కొంటూ ఉంటారు.

' మన దేశంలో ఆదాయం కోసం పనిచేసే మహిళల్లో 92% మంది చిన్నా చితకా రోజువారీ పనులు చేసుకొని పొట్టపోసుకునేవారే.

' ప్రతికూల వాతావరణం వల్ల మహిళల సారథ్యంలోని కుటుంబాలు ఎక్కువగా ఆదాయాన్ని కోల్పోతున్నాయని ప్రపంచవ్యాప్త అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక పరిమితికి మించి 1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగితే మహిళ సారథ్యంలోని కుటుంబానికి 34% ఆదాయం తగ్గిపోతోందని ఐరాస ఆహార--వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ--2024) అంచనా.

' ఎండాకాలంలో 97% మంది అసంఘటిత రంగ మహిళా కార్మికుల ఆదాయం తగ్గిపోతోంది. వేడి వల్ల పని సామర్థ్యం తగ్గిపోవటంతో 20--25% రోజువారీ ఆదాయం తగ్గిపోతోందని సర్వే నివేదికలు చెబుతున్నాయి.

# రస్ లఫాన్.. ఇండియాకు కీలకం



**45 శాతం ద్రవరూప సహజవాయువు దిగుమతి ఇక్కడి నుంచే**

ఖతర్ పాలకుల దార్శనికతకు ప్రత్యక్ష రూపమే రస్ లఫాన్ సహజవాయు క్షేత్రం. వేల కోట్ల రూపాయల పెట్టుబడితో అత్యంత అధునాతన సాంకేతికతతో సృష్టించిన అతిపెద్ద సహజవాయు ప్రాసెసింగ్ కర్మాగారంగా 'రస్ లఫాన్ ఇండ్రస్టియల్ సిటీ' ప్రఖ్యాతిగాంచింది. ఖతార్, ఇరాన్ మధ్యలోని పర్షియన్ గల్ఫ్ సముద్రగర్భంలో సహజవాయు నిక్షేపాలను కనుగొనేందుకు 1996లో రస్ లఫాన్ ఇండ్రస్టియల్ సిటీని నిర్మించారు. వీళ్ల ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. 1970 దశకంలో అపార సహజవాయు నిక్షేపాలను ఇక్కడి సముద్రగర్భంలో కనుగొన్నారు. ఇరాన్‌తో కలిసి గ్యాస్‌క్షేత్రాన్ని అభివృద్ధిచేసి ఖతర్ తన వాటాగా నార్త్ ఫీల్డ్‌ను తీసుకుంది. దీనినే నార్త్ డోమ్ అని కూడా పిలుస్తారు. ప్రపంచ 20 శాతం ద్రవరూప సహజవాయు అవసరాలను రస్ లఫాన్ క్షేత్రమే తీరుస్తోంది. తమ ఆ్యదీనంలోని 900 ట్రిలియన్ల ఘనపు చదరపు అడుగుల (టీసీఎస్ఎఫ్) మేర సహజవాయువును రస్ లఫాన్ కాంప్లెక్స్ ద్వారా ఖతార్ ప్రాసెస్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇక్కడే భారీ నౌకలను నిలిపేందుకు వీలుగా ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ నౌకాశ్రయాన్ని నిర్మించారు. దీంతో సీఎన్‌జీ కంటైనర్ షిప్‌లు నేరుగా ప్రాసెసింగ్ ప్లాంట్ల దాకా వచ్చి సరుకు నింపుకుని పయనమవుతాయి. ఇక్కడి నుంచి డజన్లకొద్దీ దేశాలకు ఎల్ఎన్‌జీ ఎగుమతి అవుతోంది. ఖతర్‌కు కాసుల వర్షం కురిపిస్తున్న ఈ నేచురల్ గ్యాస్ ఫీల్డ్ ప్రత్యక్షంగా భారత ద్రవరూప సహజవాయువు అవసరాలను తీరుస్తోంది. దోహా నగరానికి 80 కిలోమీటర్ల దూరంలోని ఈ పారిశ్రామిక నగరమే భారత 45 శాతం లిక్విడ్ నేచురల్ గ్యాస్ అవసరాలను తీరుస్తోంది. ఖతర్ ఆర్థికవ్యవస్థ పునాదులను పెకళించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలు పరోక్షంగా భారత్‌కు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.

### ఎరువులు, సీఎన్‌జీ, పీఎన్‌జీ అంతా ఇక్కడే..

భారత్‌లో దాదాపు 45 శాతం ఎరువుల తయారీ, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) అవసరాలు తీరాలంటే రస్ లఫాన్ క్షేత్రం నుంచి ద్రవరూప సహజవాయువు రావాల్సిందే. భారత్‌లో 34 శాతం ఎరువుల తయారీతోపాటు వాహనాల్లో సీఎన్‌జీకి, గృహావసరాలు తీర్చే పీఎన్‌జీకి రస్ లఫాన్ నుంచి దిగుమతి చేసుకునే ద్రవరూప సహజవాయవునే ఉపయోగిస్తున్నారు. పరిశ్రమల్లో పెట్రోరసాయనాల తయారీకి సైతం ఇదే ఎల్ఎన్‌జీ అవసరం. కొంతమేర భారత విద్యుత్ అవసరాలనూ ఇదే గ్యాస్ తీరుస్తోంది. అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి పోలిస్తే భారత్ రస్ లఫాన్ క్షేత్రం నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకోవడమే అత్యంత చవకైన వ్యవహారం. అందుకే భారత్ దీనిపైనే అధికంగా ఆధారపడుతోంది.

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు పిఎంకె పార్టీతో పొత్తు పెట్టుకున్న శశికళ



చెన్నై : త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పలు రాజకీయ పార్టీలు పొత్తులు పెట్టుకుని ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)కూడా ఈ ఎన్నికల్లో బరిలోకి దిగనుంది. అయితే శశికళ ఈ ఎన్నికల సందర్భంగా పట్టాలి మక్కల్ కచ్చి (పిఎంకె)తో పొత్తు పెట్టుకోనుంది. దీనికోసం ఆమె శనివారం విల్లుపురం జిల్లా తైలపురంలోని పిఎంకె పార్టీ వ్యవస్థాపకుడైె రామదాస్‌ని కలిశారు. ఎన్నికల పొత్తు గురించి, కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటలపాటు ఆమె ఆయనతో చర్చించారు. ఎన్నికల పొత్తుకు తాము సిద్ధమని రామదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని అన్నారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని ఆయన వెల్లడించారు. కాగా శశికళ పార్టీలోనూ, రామదాస్ పార్టీలోనూ అంతర్గత కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలు పొత్తుకు సిద్ధపడి ఎన్నికల్లో పోటీ చేయడం విశేషం.

## ఓటు హక్కును లాక్కోనివ్వం : మమతా బెనర్జీ



కోల్‌కతా : బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను చేపట్టింది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ప్రజల ఓటు హక్కులను లాక్కోవడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రయత్నిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం ఆరోపించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మమతా బిజెపిపై తీవ్రంగా విరుచుకుపడింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కును అడ్డుకునే ప్రయత్నం చేస్తే.. దాన్ని అడ్డుకుంటామని మమతా అన్నారు. నేడు రంజాన్ పండుగ సందర్భంగా మమతా బెనర్జీ కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ల పేర్లను తొలగించడాని ఉపయోగపడింది. ఎస్ఐఆర్ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు జరుగుతన్న విస్తృత ప్రయత్నంలో భాగమని మమతా ఆరోపించారు. మోడీజీ ఓటుహక్కును లాక్కోవడానికి మేము అనుమతించము. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కుల్ని పరిరక్షించేందుకు మేము చివరి వరకు పోరాడతాము అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యంగా మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల నుండి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని టిఎంపి పదేపదే చెబుతోంది. రివిజన్, వెరిఫికేషన్ పేరుతో ఓటర్ల ఓటు హక్కును రద్దు చేసే ఏ చర్యనైనా తమ పార్టీ ప్రతిఘటిస్తుందని మమతా చెప్పారు. బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్నవారు నరకానికి పోవాలి అని బిజెపి నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు అందరూ కలిసి జీవిస్తారు. ఈ సామాజిక బంధాన్ని విచ్ఛిన్నం చేయడానికి మేము ఎవరినీ అనుమతించము అని ఆమె చెప్పారు.

## బహ్రెయిన్ రాజుకు మోదీ ఫోన్..



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇంధన, పౌర మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. చమురు, గ్యాస్ ఉత్పత్తి, నిల్వ కేంద్రాలపై క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించడం అర్థరహితం అని తేల్చిచెప్పారు. ఆయన శుక్రవారం బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియా పరిణామాలపై ఇరువురూ చర్చించుకున్నారు. సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయని మోదీ ప్రస్తావించారు. షిప్పింగ్ మార్గాలకు తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగేలా పశ్చిమాసియా దేశాలు చొరవ తీసుకోవాలని సూచించారు. నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణానికి వీలుగా సముద్ర మార్గాలను తెరవాలన్నారు. బహ్రెయిన్ రాజుతో ఫలవంతమైన చర్చ జరిగిందంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా రాజుకు, బహ్రెయిన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశానని పేర్కొన్నారు. ఇంధన, పౌర మౌలిక వసతులపై దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, ఎరువులు భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతుందని తేలి?చచెప్పారు. బహ్రెయిన్‌లోని భారతీయుల రక్షణకు తగిన చర్యలు చేపట్టినందుకు రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్‌పై యొద్ధం మొదలైన తర్వాత బహ్రెయిన్ రాజుతో మోదీ ఫోన్‌లో మాట్లాడడం ఇది రెండోసారి. ఆయన సౌదీ అరేబియా, జోర్డాన్, యూఏఈ, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ తదితర దేశాల పాలకులతో ఇప్పటికే మాట్లాడారు.

## 'జీవన్‌రెడ్డి పునరాలోచన చేస్తారని అనుకుంటున్నా'

కరీంనగర్ : జీవన్‌రెడ్డి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటారని అనుకుంటున్నానని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కేంద్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలతో జీవన్ రెడ్డి మనస్థాపం చెంది ఉండవచ్చని, ఆయన మంత్రి పదవి ఆశించడంలో తప్పు లేదన్నారు. ఈ మేరకు జీవన్‌రెడ్డి రాజీనామా చేస్తారని నిర్ణయంపై సాక్షి టీవీతో శ్రీధర్‌బాబు మాట్లాడారు. జీవన్ రెడ్డికి భవిష్యత్ లో న్యాయం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ చెప్పారని, పార్టీ ఆదేశం మేరకే ఆయనతో చర్చలు జరిపామన్నారు. తప్పకుండా జీవన్‌రెడ్డి పునరాలోచన చేస్తారని అనుకుంటున్నానన్నారు. కాగా, జగిత్యాల రాజకీయం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా ముహూర్తం దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈనెల 25న అనుచరులతో కలిసి జీవన్ రెడ్డి రాజీనామా చేయనున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలోని బండారి గార్డెన్‌లో మూడు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమైనట్టు తెలుస్తోంది. కార్యకర్తలు, నాయకులతో భేటీ అనంతరం మూకుమ్మడిగా పార్టీకి, పార్టీ పదవులకు రాజీనామా చేయనున్నట్టు తెలుస్తోంది. అనుచరులు, నాయకులతో చర్చించిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉంది. రాజీనామా కోసం ఇప్పటికే ఫంక్షన్ హాల్ బుక్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా ప్రకటన నేపథ్యంలో బుజ్జగింపుల పర్వం ప్రారంభమైంది. కరీంనగర్ మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం.. జగిత్యాలకు చేరుకున్నారు. జీవన్ రెడ్డితో మంత్రులు లక్ష్మణ్, శ్రీధర్ బాబు, మేడిపెల్లి సత్యం భేటీ అయ్యారు.

# మానవ హితమే 'ఈద్' అభిమతం



రమజాన్ నెల ముగిసిన తర్వాత ముస్లిం సమాజం అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే పర్వదినం ఈదుల్ ఫిత్ర్. ఏకధాటిగా నెలరోజులపాటు సాగిన ఆధ్యాత్మిక సాధన స్ఫూర్తితో, మానవీయ విలువలకు నూతన ఆరంభం. ఉపవాసం ద్వారా శరీరాన్ని మాత్రమే కాదు, తన ఆలోచనలను, ప్రవర్తనను కూడా శుద్ధి చేసుకున్న మనిషి ఆ అనుభూతిని సమాజంతో పంచుకునే రోజు ఈద్. అందుకే ఈ పండుగలో కనిపించే ఆనందం కేవలం ఉత్సవపు ఉల్లాసం కాదు; అది ఆధ్యాత్మికత, దానం, సహోదరత్వం, సామాజిక బాధ్యతల సమ్మేళనం. అందుకే ఈ నెలను ఆధ్యాత్మికంగా అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం పాటించడం, రాత్రిళు ప్రత్యేక ప్రార్థనలు చేయడం, ఖుర్ ఆన్ పఠనం, దానం వంటి ఆచారాలు విశ్వాసుల జీవితంలో ఒక శుద్ధి ప్రక్రియలా మారుతాయి. ఉపవాసం ద్వారా ఆకలి, దాహం అనుభూతిని స్వచ్ఛందంగా స్వీకరించడం ద్వారా మనిషి తన కోరికలను నియంత్రించుకోవడం నేర్చుకుంటాడు. అదే సమయంలో పేదసాదల కష్టాలను అర్థం చేసుకునే సానుభూతి కూడా అతనిలో పెరుగుతుంది. ఈ పండుగలోని ముఖ్యమైన ఆచారాల్లో ఒకటి జకాతుల్ ఫిత్ర్ లేదా ఫిత్రా. ప్రతి ముస్లిం కుటుంబం తమ శక్తికి తగ్గట్టు పేదలకు దానం చేయడం సంప్రదాయం. దీని వెనుక ఉన్న భావం ఎంతో గొప్పది. సమాజంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే మానవీయ బాధ్యతను ఇది గుర్తు చేస్తుంది. పండుగ ఆనందం సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరాలనే భావన ఇస్లాం లోని సామాజిక న్యాయ భావనను ప్రతిబింబిస్తుంది. ఈద్ రోజూ ఉదయం మసీదులు, ఈద్ గాహ్‌లలో జరిగే ప్రత్యేక ప్రార్థనలు సమాజంలోని ఐక్యతను ప్రతిబింబిస్తాయి. వేలాదిమంది ఒకేస్థలంలో చేరి, ధనిక, పేద, పెద్ద, చిన్న అనే తేడాలు లేకుండా ఒకే వరుసలో నిలబడి ప్రార్థన చేయడం సమానత్వానికి ప్రతీక. ప్రార్థన అనంతరం ప్రజలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అని శుభాకాంక్షలు తెలుపుకోవడం పరస్పర ప్రేమను, క్షమాభావాన్ని వ్యక్తపరుస్తుంది. ఈదుల్ ఫిత్ర్ తాత్వికంగా కూడా ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. రమజాన్ నెలలో మనిషి తనలోని స్వార్థాన్ని తగ్గించి దయ, సహనం, నియంత్రణ వంటి విలువలను పెం?పొందించుకుంటాడు. ఈ విలువలు కేవలం ఒక నెలకు మాత్రమే పరిమితం కాకుండా జీవితాంతం కొనసాగాలని ఈద్ మనకు గుర్తు చేస్తుంది. నిజమైన ఈద్ అంటే కేవలం ఒక రోజు సంబరం కాదు; రమజాన్ ద్వారా ?పొందిన ఆధ్యాత్మిక మార్పును జీవితంలో నిలబెట్టుకోవడం. సామాజికంగా కూడా ఈ పండుగ గొప్ప ప్రాముఖ్యతను కలిగి ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకోవడం ద్వారా బంధాలు మరింత బలపడతాయి. చాలా సందర్భాల్లో సంవత్సరాలుగా కొనసాగుతున్న అపార్థాలు, విభేదాలు కూడా ఈ సందర్భంలో పరిష్కారమవుతాయి. పరస్పరం క్షమించుకోవడం, మళ్లీ దగ్గరవడం ఈ పండుగకు ప్రత్యేకమైన లక్షణం. నిజమైన ఈద్ కొత్త బట్టలు ధరించడంలో కాదు; కొత్త మనసుతో జీవించడంలో ఉంది. ద్వేషం స్థానంలో ప్రేమను, స్వార్థం స్థానంలో దానాన్ని, విభేదాల స్థానంలో ఐక్యతను పెం?పొందించడమే ఈదుల్ ఫిత్ర్ అసలు ఆత్మ. ఈ ఆత్మను మన జీవితంలో నిలబెట్టగలిగితేనే ఈ పండుగ ఆధ్యాత్మిక, తాత్విక, సామాజిక సందేశం సార్థకమవుతుంది. ఐ

దైవం మనందరికీ ఈ పర్వదినం స్ఫూర్తిని అందిపుచ్చుకొనే అవకాశం అనుగ్రహించాలని కోరుకుందాం. రమజాన్ నెల మనిషికి ఒక ఆత్మపరిశీలన సమయం. తన జీవితంలోకి ఒకసారి తొంగిచూసుకుని, తన లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేసే కాలం. ఈద్ ఆ ప్రయాణానికి ఒక ఆనందకర ముగింపు. అదే సమయంలో ఒక కొత్త సంకల్పానికి ఆరంభం కూడా. ఈదుల్ ఫిత్ర్ పండుగ కేవలం ముస్లిం సమాజానికి మాత్రమే చెందిన పండుగ కాదు; అది మానవత్వానికి సంబంధించిన పండుగ. ఉపవాసం ద్వారా నేర్చుకున్న నియంత్రణ, దానం ద్వారా పెరిగిన దయాగుణం, ప్రార్థన ద్వారా ?పొందిన ఆధ్యాత్మిక బలం -- ఇవన్నీ కలిసి సమాజంలో ప్రేమ, న్యాయం, సామరస్యం స్థాపించడానికి మార్గం చూపుతాయి. అందుకే ఈ పండుగ మనకిచ్చే అసలు సందేశం ఎంతో సరళం, కానీ చాలా గొప్పది.

# వేడి.. ఒత్తి'డే'!

**'జీవనయోగ్యత'ను హరిస్తున్న అధిక వేడి**
**ఆరుబయట సురక్షితంగా రోజువారీ పనులను చేసుకునే సౌలభ్యం తగ్గిపోతోంది**
**ప్రపంచ దేశాలతో పోల్చితే భారతీయులకే అత్యధిక నష్టం**
**గత 75 ఏళ్లలో భారతీయ వృద్ధులు లక్ష కోట్ల గంటలు,యువత 10 వేల కోట్ల గంటలపాటు వేడి బాధలు పడ్డారు**
**అమెరికా పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి**

హైదరాబాద్: ఆరుబయట శరీరాన్ని ఒక మోస్తరుగా కదిలించే చిన్నా చితకా పనులు చెయ్యడం, నడక వంటి వ్యాపకాలు ఆరోగ్యదాయకమని అందరికీ తెలిసిందే. ఈ జీవనయోగ్యతకు అధిక వేడి విఘాతం కలిగిస్తోంది. ఎంత సమయం మేరకు ఇలా హరించుకుపోతోందో అమెరికా పరిశోధకులు తాజాగా లెక్కగట్టారు. వృద్ధులే కాకుండా యువత కూడా బోల్డన్ని 'జీవనయోగ్యమైన గంటల'సమయాన్ని కోల్పోతున్నారో శాస్త్రీయంగా పరిశోధించారు. మిగతా దేశాల్లో కన్నా మన దేశంలోనే జీవనయోగ్యత తగ్గిపోతోందంటున్నారు. భూమి వేడెక్కుతున్న కొద్దీ, తీవ్రమైన వేడి మానవ ఆరోగ్యానికి, ముఖ్యంగా వృద్ధులకు, పేద ప్రజలకు తీవ్రమైన ముప్పుగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న వేడితో జీవన సౌలభ్యం తగ్గిపోతోంది. మానవుల పనుల వల్ల పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజల జీవనానందాన్ని హరిస్తున్నాయి. అమెరికా నిపుణుల తాజా అధ్యయనంలో ఆశ్చర్యకరమైన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. డాక్టర్ ల్యూక్ అలెగ్జాండర్ పార్సన్స్ నేతృత్వంలో పలు అమెరికా విశ్వవిద్యాలయాల పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు.

'ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్:హెల్త్ జర్నల్'లో ఇటీవల ఈ అధ్యయన నివేదిక ప్రచురితమైంది. నడవడం లేదా రోజువారీ తేలికపాటి ఇంటి పనులను సురక్షితంగా చేసుకునే సామర్థ్యాన్ని వేడి ఎలా ప్రభావితం చేస్తున్నదో అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం చేశారు. ప్రపంచవ్యాప్తంగా గంటల వారీ ఉష్ణోగ్రత, తేమకు సంబంధించిన డేటాను (1950--2024) విశ్లేషించారు. ఆరోగ్యవంతులైన యువకులు (18--40 సంవత్సరాలు), వృద్ధుల(65 ఏళ్లు పైబడినవారు) పై దృష్టి కేంద్రీకరించారు.



### 'జీవనయోగ్యత'అంటే?

ప్రజలు వేడి వలన శరీర ఉష్ణోగ్రత ప్రమాదకరంగా పెరగకుండా.. తేలికపాటి నుంచి ఒక మోస్తరు శారీరక శ్రమను కలిగించే రోజువారీ (కూర్చోవడం, నడవడం, తేలికపాటి ఇంటిపనులు) పనులను సురుక్షితంగా, సౌకర్యవంతంగా చెయ్యగలిగే సానుకూల వాతావరణ పరిస్థితులను 'జీవనయోగ్యమైన'(లివబుల్) కాలంగా చెప్పుకోముచ్చు. అయితే, పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ఈ సౌలభ్యం తగ్గిపోతోంది. అనుదినం విలువైన 'జీవనయోగ్యమైన సమయం'అంతకంతకూ తగ్గిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ నానాటికీ ఇది కుంచించుకోపోతోందని అధ్యయనంలో వెల్లడైంది.

### ఉద్గారాలు తగ్గించాల్సిందే..

జనసాంద్రత ఎక్కువగా ఉండే దేశాల్లో, ముఖ్యంగా మన దేశంలో, ప్రజలకు వేడి బాధలు ఎక్కువని కూడా ఈ అధ్యయనం తేల్చింది. భారతీయ యువత 10 వేల కోట్ల గంటలు, వృద్ధులు లక్ష కోట్ల గంటలకు పైగా హాయిగా గడిపే 'జీవనయోగ్యమైన'సమయాన్ని కోల్పోయారని చెబుతోంది. వేడి ఒత్తిడిని తట్టుకోవటంలో వృద్ధులకు తక్కువ సామర్థ్యం ఉంటుంది కాబట్టి వీరికి ఎక్కువ గంటలు అసౌకర్యం కలుగుతోందని గుర్తించారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, వేడిని తట్టుకోవటానికి మరింత గట్టి చర్యలు తీసుకోకపోతే, ఈ ముప్పు మరింతగా పెరుగుతూనే ఉంటుందని ఈ అధ్యయనం హెచ్చరిస్తోంది.

### వృద్ధుల్లో 78%,యువతలో 35% బాధితులు

గత 75 సంవత్సరాలుగా వేడి ప్రాంతాలలో ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా ఆరుబయట గడపగలిగే గంటల సంఖ్య తగ్గిపోయిందని, తద్వారా జీవనయోగ్యత కూడా తగ్గిందని ఈ అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉష్ణమండల ప్రాంతాల్లో, అల్పాదాయ ప్రాంతాల్లో ప్రజలు చాలా వేడి సమయాన్ని అనుభవిస్తున్నారు. ప్రతి సంవత్సరం వందల నుంచి వేల గంటలను వేడి వాతావరణంలో గడుపుతున్నారు. వృద్ధులు ముఖ్యంగా ప్రమాదంలో ఉన్నారు. కొన్ని నివాస ప్రాంతాల్లో సంవత్సరానికి 3,000 గంటల వరకు సురక్షితం కాని స్థాయిలో వేడి ఒత్తిడిని అనుభవిస్తున్నారు. కలిగిన కుటుంబాల్లోని వృద్ధులు నీడ పట్టున లేదా ఏసీ గదుల్లో గడుపుతుంటే.. పేద వృద్ధులు బయట పనులు ఎక్కువ సేపు చెయ్యలేక తక్కువ సంపాదనతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

### వృద్ధులకే ఎక్కువ ఇబ్బంది

వృద్ధులకు వేడి వలన కలిగే ఇబ్బంది యువతతో పోల్చితే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఏటా సగటున 900 గంటల పాటు వీరు వేడి వల్ల తీవ్ర అసౌకర్యంగా జీవిస్తున్నారు. 1950లలో ఇది సంవత్సరానికి 600 గంటలే. దీని అర్థం ఏమంటే, సంవత్సరంలో సుమారు 10 శాతం కాలం పాటు, తీవ్రమైన వేడి కారణంగా వృద్ధులు ఆరుబయట తేలికపాటి పనులు చేయటం కూడా సురక్షితం కాదు. ఆ మేరకు వారు ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం పెరుగుతుంది. ఒకే రకమైన పరిసర ఉష్ణోగ్రత, తేమ ఉన్నప్పటికీ యుక్తవయస్న?కల శరీరాలు చెమటను విడుదల చేయడం ద్వారా తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడం లేదా చల్లబరచుకోవడం జరుగుతుంది. అయితే, వృద్ధుల శరీరాలు ఈ పనిని అంత సమర్థవంతంగా చేయలేవని పరిశోధకులు వివరించారు.

# బెంగాల్ 'సర్' తేలేదెప్పుడు?




నిరుడంతా బిహార్‌లో కలకలం సృష్టించి, బెంగాల్‌లో అంతకుమించిన వివాదాలతో గత నెల 28న ముగిసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో మొత్తానికి 8.09 శాతం మంది ఓటర్లు... అంటే 60.06 లక్షల మంది జాబితాల నుంచి కనుమరుగై, నికరంగా 7.04 కోట్ల మంది అసలైన ఓటర్లుగా తేలారని ఎన్నికల సంఘం(ఈసీ) చెబుతోంది. జాబితాలో లేనివారు న్యాయనిర్ణయ పరిధి(అజ్యుడికేషన్)లో ఉన్నట్టు లెక్క. ఇలాంటి వారి వినతులను పరిష్కరించటానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్‌ను మంగళవారం కోరింది. ఈ ప్రక్రియ ముగిశాకే బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలుంటాయా... ముందే పూర్తవుతాయా అన్నది చెప్పేవారు లేరు. సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమారే ఆ విషయంలో స్పష్టత ఇవ్వటానికి నిరాకరించారు. చాలా అంశాల్లో ఇలా మౌనంగా ఉండిపోవటం ఆయనకు అలవాటే కనుక అందులో ఆశ్చర్యమేమీ లేదు. మన దేశంలో మంచికో చెడుకో అట్టడుగు ప్రజానీకంలో దృఢమైన విశ్వాసం ఒక టుంటుంది. ఓటు హక్కు లేకపోతే మనిషి బతికున్నా చనిపోయినవాళ్లతో సమానమని వారు నమ్ముతారు. నిజానికి అంత నమ్మకం ఉండబట్టే... పార్టీలు దొంగ హామీలిచ్చి నెగ్గుతూ, అటుపై అధికారం వెలగబెడుతూ వంచిస్తున్నా మరో దఫా ఎన్నికల్లో ఓటేయటానికి ఎంతో నిబద్ధతతో క్యూలో నిలబడతారు. సామాన్యుల్లో ఉన్న ఈ అచంచల విశ్వా సమే మన ప్రజాస్వామ్యాన్ని ఈ మాత్రంగానైనా నిలబెడుతోంది. బిహార్‌లో 'సర్' ప్రక్రియకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లోనే ప్రధాన పోరాటం సాగింది. బెంగాల్ పరిస్థితి భిన్నం. అక్కడున్నది మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కనుక నిరసనలు, ఇతరత్రా ఉద్యమాలు జోరుగానే కొనసాగాయి. అలాగని న్యాయస్థానాలను విస్మరించలేదు. స్వయానా మమత సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఎంతో ఊరటనిచ్చేవి. ఎందుకంటే ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు గోడు చెప్పుకోవటానికి హైకోర్టు పర్యవేక్షణలో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు ఏర్పడతాయి. నిర్ణయాధికారం అధికారులకే అప్పగిస్తే ఇష్టానుసారం చేస్తారన్న భయం ఉండేది. కానీ ట్రిబ్యునళ్లు ఈ సమస్య లేకుండా చేశాయి. నిజానికి ఈ వివాదానికి మూలం ఈసీ తీరులో ఉంది. ఫలానా ప్రాంతంలో ఓటరుగా నమోదైన వ్యక్తి ఇక్కడ ఉండటం లేదనో, దొంగ ఓటరనో ఫిర్యాదు చేయడానికి 'ఫామ్--7' వెసులుబాటు ఉంది. అయితే అలా ఫిర్యాదు చేసినవారి వివరాలు చాలా సందర్భాల్లో సక్రమంగా లేవు. ఎదుటి పార్టీకి పట్టున్న ప్రాంతాల్లోని ఓటర్లు నకిలీలని వచ్చిన ఫిర్యాదులు కోకొల్లలు. దాదాపు అన్ని పార్టీలూ ఈ పనిచేశాయి. వాటి ఆధారంగా ఓటర్లకు నోటీసులీయటం, పత్రాలు తీసుకురావాలని ఆదేశించటం, తీరా నిబంధనల ప్రకారం 2002 రికార్డులతో లింక్ లేని (అన్‌మ్యాప్‌డ్) సంగతి బయటపడటం, పేర్లలో అక్షరక్రమం కొంచెం తేడావచ్చినా అనర్హులుగా జమవేయటం సాధారణ ఓటర్లకు తలనొప్పిగా మారింది. చిత్రమేమంటే ఒక బీజేపీ నాయకురాలి పేరుమీద దాఖలైన ఫిర్యాదుల సంగతి అధికారులు చెబితేగానీ ఆమెకు తెలియలేదు. దొంగ ఫిర్యాదులపైనా, వాటి ఆధారంగా నిర్ణయం తీసుకున్న వారి పైనా వెనువెంటనే చర్యలుంటే

ఈ అరాచకం ఆగేది. కానీ దానికి సమయం పడుతుంది. బంగ్లాదేశ్‌కు పొరుగున ఉండటం బెంగాల్ ముస్లింలకు తలనొప్పిగా మారింది. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగినవారు కూడా అక్రమ వలసదారులన్న ఫిర్యాదులతో అందు కవసరమైన పత్రాలు సేకరించలేక, పత్రాలున్నా పరిశీలనలో పేర్లలో కనబడిన స్వల్ప తేడా వల్ల జాబితాల నుంచి గల్లంతైనవారు అనేకులు. ఇలాంటి సమస్యలుంటాయని ఎన్నికల సంఘం ముందే అంచనా వేసి, తరుణోపాయం సూచిస్తే ప్రజలు న్యాయ స్థానాలకెక్కే అవసరం ఉండకపోయేది. కానీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు పూర్తయి రెండేళ్లు కావస్తున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులపై ఇంతవరకూ ఉలుకూ పలుకూ లేకుండా మిగిలిపోయిన ఎన్నికల సంఘం ఇంతకన్నా మెరుగ్గా ఎలా ఉంటుంది? నిజమైన ఓటర్లకు సత్వరన్యాయం లభించాలని కోరుకోవటం మినహా ఎవరూ చేయగలిగింది లేదు.

## పేదల పాలిట వరంగా మారిన సీఎంఆర్ఎఫ్ పథకం

ఎంత పెద్ద వ్యాధి అయిన పేదలు ధైర్యంగా వైద్యం చేయించుకుంటున్నారు

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

దేవుని బండ తాండవాసులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



( లోకల్ గైడ్ షాద్ నగర్) కాయ కష్టం చేస్తూ పూటగడిపే పేదవాళ్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అండగా నిలబడుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా ఎంత పెద్ద రోగమైన పేదలు ధైర్యంగా చికిత్స చేయించుకుంటున్నారూ ఒకరోజు పని చేస్తేనే పూట గడిచే పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు ఫరూక్ నగర్ మండలం దేవుని బండ తండ గ్రామపంచాయతీ తాండ వాసులు మూడవత్ చందులాల్ కేతావత్ శ్రీను ఇద్దరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బలరాజ్ గ్రామ ఉప సర్పంచ్ బాదావత్ శ్యామ్ లాల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుమన్ నాయక్ సీపీఐ పార్టీ నాయకుడు ఎం పవన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ముస్లిం సోదరసోదరిమణులకు రంజాన్ శుభాకాంక్షలు- జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మార్చి 21. (లోకల్ గైడ్) మునుగోడు రోడ్డు ప్రార్థన మందిరం ఈద్గాను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ..రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ప్రార్థన మందిరం ఈద్గాను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈద్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రార్థన మందిరాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకునేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో శాంతి భద్రతలను కాపాడాలని ఆయన సూచించారు నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించి రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు జిల్లా ఎస్పీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## శ్రీరామ శోభయాత్రను విజయవంతం చేద్దాం ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి
## శ్రీరామ నవమి సందర్బంగా శ్రీరామ శోభయాత్ర

హిందూ వాహిని ఆధ్వర్యంలో శ్రీరామ శోభయాత్ర ఆహ్వానం

ఎమ్మెల్సి నవీన్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందచేత



( లోకల్ గైడ్ షాద్ నగర్)ఈనెల మార్చ్ 27 న శ్రీరామనవమి రోజున షాద్ నగర్ లో నిర్వహించబోయే శ్రీరామ శోభాయాత్ర కార్యక్రమానికి గౌరవ ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి గారిని వారి కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రాని అందజేశారు హిందూ వాహిని సభ్యులు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటుచేస్తున్న శ్రీరామ శోభాయాత్రను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ కౌన్సిలర్ నడికుడ రఘునాథ్ యాదవ్,ప్యాట అశోక్,సర్పంచులు అనూష రవీందర్ రెడ్డి,భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచులు,యారం శేఖర్రెడ్డి,శేఖర్ పంతులు,నాయకులు దినేష్ నగర్,శివచారి,అన్వారీ రాజు,నడికుడ సంతు యాదవ్, అమరేందర్,హిందూ వాహిని సభ్యులు చెట్ల వెంకటేష్,క్యామ మహేష్,సల్లా మహేష్,చింతకుంట రాఘవేందర్, గుండు అశోక్, కిరణ్ గౌడ్,పసులోటి శ్రావణ్, గుడాల రమేష్,శీలం శ్రీకాంత్,లింగారం సాయి,అశోక్,సిచ్ కుమార్, కర్ణాకోట అంజి,నార్ల శ్రీనివాస్,అల్లాడి శ్రీను, గుండ్ల అశోక్, రాజు చారి,శ్రీకాంత్, భాను మరియు హిందు వాహినీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## మందమర్రిలో ఘనంగా రంజాన్ వేడుకలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రంజాన్ పండుగ పురస్కరించుకొని మందమర్రి విద్యానగర్,సీఈఆర్ క్లబ్ సమీపంలోనీ ఈద్గాల వద్ద స్థానిక ముస్లింలతో కలసి కార్మిక,మైనింగ్ శాఖల మంత్రి వివేక్ శనివారం సామూహిక ప్రార్ధనలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఆనంతరం మంత్రి మాట్లాడుతు గంగ జమున తహసీవ్ లాగా చెన్నూరు



నియోజకవర్గంలో ముస్లిం సోదరులు పాటిస్తారని,ప్రేమ అనురాగాలు,మానవత్వంతో ప్రజలందరు ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని ఆకాంక్షించారు. మందమర్రిలో 50లక్షలతో షాదిఖానా,ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసేందుకు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.అదేవిధంగా సింగరేణి సంస్థతో మాట్లాడి ఈద్గా వద్ద కమాన్ ఏర్పాటుకు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్,మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి మొండిచేయి....



బెల్లంపల్లి (లోకల్ గైడ్)తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మొండి చెయ్యి. చూపిందని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు.3,24,234 కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయించిందని కేవలం 26,674 కోట్లే అని,2026-27 ఆర్థిక సంఘం కేటాయింపులలో విద్యారంగానికి బడ్జెట్ లో కేటాయించిన నిధులు 8.22శాతం మాత్రమేనని 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.6శాతం కేటాయించగా ఈ సారి ఆ కేటాయింపులు 8.22శాతం మాత్రమే ఈ రెండు బడ్జెట్లలో వ్యత్యాసం కేవలం 0.6శాతం మాత్రమేనని అన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో విద్యారంగానికి15శాతం నిధులు కేటాయిస్తామన్నారని,ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ 18శాతం నిధులు కేటాయించాలని నివేదిక ఇచ్చిందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని తేటతెల్లం అయిందని అన్నారు.ఈ పద్దులలో కేటాయించిన కేటాయింపుల్లో 80శాతం పైగా కేవలం జీతాలకే సరిపోతుందని ఇంటిగ్రేటెడ్ పాఠశాలలే కానీ విద్యామిషన్ నివేదిక అంటున్న తెలంగాణ పబ్లిక్ పాఠశాలలే కానీ ఎలా ఏర్పాటు చేస్తారని,విద్యార్థుల స్కాలర్షిప్ లే పెండింగ్లో ఉన్న పరిస్థితి తెలిసిందే విద్యార్థులు సర్టిఫికెట్ లు తెచ్చుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.మరోవైపు మౌలిక సదుపాయాలు లేక ప్రాథమిక పాఠశాలలు నుండి యూనివర్సిటీల వరకు విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బడ్జెట్లో విద్యకు నామమాత్ర కేటాయింపులు చేయడం విద్యావ్యవస్థను సమూలంగా నాశనం చేయడమేనని ఆరోపించారు.అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి మాటల్లో తప్ప ఆచరణలో లేదని,ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపుతోవిద్యార్థులకు కాంగ్రెస్ ద్రోహం చేస్తున్నదని తేటతెల్లం అవుతుందని అన్నారు.

## బెజ్జంకి మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల ప్రారంభం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్ తెలంగాణ) మార్చి21: బెజ్జంకి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ్రాజూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న మరియు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను గౌరవ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తమ పంటలను దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకు రైతులకు న్యాయం జరిగేలా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు.వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు సౌకర్యవంతమైన సేవలు అందుబాటులో ఉంటాయని, పంటల విక్రయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్న ముస్లిం సోదరులు.

వేడుకలలో పాల్గొన్న చైర్మన్ తూనం.శ్రవణ్ కుమార్.





తొర్రూర్ (లోకల్ గైడ్ )తొర్రూర్ మున్సిపల్ పరిధిలోగల ఈద్గా లో తొర్రూరు మండల ముస్లిం సోదరులు ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. పవిత్ర దైవ గ్రంథం ఖురాను అవతరించినది "రమదాన్" మాసంలోనే ...రమదాన్ పండుగ కు మరో పేరు "ఈద్ ఉల్ ఫిత్ర". ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్రా జకాత్ దానధర్మాలు చేస్తుంటారు. పండుగలు మన జీవన ప్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తూ ఉన్నాయి. ' పండుగ ' అనేది ఏ మతానికి సంబంధించినదైనా సరే..... దాని వెనుక ఒక సందేశం దాగి వుంటుంది. ' పండుగ ' మానావాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే "రమదాన్" పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది.ముస్లింలు చాంద్రమాన కేలండర్ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల "రమదాన్", దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం ' దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే! క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే "రమదాన్" మాసం రంజాన్ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు చైర్మన్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపినారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం



తొర్రూరు (లోకల్ గైడ్ ) హైదరాబాద్ ఎల్ బీ స్టేడియం మరో అద్భుత చారిత్రక ఘట్టానికి వేదిక కాబోతోంది అని నేడు 22న ఆదివారం ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ ట్రస్టు సౌజన్యంతో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. దాదాపు 30 వేల మంది వైశ్యులు ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించిన 102 చరణాలతోకూడినవాసవీపారాయణాన్నిసామూహికంగాఆలపించనున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇన్ని వేల మంది ఒకే స్వరంతో పారాయణం చేయడం ప్రపంచరికార్డు కానుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఘనతను రికార్డు చేయడానికి గిన్నిస్ ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక , సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులందరినీ ఒక్కతాటిపైకి తేవడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త వెల్లడించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని ఆమె కోరారు. శనివారం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త నేతృత్వంలో జరగనున్న ఈ ధార్మిక, సామాజిక కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ముఖ్య అతిథులుగాహాజరవుతున్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇందులో పాల్గొంటున్నారు. ఏఐసీసీ సెక్రెటరీ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మాజీఎంపీటీజీవెంకటేశ్,ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి టీజీ భరత్ గౌరవఅతిథులుగాపాల్గొంటున్నారు. అధికారులు జయేశ్ రంజన్, సి.హెచ్.ప్రియాంక, వేముల శ్రీనివాస్, ఆర్ వీ కర్ణన్ లు ప్రత్యేక అతిథులుగా హాజరవుతున్నారు. 16 మంది పీఠాధిపతులు ఈ కార్యక్రమంలోభక్తులనుద్దేశించి మాట్లాడనున్నారు. అనేక సంఘాల భాగస్వామ్యం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్), ఫెడరేషన్ ఆవోపాస్ ఆఫ్ ఇండియా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ లాంటి అనేక వైశ్య సంఘాలు, సేవా సంస్థలు, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీలు శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవంలోపాలుపంచుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున ఈ మహోత్సవానికి స్వచ్ఛందంగా వస్తున్నారని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ ట్రస్టు గౌరవాధ్యక్షులు బెల్డి శ్రీధర్ తెలిపారు. ఈమహోత్సవానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. అయితే హాజరు కాదలచిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే వేలాది మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వెల్లడించారు. వారి కోసం అన్ని ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు. గాయని కల్పన ప్రత్యక్షంగా వాసవీ పారాయణాన్నిఆలపించనున్నారని రంజని సిస్టర్స్ భజన్ జామింగ్ తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలనుఈవేదికపైప్రదర్శించనున్నారన్నారు.

## నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి రెడీ రేపు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభం, ఏర్పాట్లను సమీక్షించిన మంత్రులు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ తెలంగాణ)మార్చి21:సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కార్యక్రమం నేపథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అధికారులు కలిసి



విస్తృతంగా ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా హెలిప్యాడ్‌ను తనిఖీ చేసి పోలీసులకు భద్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ స్థలం, 150 స్టాల్స్, రిఫైనరీ శంకుస్థాపన ప్రదేశం మరియు సభ స్థలిని పరిశీలించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణలో ఆయిల్ ఫామ్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉత్తర తెలంగాణ రైతులకు ఈ ఫ్యాక్టరీ ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి పెట్టాలని, ఇది లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు. గంటకు 30 నుండి 180 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం ఈ ఫ్యాక్టరీకి ఉందని చెప్పారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, 32 ఎకరాల్లో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీను కేవలం 16 నెలల్లో పూర్తి చేయడం విశేషమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ఇది ప్రోత్సాహకంగా నిలుస్తుందని అన్నారు. రైతులు పంటను విక్రయించిన మూడు రోజుల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు.ఇక్కడే ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుతో "విజయ" బ్రాండ్ ద్వారా నూనె సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అలాగే వ్యర్థాలతో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే పవర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి పాల్గొనే ఈ రైతాంగ మహోత్సవానికి రైతులు భారీగా హాజరుకావాలని మంత్రులు పిలుపునిచ్చారు.

## మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది...

మంత్రి వివేక్..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు ముస్లిం మైనార్టీల అభివృద్ధి పట్టించుకోలేదని మైనింగ్ కార్మిక శాఖల మంత్రి గడ్డం వివేక్ అన్నారు.శనివారం చెన్నూరులో పర్యటించిన మంత్రి స్థానిక ముస్లిం మైనార్టీ మహిళలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కుట్టుమిషన్లు మహిళలకు ఆర్థికంగా చేయూతకు తోడ్పాటు నందిస్తాయన్నారు.మైనార్టీల అభివృద్ధి కోసం కృత నిశ్చయంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.2026 రాష్ట్ర బడ్జెట్ లో ఇందిరమ్మ ఇళ్లకు 5వేల కోట్లు కేటాయించామన్నారు.స్వంత స్థలం ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు.అదేవిధంగా రంజాన్ పండుగ పురస్కరించుకొని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీనియర్ ముస్లింల నివాసాలకు వెళ్లి వారికి వారి కుటుంబ సభ్యులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.రంజాన్ పండుగ శాంతి,సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ పవిత్ర పండుగ అందరి జీవితాల్లో ఆనందం,ఐశ్వర్యం నింపాలని,సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు మినరల్ వాటర్ బాటిల్ల పంపిణీ.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మహర్షి 21. (లోకల్ గైడ్).ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను పురస్కరించుకుని మినరల్ వాటర్ బాటిల్ పంపిణీ చేశారు.నల్గొండ జిల్లా మునుగోడు రోడ్డు ఈద్గా మజీద్ నందు ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్జీవోఎస్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు వన్ టౌన్ సీఐ గ్రంథాలయ చైర్మన్ మంచినీటి కార్యక్రమాన్ని ప్రారంభించి నల్గొండ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అడ్వకేట్ కట్టెల శివకుమార్ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం నెలరోజులు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయం అని తెలిపారు హిందూ ముస్లిం సోదరులందరూ కలిసిమెలిసి ఉండాలని రాజకీయ పార్టీలకతీతంగా ఐక్యతతో కలిసి ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ అధ్యక్షులు నాగిళ్ల మురళి ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి వన్ టౌన్ సిఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి శాంతియుత సంఘం ఆఫీస్ ఖాన్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మరియు పెన్షనర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి బిక్షపతి మైనార్టీ వెల్ఫేర్ జిల్లా నాయకులు డాక్టర్ ఏ ఏకాన్ బిఎంపి పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ నజీరుద్దీన్ అడ్వకేట్ బిఎస్పి సీనియర్ నాయకులు ఎండి మసీయుద్దీన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కట్టెల రాములు ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు బండారు శంకర్ జిల్లా ఉపాధ్యక్షులు ఇరిగి బిక్షం సెంట్రల్ కమిటీ మెంబర్ కొండేటి నరేష్ కుమార్ సంఘం సలహాదారులు కందుల విజయ్ కుమార్ రాష్ట్ర కోఆర్డినేటర్ బాకీ తరుణ్ జిల్లా కన్వీనర్ అల్లంపల్లి కొండన్న నియోజకవర్గ ఇన్చార్జ్ మోత్కూరి కార్తీక్ సోషల్ మీడియా కన్వీనర్ ఈరిగి సిద్దు ఉపాధ్యక్షులు గోపి నాయక్ , కందుల సంపత్ తదితరులు పాల్గొనడం జరిగింది

## మార్చి 23న సిద్దిపేటలో ప్రజావాణి రద్దు కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్ తెలంగాణ) మార్చి21:సిద్దిపేట జిల్లా కార్యాలయంలో 2027లో జరగనున్న జనాభా లెక్కల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో, ఈ నెల 23వ తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయం, సిద్దిపేటలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఆ రోజు ప్రజావాణి కోసం కలెక్టర్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రకటనను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, సిద్దిపేట జిల్లా విడుదల చేసింది.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\